CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి 11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 44 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 26 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE : 44 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 26 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## కర్ణాటకలో పెను విషాదం

### లారీ-బస్సు ఢీ.. మంటల్లో చిక్కుకుని 13 మంది సజీవ దహనం!

- ఈ తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఘటన
- సుమారు 30 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి గోకర్ణకు వెళ్తున్న బస్సు
- గోర్లట్టు వద్ద ఎదురుగా వచ్చి బలంగా ఢీకొన్న లారీ
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటకలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిబూడిదవగా.. ప్రాథమిక సమాచారం ప్రకారం 13 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమైనట్లు తెలుస్తోంది.బెంగళూరు నుంచి గోకర్ణకు సుమారు 30 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఈ బస్సు.. హెబ్బులి హైవేపై హిరియూర్ సమీపంలోని గోర్లట్టు వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో, ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది.లారీ ఢీకొన్న వెంటనే బస్సులో మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే వాహనం మొత్తం వ్యాపించాయి. మంటల ధాటికి బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో బస్సులో

వివరాలు 2లో..

## కిలిమంజారో పర్వతంపై విషాదం.. హెలికాప్టర్ కూలి ఐదుగురి మృతి



- కిలిమంజారో పర్వతంపై కూలిన రెస్క్యూ హెలికాప్టర్
- అనారోగ్యానికి గురైన పర్యాటకులను రక్షించేందుకు వెళ్తుండగా ఘటన
- మృతుల్లో ఇద్దరు చెక్ రిపబ్లిక్ పర్యాటకులు, పైలట్, డాక్టర్, గైడ్

**హైదరాబాద్ పెన్ పవర్:** టాంజానియాలోని కిలిమంజారో పర్వతంపై ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు

వివరాలు 2లో..

## కేసీఆర్ కుటుంబం తెలంగాణకు శని

### జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో కేసీఆర్ చెప్పాలి..



- కాళేశ్వరం స్కామ్ నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ కృష్ణా జలాల గురించి మాట్లాడుతున్నారన్న సంజయ్
- ముదుపుల కోసం తెలంగాణను తాకట్టు పెట్టారని మండిపాటు
- రేవంత్ భాష ఆయన్నే నష్టపరుస్తుందని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** కృష్ణా నదీ జలాల అంశంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కాం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ ఇప్పుడు కృష్ణా జలాల విషయాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని స్పష్టంగా చెప్పారు. కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణకు జరిగిన నష్టానికి పూర్తిగా కేసీఆర్‌నే బాధ్యుడని వ్యాఖ్యానించారు.కృష్ణా నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను కేసీఆర్ తాకట్టు పెట్టారని బండి సంజయ్ ఆరోపించారు. “కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నారు. 575 టీఎంసీల కోసం పోరాడాల్సిన సందర్భంలో కేసీఆర్ మౌనంగా ఉన్నారు. ముదుపుల కోసమే తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టారు” అని విమర్శించారు. ఈ విషయాలను ఆధారాలతో సహా బయట పెట్టింది తానేనని చెప్పారు. ఏపీ మాజీ సీఎం జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో ప్రజలకు కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పట్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిపించానని బండి సంజయ్ గుర్తు చేశారు. కృష్ణా జలాల అంశంలో కేసీఆర్ పాత్ర పూర్తిగా ద్రోహపూరితమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వెలుగులోకి వస్తున్న అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ కృష్ణా జలాల అంశాన్ని లేవనెత్తుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం స్కాం నుంచి తప్పించుకునేందుకే కొత్త ఇష్యూ తీసుకొచ్చారని దుయ్యబట్టారు.కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణకు భారంగా మారిందని బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. “కేసీఆర్ కుమారుడు కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారు. కేసీఆర్ కుటుంబమే

వివరాలు 2లో..

## ఏ బ్రాండ్ తాగి బయటకొచ్చాడో?

### కేసీఆర్ పై టీడీపీ ఎమ్మెల్యే ఫైర్

- ప్రజలకు మొహం చూపించలేక ఫామ్ హౌస్ లో పడుకున్నారన్న ఎంఎస్ రాజు
- మతి భ్రమించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపాటు
- బీఆర్ఎస్ పూర్తిగా బలహీనమయిందని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలా కాలం తర్వాత బహిరంగంగా కనిపించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... ఏపీ సీఎం చంద్రబాబుపై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఎంవోయూలకు హైప్ క్రియేట్ చేయడంలో చంద్రబాబును మించిన వారు లేరని ఆయన విమర్శించారు. విశాఖలో గతంలో

వివరాలు 2లో..


## ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోయిస్టులు మృతి



- ఒడిశా కందమాల్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్
- భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి
- మృతుల్లో ఒక మహిళా మావోయిస్టు
- ఘటనా స్థలం నుంచి ఆయుధాలు స్వాధీనం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒడిశాలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. కందమాల్ జిల్లాలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో ఐదుగురు

వివరాలు 2లో..



## క్రిస్మస్ వేడుకల్లో ప్రధాని మోదీ

### ఢిల్లీలోని కెథడ్రల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

**హైదరాబాద్ పెన్ పవర్:** క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఢిల్లీలోని కేథడ్రల్ చర్చ్ ఆఫ్ రిడెంప్షన్ లో జరిగిన ప్రార్థ నలోపాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేశారు. బిషప్ రెవరెండ్ డాక్టర్ పాల్ స్వరూప్ మోదీ కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతక ముందు. క్రిస్మస్ సందర్భంగా ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు తెలి యజేశారు. ప్రతి ఒక్కరూ శాంతి, కరుణ మరియు ఆశతో అనందకరంగా పండుగను జరుపు కోవాలని సూచించారు. “యేసుక్రీస్తు బోధనలు మన సమాజంలో సమరస్యాన్ని బలోపేతం చేయుగాక“ అని ట్విట్టర్ ఖాతాలో రాసి, ఇందుకు సంబంధించిన ఫోటోలను మోదీ షేర్ చేశారు.

## అప్పటి వరకు రైతు భరోసా నిధుల పంపిణీ ఉండదు



- యాసంగి పంట భూములను ఉపగ్రహ చిత్రాల ద్వారా గుర్తిస్తామన్న తుమ్మల
- వాస్తవంగా సాగు చేస్తున్న భూములను గుర్తించి రైతులకు న్యాయం చేస్తామని వెల్లడి
- సాగు భూములను గుర్తించేంత వరకు నిధుల పంపిణీ ఉండదని స్పష్టీకరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో సాగవుతున్న పంట భూములను ఉపగ్రహ చిత్రాల ద్వారా ఖచ్చితంగా గుర్తించి, దాని ఆధారంగా రైతు భరోసా పథకం

వివరాలు 2లో..

## రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎవరి తోలు తీస్తారు?

- అనాథ విద్యార్థులకు సమయానికి భోజనం అందించలేక పోతున్నారన్న హరీశ్ రావు
- ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోందని వ్యాఖ్య
- విద్యార్థుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అనాథ విద్యార్థులకు సమయానికి భోజనం అందించలేని దయనీయ స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆయన విమర్శించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సిద్ధిపేటలో అనాథ విద్యార్థులను కలిసిన హరీశ్ రావు, వారి సమస్యలు తెలుసుకున్నారు.గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన మెస్ బిల్లులు, కాస్మటిక్ చార్జీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని హరీశ్ గుర్తు చేశారు.



వివరాలు 2లో..



## చర్చిలకు క్రిస్మస్ శోభ

- మెదక్ చర్చికి పోటెత్తిన క్రైస్తవులు
- మంచిర్యాల జిల్లాలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి



వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## గర్వించదగ్గ అమరుడు ఉద్దంసింగ్

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన వారెందరో... అయితే అమర వీరుడు ఉద్ధం సింగ్ ఆత్మార్పణం ఒక ప్రత్యేకం. కళ్ళముందే అగణిత ప్రాణాలను కిరాతకంగా తుపాకీ గుళ్ళకు బలి చేసిన శ్వేత జాతి అధికారిని హతమార్చి పగ తీర్చుకున్న సందర్భం. దేశ చరిత్రలో చెరిగి పోలేని దేశభక్తికి పరాకాష్టగా నిలిచిన ముఖ్య ఘట్టం. జలియన్ వాలా బాగ్ మారణ కాండలో ప్రాణాలతో బయట పడిన యువకుడు తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చడానికి, పగ తీర్చుకోవడానికి ఏళ్ళ తరబడి నిరీక్షించి, లక్ష్య సాధనలో దేశాన్ని వదిలి, విదేశానికి శ్రమకోర్చి వెళ్ళి, సమయం కోసం వేచి ఉండి, నరరూప రాక్షసుడైన డయ్యర్ ను హత మార్చి, ఉరి తాడును ముద్దాడిన దేశం గర్వించదగ్గ అమరుడు ఉద్దమ్ సింగ్ సాహసోపేత నేపథ్యం అనన్య సామాన్యం, అపూర్వం, అసమానం. ఈ చారిత్రక నేపథ్యం గురించి తెలుసు కోవాలంటే వంద ఏళ్లు వెనకకు వెళ్లాల్సిందే.బెంగాల్ నానాటికీ పెచ్చరిల్లుతున్న విప్లవోద్యమం, భారత ప్రజల్లో నానాటికీ రగులు తున్న అసంతృప్తి (ముఖ్యంగా బాంబే మిల్ వర్కర్స్ లో), మొద లైన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1918లో ఆంగ్లేయ న్యాయమూర్తి యైన సిడ్నీ రౌలట్ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనినే రౌలట్ కమిటీ అంటారు. రౌలట్ కమిటీ ప్రతిపాదనను అనుసరించి ర బ్రిటీష్ ప్రభుత్వం 1915లో ఏర్పాటు చేయబడ్డ భారతీయ రక్షణ చట్టానికి అదనంగా రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించింది. ఈ చట్టం అణిచి వేయడానికి వైస్రాయ్ లకు విశేష అధికారాలని కట్ట బెట్టారు. ప్రెస్ నోళ్ళను కట్టేయడానికీ, విచారణ లేకుండా రాజకీయ నాయకులను నిర్బంధించడం, తిరుగుబాటు దారునిగా అనుమానితులైన వ్యక్తులను వారంటు లేకుండా అరెస్టు చేయడం మొదలైన నిరంకుశమైన అధికారాలు ఇందులో ఉన్నాయి. ఈ చట్టం పై దేశంలో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్త మయ్యాయి. జలియన్ వాలాబాగ్ దురంతం భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో జరిగిన అత్యంత దురదృష్టమైన సంఘటన. 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్సర్ లోగల స్వర్ణ దేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ తోటలో దాదాపు 20 వేలమంది ప్రజలు సమావేశ మైనారు. అది వైశాఖ మాసం, సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవత్సరం. వారు అక్కడ సమావేశ మవడానికి ముఖ్య కారణం, ప్రముఖ నేతలు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఉపన్యాసాలను వినడం, అనేక విమర్శలకు గురైన రౌలట్ చట్టం క్రింద సత్యపాల్, సైపుద్దీన్ కిచ్లూలను అక్రమంగా నిర్భందించడాన్ని వ్యతిరేకించడం ఏప్రిల్ 13, 1919 న బ్రిటీష్ సైని కులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశమైన నిరాయుధులైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులు పది నిమిషాలపాటు కొనసాగాయి. ఇరుకైన సందుల కారణంగా వాహ లోపలికి రాలేక పోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్ద భవనాల తోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలావాటికి తాళాలు వేసి ఉన్నాయి. కాల్పుల కారణం వందలమంది మరణించారు. 1650 రౌండ్లు కాల్పులు జరిగాయి. అప్పటి ఆంగ్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 (337 పురుషులు, 41 మంది మహిళలు, 6 వారాల పసికందు) మరణించారు. కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ 1000 కి పైగా మరణించారు. 2000 మందికి పైగా గాయ పడ్డారు. అక్కడ స్మారక చిహ్నంపైన వ్రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు.పంజాబ్ అమృత్ సర్ లోని 1919 ఏప్రిల్ 13 మైన జలియన్ భాగ్ లో చాలా శాంతియుతంగా వేల మంది సామాన్య పౌరులు సమావేశం పోలీసులతో చుట్టు ముట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపి వేల మంది మరణానికి కారణం అయ్యాడు జనరల్ డైయర్. షేర్ సింగ్ (ఉధం సింగ్) 1899 డిసెంబర్ 26 న పంజాబ్ లో సంగ్రూర్ జిల్లా సునం అనే గ్రామం లో కాంబోజి సిక్ కుటుంబంలో జన్మించారు. తండ్రి తెహల్ సింగ్ పొరుగు గ్రామమైన ఉపాల్ లో జమ్ము రైల్వే క్రాసింగ్ కాపలా దారుగా జీవనం సాగించేవారు. ఉద్ధం సింగ్ తల్లి 1901లో తండ్రి 1లో చనిపోయారు. షేర్ సింగ్ (ఉధం సింగ్ ) వారి తల్లి తండ్రులు చనిపోయాక అన్న ముక్తా సింగ్ తో కలిసి అమృత్ సర్ లో సెంట్రల్ ఖల్సా అనాథ ఆశ్రమంలో చేరారు. అక్కడ సిక్కులకి మతపరమైన దీక్ష చేసి అక్కడ వారి చేత ఉద్దం సింగ్ అనే పేరుని స్వీకరించారు. మెట్రిక్యు లేషన్ చదువు 1918లో పూర్తి చేసి 1919లో ఆ అనాథ ఆశ్రమం నుండి బయటకి వచ్చాడు. జలియన్ వాలా బాగ్ సంఘటనలో యువకుడైన సింగ్ కూడా ఉన్నాడు. అమానుష దాడి తన కళ్ళ ముందే జరగడంతో హత్యాకాండకు సూత్రధారి అయిన డైయరు, జెనరల్ మైకెల్ ఒడ్వాయర్ ను హత మార్చడానికి ప్రతీకారాన్ని తీర్చు కోవటానికి ప్రతిన బూనాడు. భగత్ సింగ్ విప్లవ భావాలకి ఆకర్షితుడై 1927 న భగత్ సింగ్ ఆదేశాల మేరకు విదేశాలనుండి తుపాకులు తెస్తు పోలీసులకు దొరికి 1931 వరకు జైలు జీవితం గడిపాడు. విప్లవ వీరుడు భగత్ సింగ్ ను ఉరి తీయడం సింగ్ ను కలచి వేసింది. జైలు నుండి విడుదల అయిన తరువాత చదువు పేరుతో పేరు మార్చుకుని, పోలీసుల నిఘా నుండి తప్పించు కుని కాశ్మీర్, జర్మనీ మీదగా లండన్ చేరాడు. డైయ్యర్ ని హత్య చేయడానికి పగబట్టి 9 సంవత్సరాలు ఎదురు చూసి 21 సంవత్స రాల తరువాత మార్చ్ 1940 మార్చి 13 న లండన్ కాక్స్ టన్ హాల్ లో డయర్ ని అందరు చూస్తుండ గానే తుపాకీతో కాల్చి హత్య చేసి ప్రతీకారం తీర్చుకుని పోలీసులకి స్వచ్ఛందంగా పట్టుబడి తను చంపిన కారణాన్ని నిర్భ యంగా చెప్పాడు. దీంతో జూన్ 4, 1940 న, ఓల్డ్ బెయిలీలోని సెంట్రల్ క్రిమినల్ కోర్టులో, జస్టిస్ అట్కిన్సన్ మరణశిక్ష విధించాడు. జూలై 31, 1940 న, ఉధమ్ సింగ్ ను లండన్ లోని ,పెంటన్ విల్లే జైలులో ఉరి తీశారు.

# కిలిమంజారో పర్వతంపై విషాదం.. హెలికాప్టర్ కూలి ఐదుగురి మృతి

- మొదటి పేజీ తరువాయి
ప్రాణాలు కోల్పోయారు. అనారోగ్యంతో బాధపడుతున్న పర్యాటకులను రక్షించేందుకు వెళ్లిన హెలికాప్టర్ బరాఫు క్యాంప్ వద్ద కూలిపోయింది.ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురూ మరణించినట్లు టాంజానియా సివిల్ ఏవియేషన్ అథారిటీ (టజాూూ) ఇవాళ ఒక ప్రకటనలో వెల్లడించింది. మృతుల్లో ఇద్దరు చెక్ రిపబ్లిక్ దేశానికి చెందిన పర్యాటకులు, ఒక జింబాబ్వే పైలట్, ఒక టాంజానియా డాక్టర్, మరో స్థానిక పర్వత గైడ్ ఉన్నారని పోలీసులు గుర్తించారు.ఇద్దరు చెక్ రిపబ్లిక్ పర్యాటకులకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో వారిని అక్కడి నుంచి తరలించేందుకు ఈ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. టాంజానియాకు చెందిన ఒక సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఎ125 హెలికాప్టర్ ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు కిలిమంజారో ప్రాంతీయ పోలీస్ కమాండర్ సైమన్ మైగ్వా తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు.ఆఫ్రికాలోనే అత్యంత ఎత్తైన పర్వతమైన కిలిమంజారో, ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను, పర్వతారోహకులను ఆకర్షిస్తుంది.

ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు టాంజానియా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగానే కిలిమంజారో పర్వతంపై కేబుల్ కార్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో అధికారులు ప్రకటించారు. పర్యాటకులు సులభంగా పర్వత ప్రాంతాలకు చేరుకునేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

# ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోయిస్టులు మృతి

- మొదటి పేజీ తరువాయి
మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఒక మహిళ కూడా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.కందమాల్ జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు భద్రతా బలగాలకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు, ప్రత్యేక బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఓ చోట మావోయిస్టులు తారసపడటంతో లొంగిపోవాలని బలగాలు హెచ్చరించాయి. అయితే, మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో భద్రతా దళాలు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపాయి.ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు అక్కడికక్కడే చనిపోయారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన బలగాలు ఒక రివాల్వర్, పాయింట్ 303 రైఫిల్, ఒక వాకీ-టాకీ సెట్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

# చర్చిలకు క్రిస్మస్ శోభ

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్, మందమర్రి పట్టణాల్లోని సి ఎస్ ఐ, పెంతుకోస్తు, బెల్లంపల్లి మండలం సోమగూడెంలోని కల్వరి చర్చి ల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. చర్చి పాస్టర్లు, క్రీస్తవులతో కలిసి ప్రార్థనలు చేసిన మంత్రి వివేక్ అనంతరం వారితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోని క్రైస్తవులకు క్రీస్మస్ పండుగ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ లు ప్రత్యేక ప్రార్థనలు చేసి మంత్రి వివేక్ వెంకటస్వామిని ఆశీర్వదించారు. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్న మంత్రి.. దేవుని ఆసిస్సులు అందరికి ఉండాలని ఆకాంక్షించారు. తాము చిన్నప్పటి నుండే క్రిస్టియన్ స్నేహితులతో కలిసి క్రిస్మస్ వేడుకలు జరుపుకునే వాళ్ళమని గుర్తు చేశారు.

# అప్పటి వరకు రైతు భరోసా నిధుల పంపిణీ ఉండదు

- మొదటి పేజీ తరువాయి
అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఉపగ్రహ చిత్రాల క్రోడీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... యాసంగిలో వాస్తవంగా సాగు చేస్తున్న భూములనే గుర్తించి రైతులకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందుకే ఉపగ్రహ చిత్రాల ఆధారంగా భూముల గుర్తింపు పూర్తయ్యే వరకు రైతు భరోసా నిధుల పంపిణీ ఉండదని తెలిపారు.

జనవరి నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తిరిగి ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ యాంత్రీకరణ పథకానికి రాష్ట్ర వాటా నిధులు సమకూర్చి, రైతులకు రాయితీపై యంత్రాలు, పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు జనవరి మొదటి వారంలో మండలాల వారీగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. రైతులకు అందుతున్న రాయితీలు, యాంత్రీకరణ పథక దరఖాస్తులు, యూరియా యాప్ అమలు వంటి అంశాలపై ప్రత్యక్షంగా అభిప్రాయాలు సేకరించాలని చెప్పారు.

ప్రస్తుతం ఐదు జిల్లాల్లో యూరియా యాప్ విజయవంతంగా అమలవుతోందని మంత్రి తెలిపారు. త్వరలోనే ఈ యాప్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. అయితే, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాల కారణంగా యాప్ అమలులో లేని జిల్లాల్లో కొంతమంది రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని, రైతులెవరూ అనవసర భయాందోళనలకు గురికావద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసమే ప్రతి నిర్ణయం తీసుకుంటోందని, ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.

# కేసీఆర్ కుటుంబం తెలంగాణకు శని

- మొదటి పేజీ తరువాయి
తెలంగాణకు పెద్ద శని. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం" అని స్పష్టం చేశారు.

ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల్ని కూడా బండి సంజయ్ తప్పుబట్టారు. "ఎవరి మీద విమర్శలు చేసినా మాటల తీరులో సంయమనం ఉండాలి. రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష సరైనది కాదు. ఇలాంటి మాటలు చివరకు ఆయన్నే నష్టపరుస్తాయి" అని సూచించారు. హిందూ ధర్మం ప్రతి వ్యక్తి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటుందని తెలిపారు. గతంలో కేసీఆర్ అనుచితంగా మాట్లాడినప్పుడు తాము ఖండించామని, ఇప్పుడు సీఎం రేవంత్ కూడా తన మాటలపై పునరాలోచన చేసుకోవాలని సూచించారు.

# రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎవరి తోలు తీస్తారు?

- మొదటి పేజీ తరువాయి
ప్రభుత్వం కమీషన్లకే ప్రాధాన్యం ఇస్తోందని, కమీషన్ లేని పనులను కావాలని ఆలస్యం చేస్తున్నట్లు ఆరోపించారు. "విద్యార్థులు కమీషన్లు ఇవ్వలేరు కాబట్టే వారి బిల్లులు చెల్లించడం లేదేమో" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

విద్యార్థుల బిల్లుల విషయంలో గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పారని, కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని మండిపడ్డారు. "మాటలు మాత్రం ఆకాశాన్ని తాకుతాయి... చేతలు మాత్రం గడప కూడా దాటవు" అంటూ సీఎం పనితీరును ఎద్దేవా చేశారు.

"నువ్వే ముఖ్యమంత్రివి, నువ్వే విద్యాశాఖ మంత్రివిడ అయినా విద్యార్థుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటే ఇంకెవరిని అడగాలి?" అని హరీశ్ ప్రశ్నించారు. బిల్లులు చెల్లించకపోతే తోలు తీస్తానని గతంలో సీఎం చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, ఇప్పుడు ఆ తోలు ఎవరి మీద తీస్తారని నిలదీశారు.

ప్రభుత్వం తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెరుగుతోందని హెచ్చరించారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ తర్వాత కాంగ్రెస్ నాయకుల్లో భయం మొదలైందని, అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. విద్యార్థుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని... లేకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. విద్య, సంక్షేమ రంగాలను నిర్లక్ష్యం చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

# ఏ బ్రాండ్ తాగి బయటకొచ్చాడో?

- మొదటి పేజీ తరువాయి
జరిగిన సీఐఐ సదస్సులో లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు అంటూ హంగామా చేశారని... అయితే, ఆ ఎంవోయూలపై సంతకాలు చేసింది స్టార్ హోటళ్లలోని వంట మనుషులు, సప్లై చేసేవాళ్లంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. ప్రజలకు మొహం చూపించలేక కేసీఆర్ రెండేళ్లుగా ఫామ్ హౌస్ లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. ఏ బ్రాండ్ తాగి బయటకొచ్చాడో అంటూ కామెంట్ చేశారు. సర్పంచ్ అభ్యర్థులు ఓడిపోవడంతో మతి భ్రమించి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. కేటీఆర్ ను కేసీఆర్ అసమర్థుడిగా భావిస్తున్నారని... కేసీఆర్ ఇప్పుడు బయటకు రావడానికి ఇదే కారణమని చెప్పారు. బీఆర్ఎస్ పూర్తిగా బలహీనపడిందని... పార్టీ కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని అన్నారు.

# దేశవ్యాప్తంగా డెలివరీ వర్కర్ల సమ్మె.. ప్రధాన డిమాండ్లు ఇవే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ ఈ-కామర్స్, ఫుడ్ డెలివరీ, హోమ్ సర్వీస్ ప్లాట్‌ఫామ్‌లకు చెందిన డెలివరీ, గిగ్ వర్కర్లు దేశవ్యాప్తంగా సమ్మె బాట పట్టారు. స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈరోజు, ఈ నెల 31న నిరసనల్లో పాల్గొంటున్నారు. క్షీణిస్తున్న పని పరిస్థితులు, సరైన వేతనాలు లేకపోవడం, భద్రత, సామాజిక భద్రత కల్పించకపోవడాన్ని నిరసిస్తూ వారు ఈ సమ్మెకు పిలుపునిచ్చారు.పండుగల సీజన్‌లో డెలివరీ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే తమను కంపెనీలు దోపిడీ చేస్తున్నాయని కార్మిక సంఘాలు ఆరోపించాయి. "ఎక్కువ గంటలు పనిచేయించుకోవడం, సంపాదన తగ్గిపోవడం, అశాస్త్రీయ డెలివరీ టార్గెట్లు, అకారణంగా ఐడీలను బ్లాక్ చేయడం, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలతో డెలివరీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్ఏటీ) సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే..**

పారదర్శకమైన వేతన విధానం అమలు చేయడంతో పాటు, వివాదాస్పదమైన "10 నిమిషాల డెలివరీ" మోడల్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి విచారణ లేకుండా ఐడీలను బ్లాక్ చేయడాన్ని ఆపాలని, భద్రతా పరికరాలు అందించాలని కోరుతున్నారు. వివక్ష లేకుండా పని కేటాయించాలని, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పెన్షన్ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని, ప్లాట్‌ఫామ్ కంపెనీల కార్యకలాపాలను నియంత్రించాలని టీజీపీడబ్ల్యూయూ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ కోరారు. "కంపెనీలు కార్మికుల జీవితాలతో ఆడుకుంటూ లాభాలు ఆర్జిస్తుంటే ప్రభుత్వాలు ప్రేక్షకపాత్ర వహించవద్దు. న్యాయం, గౌరవం, జవాబుదారీతనం కోసమే ఈ సమ్మె చేస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు.

## బంగ్లాదేశ్‌లో తారిఖ్ రెహమాన్ తొలి ప్రసంగం.. ఉస్మాన్ హాదీ మృతి ప్రస్తావన

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల హత్యకు గురైన విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ ప్రజాస్వామ్య బంగ్లాదేశ్ కోసం కలలు కన్నాడని, అతడి కల కోసం తమ పార్టీ కృషి చేస్తుందని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ యాక్టింగ్ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ పేర్కొన్నారు. హాదీ ఇటీవల సింగపూర్‌లో చికిత్స పొందుతూ మరణించిన సంగతి విదితమే. ఆ తరువాత బంగ్లాదేశ్‌లో ఆందోళనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. హింస, నిరసనలతో అస్థిరంగా ఉన్న బంగ్లాదేశ్‌కు తారిఖ్ 17 సంవత్సరాల తర్వాత తిరిగి వచ్చారు.

బంగ్లాదేశ్‌కు చేరుకున్న అనంతరం పార్టీ మద్దతుదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, మెరుగైన బంగ్లాదేశ్‌ను నిర్మించేందుకు తన వద్ద ఒక ప్రణాళిక ఉందని తెలిపారు. ఆ ప్రణాళికను అందరూ కలిసికట్టుగా నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.

1971లో ఒకసారి, 2024లో మరోసారి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నామని ఆయన అన్నారు. మెరుగైన బంగ్లాదేశ్ నిర్మాణం కోసం, శాంతి కోసం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అవిశ్రాంతంగా పని చేస్తుందని హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్ అభివృద్ధి ప్రయాణంలో అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని తారిఖ్ పేర్కొన్నారు.మాజీ ప్రధాని షేక్ హసీనా పాలనపై ఆయన విమర్శలు గుప్పించారు. ఆమె పాలనలో ఎవరూ స్వేచ్ఛగా మాట్లాడలేకపోయారని ఆరోపించారు. తన తల్లి ఖలీదా జియా అనారోగ్యం గురించి ప్రస్తావిస్తూ, తన మనసంతా ఆమె వద్దనే ఉందని అన్నారు. కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం ఆయన తల్లిని చూసేందుకు ఆసుపత్రికి వెళ్లారు.

## కర్ణాటకలో పెను విషాదం లారీ-బస్సు ఢీ.. మంటల్లో చిక్కుకుని 13 మంది సజీవ దహనం!

- మొదటి పేజీ తరువాయి
సుమారు 30 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. మృతదేహాలు పూర్తిగా గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో మృతుల గుర్తింపు పోలీసులకు సవాలుగా మారింది. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్
శుక్రవారం 26 డిసెంబర్ 2025 పేజీలు 8

# తంతే బూరెల బుట్టలో పడ్డట్లు రేవంత్ సీఎం అయిండు

- గల్లీ స్థాయి లీడర్ నని నిరూపించుకున్నాడని మండిపాటు
- కేసీఆర్ స్థాయి కాదని గుర్తుంచుకోవాలంటూ వార్నింగ్
- ఇతరుల చావు కోరుకోవడమనేది రండ గాళ్లు చేసే పనంటూ ఘాటు వ్యాఖ్యలు




హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి పదవి గౌరవాన్ని దిగజార్చుతున్నారంటూ రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు.

-4 లో

# తాతలు పోయారు..! వారసులు మిగిలారు..!

## ప్రశ్నార్థకంగా మారిన..! సూరారం గ్రామస్తుల ఆస్తి హక్కుల పరిష్కారం..!

- కుత్బుల్లాపూర్ సూరారం గ్రామంలో నేటికీ తాతల పేర్లతోనే ఇండ్లు.. మారని రికార్డులు..!
- సుమారు 60 - 70 ఏళ్లుగా తాతల పేర్లతోనే ఇంటి పన్నుల చెల్లింపు..
- అడ్డంకిగా మారిన, పేరు మార్పుకు డెత్ సర్టిఫికెట్ల ప్రక్రియ..
- తహశీల్దార్‌లతో పైలెట్ ప్రాజెక్ట్‌గా పంచనామా నిర్వహించాలని డిమాండ్..
- నిషేధిత జాబితాలో సర్వే నెంబర్‌లు..! క్రయవిక్రయాలకు ఆటంకం..!
- నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు..! 22-ఎ జాబితా నుండి తొలగింపుపై ఎదురు చూపులు..
- జీవో నెం.166, 59 ప్రకారం హక్కులు కల్పించి న్యాయం చేయండి..
- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ స్థానికులతో కలిసి సామాజిక వేత్త రవిందర్ ఎమ్మెల్యేకు వినతి..

**అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైందని, బాధితులు వాపోతున్నారు.. ఒకవైపు గ్రామస్తుల ఆస్తి హక్కులపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి..? పలుమార్లు ప్రజాప్రతినిధులకు, నేతలకు, ఇచ్చిన వినతిపత్రాలు బుట్ట దాఖలు అవుతున్నాయే కానీ..! పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. తహశీల్దార్‌లు గ్రామాలకు వెళ్ళి పైలట్ ప్రాజెక్ట్ కింద చర్యలు చేపట్టాలని, ఇంటింటికీ వెళ్ళి సమస్యలు అడిగి తెలుసుకోవాలని వేడుకుంటున్నారు.. దాదాపు 60-70 ఏళ్ళుగా పూర్వీకుల పేరుతోనే ఆస్తి పన్నులు చెల్లిస్తూ, క్రయవిక్రయాలకు నోచుకోక, రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సూరారం గ్రామస్తులు, నిషేధిత జాబితా భూముల సమస్యల పరిష్కారానికి ఏళ్ళ తరబడి ఎదురు చూపులు..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 25:**

తాతల పేర్లలోనే ఇంటిపన్నులు, మార్పుకు మార్గం లేక, సుమారు ఏడు దశాబ్దాలుగా గ్రామస్తుల ఇబ్బందులు.. గ్రామాలుగా ఉన్నప్పటి నుంచి దాదాపు 60%-%70 ఏళ్లుగా తాతలు, ముత్తాతల పేర్ల మీదే ఇంటిపన్నులు చెల్లిస్తున్న కుటుంబాలు నేటికీ అదే సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి.. గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలుగా, ఇప్పుడు జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చినా..! "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా ఇళ్ల యజమానుల పేర్లు మాత్రం మారడం లేదు.. ఇప్పటికీ అదే ఇళ్లలో నివసిస్తున్న వారసులు కొడుకులు, మనవలు, మనవరాలు అయినప్పటికీ, రికార్డుల్లో మాత్రం చనిపోయిన వారి పేర్లే కొనసాగుతున్నాయి.. పేర్లు మార్చాలంటే తప్పనిసరిగా మరణ ధృవీకరణ పత్రాలు (డెత్ సర్టిఫికెట్లు) సమర్పించాలని అధికారులు షరతులు పెడుతున్నారు.. అయితే, దశాబ్దాల క్రితం మరణించిన వారి ధృవపత్రాలు తెచ్చుకోవడం గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందిగా మారింది.. ఈ నేపథ్యంలో, స్థానికంగా ఉన్న, తహశీల్దార్లు గ్రామాలకు వెళ్లి ఒక పైలెట్ ప్రాజెక్ట్‌గా ఇంటింటికీ పర్యటించి, పంచనామా నిర్వహించి, ప్రస్తుతం నివసిస్తున్న వారి పేర్లపై ఇంటి హక్కు నిర్ధారిస్తూ ఎన్ఓసీలు జారీ చేస్తే, జీహెచ్ఎంసీ అధికారులు పేర్లు మార్పుకు అనుమతులు ఇవ్వవచ్చని గ్రామస్తులు సూచిస్తున్నారు.. ఇలా చేస్తే గ్రామాలు అభివృద్ధి బాట పడుతాయని, లేకపోతే ఈ గ్రామాలు నెమ్మదిగా శ్మశానవాటికలుగా మారిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..



కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రవిందర్ ముదిరాజ్ అండ్ అదర్స్..



కోలా రవిందర్ ముదిరాజ్.. సామాజిక వేత్త.. పర్యావరణ ప్రేమికుడు..

## ప్రభుత్వ భూముల్లో వెలసిన బస్తీలకు సకల సౌకర్యాలు..!

ఇదిలా ఉండగా, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలిసిన బస్తీలకు మాత్రం సవ్యంగా సకల సౌలతులు కల్పిస్తున్నారని స్థానికులు ఆరోపించారు.. వాటికి విద్యుత్, నీరు, రహదారులు వంటి సౌకర్యాలు కల్పిస్తుండగా, తరతరాలుగా నివసిస్తున్న గ్రామస్తుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై ఇటీవల ప్రభుత్వ స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం.. మరోవైపు, గతంలో ముఖ్యమంత్రులుగా ఉన్న గౌతు చెన్నారెడ్డి, వెంగళరావు, ఎన్.టి.రామారావు హయాంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, ధ్వారా పథకాల కింద వేలాది గృహాలు నిర్మించి ఇచ్చారు. ఇందుకోసం అప్పట్లో వ్యవసాయ భూములను కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే, కొందరు లబ్ధిదారులు తరువాత కాలంలో సదబైనాలు, నోటరీల ద్వారా ఆ ఇళ్లను విక్రయించారు.. ఆ భూములు, ఇళ్లు ఇప్పుడు నిషేధిత సర్వే నెంబర్‌ల జాబితాలో చేరడంతో, నేటి తరం ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.. పిల్లల పెళ్లిళ్లకు ఆస్తులు అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది.. బ్యాంకుల నుంచి ఋణాలు పొందలేని దుస్థితి, పిల్లల పేరున గిఫ్ట్ డీడ్‌లు, రిజిస్ట్రేషన్లు చేయలేని అవస్థలు ఎదురవుతున్నాయి.. కాబట్టి, అప్పటి మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకొని జీఓ నెం. 166, 59ల ప్రకారం హక్కులు కల్పించి న్యాయం చేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు..


# మదీనాగూడలో ఘనంగా.. అటల్ 'జీ' జయంతి వేడుకలు..

## హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో..






**శేరిలింగంపల్లి, పెన్ పవర్, డిసెంబర్ 25:**
హఫీజ్‌పేట్ డివిజన్, మదీనాగూడలో భారతరత్న, మాజీ ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజపేయి 100వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా కైతాపురం జితేందర్, బీజేపీ సీనియర్ నాయకులు మహేష్ యాదవ్, అజిత్ సేనాపతి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలు, సమగ్ర పాలన, అచంచల దేశభక్తికి ప్రతీక అటల్ జీ అని కొనియాడారు. పరిస్థితులు మారినా విలువలకు కట్టుబడి రాజకీయం నడిపిన అజాతశత్రువు అటల్ వాజపేయి, జీవితం నేటి నాయకులకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రమణయ్యతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



# అటల్ బిహారీ జయంతి వేడుకల్లో..! దేశభక్తికి ప్రతీకగా రక్తదానం..

## ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్..

- అటల్ బిహారీ వాజపేయి ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని ప్రశంసలు..
- సూరారం డివిజన్ పరిధిలోని వివిపి ఫంక్షన్ హాల్‌లో అటల్ జయంతి వేడుకలు..
- దేశభక్తికి ప్రతీకగా సుమారు 200 మందితో రక్తదాన శిబిరం..
- అటల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బీజేపీ నేతలు..
- రక్తదానం దాదాపు 200 మందికి పైగా స్వచ్ఛంద రక్తదానం..

-4 లో

# 2026 నూతన సంవత్సర వేడుకలు.. హైదరాబాద్‌లో డిసెంబర్ 31 వరకు తనిఖీలు

- హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు
- 304 మందిని పట్టుకుని వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక



హైదరాబాద్ పెన్ పవర్:2026 నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31 వరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ తనిఖీలు చేపట్టనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగా ఈరోజు నిర్వహించిన తనిఖీలలో 304 మంది పట్టుబడ్డారు.ట్రాఫిక్ పోలీసులు వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు బాధ్యతాయుతంగా

-4 లో

# చంద్రబాబు కాళ్ల వద్ద బతికినోళ్లం కాదు రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు

- ముఖ్యమంత్రిగా ఉండి వీపులు పగులగొడతాననడం ఏమిటని ప్రశ్న
- 2029లో బీఆర్ఎస్ 90 సీట్లు గెలుచుకుంటుందని ధీమా
- రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ



-4 లో

సూరారం గ్రామంలో అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి,నివాళులు అర్పిస్తున్న ఎంపి ఈటెల రాజేందర్..





రక్తదాన శిబిరంలో డాక్టర్‌లతో మాట్లాడుతున్న ఈటెల..

# అటల్ బిహారీ జయంతి వేడుకల్లో..!

# దేశభక్తికి ప్రతీకగా రక్తదానం

- అటల్ బిహారీ వాజపేయి ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని ప్రశంసలు..
- సూరారం డివిజన్ పరిధిలోని వివిపి ఫంక్షన్ హాల్‌లో అటల్ జయంతి వేడుకలు..
- దేశభక్తికి ప్రతీకగా సుమారు 200 మందితో రక్తదాన శిబిరం..
- అటల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బీజేపీ నేతలు..
- రక్తదానం దాదాపు 200 మందికి పైగా స్వచ్ఛంద రక్తదానం..

## ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్..



కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 25:భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని వివిపి ఫంక్షన్ హాల్‌లో, బీజేపీ నేత వారాల మహేష్ కుమార్ నేతృత్వంలో, ఏర్పాటు చేసిన, అటల్ బిహారీ వాజపేయి జయంతి కార్యక్రమానికి, మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.. ముందుగా అటల్ చిత్రపటానికి, బీజేపీ నేతలతో కలిసి పూలమాలలు వేసిన ఎంపి ఈటెల రాజేందర్, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.. ఈ కార్యక్రమం రాజకీయ విలువలకు, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలిచింది.. వారాల మహేష్ కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ ఈ రక్తదాన శిబిరం కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలతోపాటు, సుమారు 200 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్టు తెలిపారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ, అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితాన్ని, ఆయన రాజకీయ దూరదృష్టిని, ప్రజాస్వామ్యంపై ఆయనకు ఉన్న అచంచలమైన నిబద్ధతను గుర్తు చేశారు.. "రాష్ట్రనీతిజ్ఞత, దేశభక్తి, ప్రజాస్వామ్య విలువలకు అటల్ జీ, జీవితం ఒక ఉదాహరణ. ఆయన ఆశయాలు తరతరాల భారతీయులకు ప్రేరణగా నిలుస్తాయని ఈటల రాజేందర్ కొనియాడారు..

### రక్తదాతలే.. ప్రణదాతలు..

ప్రస్తుత రక్త నిల్వలు (బ్లడ్ బ్యాంకులు) కొరత తీవ్రమవుతున్న నేపథ్యంలో, ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలన్న అవగాహనను ఈ శిబిరం ద్వారా విస్తృతంగా కల్పించారు. అటల్ జీ ఆశించిన 'సేవా రాజకీయాల'కు ఇది ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, శేఖర్ యాదవ్, విఘ్నేశ్వర్, వాసు దయాకర్‌తో పాటు ఇతర రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.. అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సంస్మరణ దినానికే పరిమితం కాకుండా, సమాజానికి సేవ చేసే దిశగా అడుగులు వేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ ప్రజల్లో సానుకూల స్పందనను రేకెత్తించింది.

### రక్తదాన శిబిరం- అటల్ ఆశయాలకు నివాళి..

అటల్ బిహారీ జయంతి వేడుకల్లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంతో, సమాజంలో ఎందరో ప్రాణాలు కాపాడటానికి ఉపయోగపడే కార్యక్రమమని, ఇదే అటల్ బిహారీ వాజ్‌పేయికి మన నిజమైన నివాళి అంటూ పేర్కొన్నారు.. ఈ శిబిరంలో దాదాపు 200 మందికి పైగా యువకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని, తెలిపారు.. అత్యవసర చికిత్సలకు, ప్రమాదాలు, ప్రసవాలు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం ఎంత కీలకమో వివరిస్తూ, రక్తదానం ప్రాణదానంతో సమానం అనే సందేశాన్ని నిర్వాహకులు ప్రజల్లోకి తీసుకెళ్లారు..

రక్తదాన శిబిరంలో యువకులు రక్తదానం..



# అటల్ బిహారీ వాజపేయికి..ఘనంగా నివాళులు..

## 100వ జయంతి సందర్భంగా నిజాంపేట్ లో జాతీయ సుపరిపాలన దినోత్సవం..





- భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి 100వ జయంతి వేడుకలు..
- నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు.
- హనుమాన్ టెంపుల్ వద్ద ఈ జాతీయ సుపరిపాలన దినోత్సవం..
- మూడు సార్లు ప్రధాని అయిన అటల్ బిహారీ వాజపేయి కాంగ్రెసేతర తొలి ప్రధానిగా చరిత్ర.

**దుండిగల్, పెన్ పవర్, డిసెంబర్ 25:** భారతీయ జనతా పార్టీ సహ వ్యవస్థాపకులు, భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి 100వ జయంతి సందర్భంగా జాతీయ సుపరిపాలన దినోత్సవాన్ని నిజాంపేటలో ఘనంగా నిర్వహించారు.. నిజాంపేట హనుమాన్ టెంపుల్ వద్ద నిజాంపేట బీజేపీ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. డిసెంబర్ 25, 1924న మధ్యప్రదేశ్‌లోని ఒక సాధారణ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన అటల్ బిహారీ వాజపేయి, విద్యార్థి దశలోనే ఆర్ఎస్ఎస్‌లో చేరి, అక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ, దేశభక్తి, సనాతన హిందూ ధర్మ విలువలతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారని తెలిపారు..మూడు సార్లు భారత ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన అటల్ వాజపేయి, మొదటిసారి 13 రోజులు, రెండోసారి 13 నెలలు, మూడోసారి పూర్తి ఐదేళ్ల కాలాన్ని పూర్తి చేసిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు.తన ప్రధానమంత్రి పదవీ కాలంలో రాజస్థాన్ లోని పోక్రాన్‌లో అణు పరీక్షలు నిర్వహించి ప్రపంచానికి భారత శక్తిని చాటారని, కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పిన ధైర్యమైన నాయకుడిగా అటల్ బిహారీ వాజపేయి నిలిచారని కొనియాడారు..

**గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా "గ్రామీణ సడక్ యోజన"..**

అంతేకాకుండా ప్రధానిగా అటల్ బిహారీ వాజ్‌పేయి, గ్రామీణ సడక్ యోజన ద్వారా మారుమూల గ్రామాలకు రహదారులు విస్తరించే యోచనతో, ప్రత్యేక పథకాన్ని తీసుకువచ్చి, గ్రామీణాభివృద్ధికి బాటలు వేసిన గొప్ప దూరదృష్టి గల నాయకుడని తెలిపారు.. అటల్ బిహారీ వాజపేయి తన రాజకీయ జీవితంలో ప్రతిపక్ష నాయకుల చేత కూడా 'శభాష్' అనిపించుకున్న అరుదైన రాజనీతిజ్ఞుడని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన ఆదర్శ ప్రధానమంత్రిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని, బిక్షపతి యాదవ్ పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో నిజాంపేట ప్రధాన కార్యదర్శి సచిన్, శ్రీనివాస్ గుప్తా, ఎస్సీ అధికార ప్రతినిధి దాసి నాగరాజు, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ రచ్చ చక్రధర్, సుబ్బారావు, ఓబీసీ సెక్రటరీ రవి యాదవ్, బిల్డర్ సెల్ అధ్యక్షులు పద్మ ప్రసాద్, ఉపాధ్యక్షులు దేవేందర్ రెడ్డి, కార్యదర్శి సతీష్ కృష్ణ, కౌశిక్ నాయుడు, పాండు, ఓబీసీ అధ్యక్షులు వెంకటేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు మల్లేష్, ఐటీ సెల్ కన్వీనర్ కిషన్, ఎక్స్ సర్వీస్ సెల్ ఈశ్వర్ రావు, విష్ణు, బీజేవైఎం నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో అటల్ బిహారీ వాజపేయి అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## తంతే బూరెల బుట్టలో పడ్డట్లు రేవంత్ సీఎం అయిండు

-3 పేజి తరువాయి

'తంతే బూరెల బుట్టలో పడ్డట్లు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.. ఆ పదవిని కించపరిచేలా చేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కాలిగోటికి సరిపోవనే విషయం గుర్తుంచుకోవాలని రేవంత్ రెడ్డికి ఆయన వార్నింగ్ ఇచ్చారు.ఈమేరకు జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "నువ్వు రండవు అని అనడం మాకూ వచ్చు, నీకు ఒక భాష మాత్రమే తెలుసు కానీ మాకు అన్ని భాషలు వచ్చు. మేం కూడా నీ భాషలో మాట్లాడగలం. కానీ మేము నీలాగ మాట్లాడడం లేదు. నీ నోరు కంపు అని, సీఎం స్థాయికి తగవని, గల్లీ స్థాయి నాయకుడివని మరోమారు నిరూపించుకున్నావు. ఇతరుల చావు కోరుకోవడం రండగాళ్లు చేసే పని. వచ్చే జనరల్ ఎన్నికల్లో ప్రజలే నిన్ను బండరాళ్లు కట్టి మూసీలో పడేస్తారు" అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## చంద్రబాబు కాళ్ల వద్ద బతికినోళ్లం కాదు: రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మక్తల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు చిట్టెం రామ్మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణకు ద్రోహం చేసిన చంద్రబాబు కాళ్ల వద్ద బతికిన వ్యక్తులం కాదని, జైలుకు వెళ్ళి బతకాల్సిన అవసరం తనకు లేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రిగా ఉండి వీపులు పగులగొడతానని మాట్లాడటం ఏమిటని ఆయన ప్రశ్నించారు.మక్తల్‌లో మీడియాతో మాట్లాడుతూ, తమకు తిట్టడం చేతకాక కాదని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డిలా బ్రోకర్ పనులు చేసి తాము బతకలేదని, అందుకే తాము తిట్టలేదని అన్నారు. రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పాలమూరులో నీళ్లు కూడా లేవని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని ఆయన కొనియాడారు.2029లో బీఆర్ఎస్ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాము 90 స్థానాల్లో గెలుస్తామని, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే 150 స్థానాలకు 120 చోట్ల తప్పకుండా గెలుస్తామని అన్నారు.

రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు చేస్తున్న భూదందా గురించి ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. మంత్రులు కూడా రాష్ట్రాన్ని దోచుకుంటన్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ సొమ్మును ఆయన సూట్‌కేసులలో ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల డబ్బును తీసుకెళ్లి ఏఐసీసీకి ఇస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తెలంగాణను ధనిక రాష్ట్రంగా మార్చారని, అలాంటి రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కొల్లగొడుతున్నారని విమర్శించారు.

## 2026 నూతన సంవత్సర వేడుకలు.. హైదరాబాద్‌లో డిసెంబర్ 31 వరకు తనిఖీలు

-3 పేజి తరువాయి

వ్యవహరించాలని సూచించారు.ఈగల్ టీమ్ సిబ్బంది మేడిపల్లిలోని గంజాయి పెడ్లర్స్‌పై దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేసింది. మేడిపల్లి పోలీసులతో కలిసి ఈ దాడులు నిర్వహించారు. నిందితుల నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని అక్రమ్, షఫీ, పృథ్వీరాజ్, రాహుల్‌గా గుర్తించారు. పృథ్వీరాజ్ కొవిడ్ తర్వాత ఉపాధి కోల్పోయి, ఆ తరువాత ఒడిశా నుంచి గంజాయి తెచ్చి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

## మీ సానుభూతి అవసరం లేదు

## శివాజీకి అనసూయ కౌంటర్

**హైదరాబాద్, డిసెంబర్ 25 పెన్ పవర్:** టాలీవుడ్‌లో ఇటీవల చర్చనీయాంశంగా మారిన 'దండోరా' సినిమా ఈవెంట్ వివాదం మరింత ముదురుతోంది. హీరోయిన్ల దుస్తులపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు ఇప్పటికే తీవ్ర విమర్శలకు దారి తీయగా, తాజాగా ఆయన తనను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలకు నటి అనసూయ భరద్వాజ్ గట్టిగా బదులిచ్చారు."త్వరలోనే మీ రుణం తీర్చుకునే అవకాశం నాకు కూడా రావాలని కోరుకుంటున్నా" అంటూ శివాజీ చేసిన వ్యాఖ్యల పట్ల అనసూయ తీవ్రంగా స్పందించారు. దీనిపై ఆమె సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేసి, తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. చాలా దాటుకుని వచ్చానని.. మీ సానుభూతి తనకు అవసరం లేదని చెప్పారు. తనను ఎలా కాపాడుకోవాలో తనకు తెలుసని అన్నారు.
ప్రెస్ మీట్ లో తనను బాధితుడిగా చూపించుకునే ప్రయత్నాన్ని శివాజీ చేస్తున్నారని... అది పూర్తిగా నార్సిస్టిక్ ప్రవర్తన అని వ్యాఖ్యానించారు. శివాజీ వ్యాఖ్యలను వ్యక్తిగతంగా కాకుండా... మొత్తం మహిళలపై చేసిన వ్యాఖ్యలుగా ఆమె అభివర్ణించారు.

పురుషులే కారణం

దండోరా' సినిమా ఈవెంట్‌లో హీరోయిన్ల దుస్తులపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం మహిళా కమిషన్ దాకా వెళ్లగా, శివాజీ ప్రెస్ మీట్ పెట్టి క్షమాపణలు చెప్పినా వివాదం మాత్రం చల్లారడం లేదు.ఇప్పుడు ఈ అంశంపై సింగర్, సోషల్ యాక్టివిస్ట్ చిన్మయి మరోసారి ఘాటుగా స్పందించారు. శివాజీ వివరణలతో అసలు సమస్య పరిష్కారం కావడం లేదని... శివాజీ వివరణ ఇస్తున్న కొద్దీ, మహిళలకు ఇండస్ట్రీలో రక్షణ లేదనే విషయం మరింత స్పష్టమవుతోందని చెప్పారు.వేధింపులకు అసలు కారణం పురుషుల ప్రవర్తనే అని అంగీకరించడానికి చాలామంది సిద్ధంగా లేరని చిన్మయి తెలిపారు. మహిళల దుస్తులు, ప్రవర్తనపై వేలెత్తి చూపడం నేరాలను పరోక్షంగా ప్రోత్సహించినట్టేనని చెప్పారు. ఇలాంటి వ్యాఖ్యల వల్లే బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పడానికి భయపడుతున్నారని అన్నారు. ఇది ఒక మహిళ సమస్య మాత్రమే కాదని... మొత్తం మహిళా సమాజానికి సంబంధించిన అంశమని చెప్పారు.

## మీపార్టీని బొంద పెడతాం



**హైదరాబాద్, డిసెంబర్ 25: పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోస్గిలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ, 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని అన్నారు. నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు.నదీ జలాల హక్కులను కాపాడటం చేతకాని అసమర్థుడు అహంకారంతో మాట్లాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి సొంత జిల్లానే మోసం చేస్తున్నాడని ఆరోపించారు. అది చాలదన్నట్లుగా కేసీఆర్‌పై ఏది పడితే అది మాట్లాడుతున్నారని అన్నారు. సభ్యత, సంస్కారం లేని నీచమైన రేవంత్ రెడ్డి ప్రవర్తనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు.ప్రజలు ఛీకొడుతున్నా ఇంకా మారవా అని ఎద్దేవా చేశారు. శాసనసభతో పాటు జనసభలోనూ కాంగ్రెస్ పార్టీ జలద్రోహాన్ని ఎండగడతామని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో వందేళ్ల వరకు కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సందర్భం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## క్యాట్ లో నాన్ ఇంజనీరింగ్ విద్యార్థులే టాప్

**హైదరాబాద్, డిసెంబర్ 25: పెన్ పవర్:** దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మక ఐఐఎంలు, మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ అడ్మిషన్ టెస్టు (క్యాట్) 2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. క్యాట్ ఫలితాల్లో మొత్తం 12 మంది 100 పర్సంటైల్ స్కోర్ సాధించారు. అయితే ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్కరు కూడా వంద శాతం స్కోర్ సాధించ లేకపోవడం గమనార్హం. గత ఏడాది 100 పర్సంటైల్ స్కోర్ పొందిన 14 మందిలో తెలంగాణ విద్యార్థులు ఇద్దరు, ఏపీ అభ్యర్థి ఒకరు చోటు దక్కించుకున్నారు. 100 పర్సంటైల్ సాధించిన 12 మందిలో ఇద్దరు అమ్మాయిలున్నారు. అలాగే ఈ 12 మందిలో ఏకంగా 9 మంది ఇంజనీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ లేనివారే కావడం విశేషం. టాపర్లలో ముగ్గురు మాత్రమే ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉన్నారు. గతానికి భిన్నంగా ఈసారి నాన్ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఎక్కువ మంది టాపర్లుగా నిలవడం విశేషం. ఆ తర్వాత ర్యాంకుల్లో అంటే 99.99 పర్సంటైల్ సాధించిన వారు 26 మంది ఉన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్కరు మాత్రమే ర్యాంకు సాధించారు.కాగా ఈ ఏడాది నవంబరు 30వ తేదీన క్యాట్ 2025 పరీక్ష దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిదే. ఈ పరీక్ష ఫలితాలను ఐఐఎం కోజికోడ్ తాజాగా విడుదల చేసింది. మొత్తం 2.95 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. ఇందులో 2.58 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 97 వేల మంది అమ్మాయిలు, 1.61 లక్షల మంది అబ్బాయిలు ఉన్నారు. టాపర్ల పేర్లను త్వరలోనే వెల్లడించనున్నారు. క్యాట్ స్కోర్ ఆధారంగా ఆయా ఐఐఎంలు ఇంటర్వ్యూ నిర్వహించి సీట్లు కేటాయిస్తాయి. 96 ఆపై పర్సంటైల్ వచ్చిన వారికి ఓపెన్ కేటగిరీలో అంటే రిజర్వేషన్ లేకున్నా ఐఐఎంల్లో సీటు కేటాయించనున్నారు. రిజర్వేషన్ ఉన్న వారికి 90కిపైగా పర్సంటైల్ దక్కినవారికే సీట్లు కేటాయించనున్నారు. మొత్తం 22 ఐఐఎంలతోపాటు దేశ వ్యాప్తంగా 93 ఇతర విద్యా సంస్థలు క్యాట్ స్కోర్ ఆధారంగా సీట్లను కేటాయిస్తాయి

## కేసీఆర్ వల్లే నీటి కష్టాలు

**హైదరాబాద్, డిసెంబర్ 25: పెన్ పవర్:** కృష్ణా జలాల విషయంలో చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు కేసీఆర్ ద్రోహం చేశారని బండి సంజయ్ ఆరోపించారు. ఆయన నుంచి ముడుపులు అందుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్‌కు సానుభూతి రావాలని చెప్పి భూతులు తిడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష బాగాలేదని అంటున్నారు. మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో మాట్లాడిన బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. కోస్గీ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ తెలంగాణలో దుమరాన్ని రేపుతున్నాయి. ఆయన కేసీఆర్, కేసీఆర్ కుటుంబంపై వాడిన భాష అభ్యంతరకరంగా ఉందని అన్ని పార్టీల నేతలు కామెంట్స్ చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ నేతలు తీవ్రంగా తప్పుపడుతున్నారు. బండి సంజయ్ మాట్లాడుత... రేవంత్ రెడ్డి భాష సరిగా లేదని అన్నారు. గతంలో కేసీఆర్ కూడా ఇలాంటి భాష మాట్లాడి వ్యతిరేకత తెచ్చుకున్నారని అన్నారు. అప్పట్లో కూడా ఆయన భాషపై తాను అభ్యంతరం వ్యక్తం చేశానని అన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా భాషను సరి చేసుకోవాలని సూచించారు. కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు బండి సంజయ్. తెలంగాణకు కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందని కేసీఆర్ వల్లే అన్నారు. చంద్రబాబుతో కలిసి తీరని ద్రోహం చేశారని అన్నారు. 570 టీఎంసీలు రావాల్సి ఉంటే 299 టీఎంసీలకే అంగీకరించి గొంతుకోశారని అన్నారు. దీని కోసం చంద్రబాబు నుంచి ముడుపు తీసుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు మరోసారి ప్రజలను మోసం చేయడానికి కృష్ణా జలాలను ఎంచుకున్నారని ఆరోపించారు.తెలంగాణలో కాంగ్రెస్ పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతుందని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. దీంతో నేతలంతా తీవ్ర నిరాశలో ఉన్నారని అన్నారు. పడిపోతున్న తన పార్టీని, బీఆర్ఎస్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రేవంత్ రెడ్డి బూతులు తిడుతున్నారని అన్నారు. దీని వల్ల కేసీఆర్‌కు సానుభూతి వస్తుందని అన్నారు. అందుకే రెండు పార్టీలు కుమ్మక్కై ఇలాంటి నాటకాలు ఆడుతున్నాయని అన్నారు.

# సేవా కార్యక్రమాలు మరువని ప్రజలు




**చొప్పదండి: పెన్ పవర్:** నిరంతరం ప్రజలకు సేవ చేయాలనే తపనతో తన శాయ శక్తుల పరి తపిస్తూ పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు సహాయాలు రక్తదానాలు ఇలా ఎన్నో రకాల కార్యక్రమాలను చేపట్టిన దూలం కళ్యాణ్ కుమార్ గౌడ్ కు బూరుగు పల్లి గ్రామ ప్రజలు పట్టం కట్టారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో గౌడ కల్లు గీత కార్మిక కుటుంబానికి చెందిన కీ. శే.దూలం బక్కయ్య గౌడ్ లచ్చవ్వ దంపతుల ఏకైక పుత్రుడు దూలం కళ్యాణ్ కుమార్ గౌడ్ మధ్యతరగతి కుటుంబానికి చెందడంతో తన శక్తికొలది విధ్యాబ్యాసం కొనసాగించి ల్యాబ్ టెక్నీషియన్ గా పలు ప్రైవేట్ హాస్పిటల్స్ లో పనిచేస్తూ గత కొంతకాలంగా నమ్మకంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అపెక్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో సీనియర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ తనకు వచ్చిన సాలరీలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తూ వస్తున్నాడు. తన సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై తన స్నేహితులు కూడా తనకు అండగా నిలబడి ఎన్నో సేవా కార్యక్రమాలకు ఆర్దిక సహాయాలు అందిస్తూ పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యంగా రాష్ట్ర మొత్తం కుదిపేసిన కరోనా వైరస్ లాక్ డౌన్ సమయంలో నిరుపేదలకు ఉచిత నిరంతర అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. హాస్పిటల్స్ లో అడ్మిట్ అయి అత్యవసర సమయంలో రక్తం అందక ఇబ్బంది పడుతున్న వారికి నేనున్నాను అంటూ ముందుకు వచ్చి 56 సార్లు పైగా తానే స్వయంగా రక్తదానం చేస్తూ మరియు ఇతర స్నేహితులతో కూడా రక్తదానం చేపిస్తూ ఎందరో ప్రాణాలను కాపాడాడు. గ్రామాలలో వైద్యం అందక డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న వారికి ఇతరత్రా ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి అండగా నిలిచి తన మిత్ర బృందంతో కలిసి ఆర్థిక సహాయాలు చేశాడు. బూరుగుపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించేందుకు తన కృషి ఎంతో ఉంది. గ్రామంలో హాస్పిటల్స్ కు వెళ్లి పేద ప్రజలు అధిక బిల్లులతో బాధపడుతున్న వారికి తానే స్వయంగా సంబంధిత డాక్టర్లతో మాట్లాడి బిల్లులను తగ్గించడం పరీక్షలలో రాయితీలు ఇప్పించడం ఉచితంగా వైద్య పరీక్షలు చేపించడం జరిగింది. బీజేపీ ఓ బి సి జిల్లా మోర్చా అధ్యక్షులుగా కొనసాగుతూ ఎంపీ బండి సంజయ్ కుమార్ అండదండలతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాడు. గంగాధర మండలం లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా కొనసాగి మండలంలో ఎంతోమందికి సహాయ కార్యక్రమాలు చేపట్టి ఉచిత కంటి ఆపరేషన్లు కూడా చేపించాడు. బూరుగుపల్లి గ్రామంలో ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలిగిన నేనున్నాను అంటూ అందరి ఇంటిలో కుటుంబ సభ్యులు ఉన్నాడు. స్థానిక సంస్థల ఎన్నికలలో గ్రామ ప్రజల మద్దతుతో గ్రామ సర్పంచిగా పోటీలో నిలబడి ప్రత్యర్థులపై అత్యధిక మెజారిటి సాధించి జిల్లాలోనే చరిత్ర సృష్టించాడు. బూరుగుపల్లి గ్రామ ప్రజలు డబ్బులకు ప్రలోభ పడకుండా దూలం కళ్యాణ్ కుమార్ గౌడ్ గతంలో చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి గ్రామానికి నిజమైన సేవ చేసే నాయకుడు కావాలని సర్పంచ్ గా గ్రామస్థులు భారీ మెజార్టీతో గెలిపించి పట్టం కట్టారు. సర్పంచ్ గా గెలిచిన తర్వాత భారీ ఊరేగింపుగా గ్రామంలో తిరిగి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతూ సర్పంచ్ గా బాధ్యతలను గ్రామపంచాయతీ భవణంలో నాలుగు గోడల మధ్య తీసుకోకుండా లో గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద బహిరంగంగా ప్రజల సమక్షంలో దూలం కళ్యాణ్ కుమార్ గౌడ్ సర్పంచ్ గా తన బాధ్యతలను చేపట్టి పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడు. సర్పంచ్ గా బాధ్యతలు తీసుకున్న వెంటనే గ్రామంలో మృతి చెందిన వారి దహన సంస్కారాలు కేవలం ఒక్క రూపాయికే చేనున్నట్లు తీర్మానం చేసి తొలి సంతకం చేశాడు. గ్రామంలో పుట్టినరోజు సందర్భంగా వారి ఇంటికి గ్రామపంచాయతీ నుండి పాలకవర్గం సభ్యుల చేతుల మీదుగా ఒక మొక్కను పంపించి శుభాకాంక్షలు తెలిపుతున్నట్లు ప్రకటించి పర్యావరణానికి ప్రాముఖ్యత కల్పించాడు. గ్రామంలో పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవడానికి పాలకవర్గంతో సమావేశమై నిర్ణయాలు తీసుకున్నాడు. చికెన్ సెంటర్ ల నుండి వ్యర్థ పదార్థాలను పరిసర ప్రాంతాల్లో వేయకుండా వరద కాలువ సమీపంలో ప్రత్యేక గోతి తవ్వించి అక్కడే పడేయాలని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని చికెన్ సెంటర్ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి పాలకవర్గం సమక్షంలో నిర్ణయం తీసుకున్నారు. ఇలా వినూత్న నిర్ణయాలు తీసుకున్న బూరుగుపల్లి సర్పంచ్ దూలం కళ్యాణ్ కుమార్ గౌడ్ రాష్ట్రంలోనే సెన్సేషనల్ అయ్యాడు. సర్పంచ్ గా తాను తీసుకున్న నిర్ణయాలకు గ్రామ ప్రజలు జిల్లాలోని ఆయా గ్రామాల ప్రజలు కూడా సోషల్ మీడియాలో చూస్తే ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇలాంటి నివార్థ సేవా గుణం ఉన్న నాయకులు ఈ తరంలో ఉండడం చాలా అరుదుగా ఉండాలని ఇలాంటి యువ నాయకులు, విద్యావంతులు ముందుకు వచ్చి కలుస్తమైన రాజకీయాలను మార్చి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు...డిప్యూటీ సీఎం భట్టి



**ఖమ్మం జిల్లా: పెన్ పవర్:** మధిర నియోజకవర్గంలోని బయ్యారం చర్చిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ..చారిత్రాత్మకమైన బయ్యారం చర్చి నిర్మించుకొని 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చ్ కు చేరుకున్న సోదర సోదరీమణులందరికీ, స్నేహితులకు, రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు.
ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బయ్యారం చర్చ్ కు రావడం ఫాదర్ తో ప్రార్థనలు చేయించుకొని కేవలం మధిర నియోజకవర్గంలోని కుటుంబాలకే కాకుండా రాష్ట్రం మరియు దేశంలోని అన్ని కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రధానంగా మానవ మనుగడకు ప్రపంచవ్యాప్తంగా సహజీవనంతో జీవించేలా తద్వారా మానవ మనుగడకు మనం అంతా ప్రేమతో ఆప్యాయతో బతికేలా ఉండాలని ప్రతి సంవత్సరం ఈ చర్చి నుంచి ప్రభువును ప్రార్థిస్తున్నానన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ప్రభువు ఆశీర్వాదాలు ఉండాలని మంచి జరగాలని, కుటుంబాలు బాగా ఎదిగి పిల్లలు మంచిగా చదువుకొని ఎదగాలని ఫాదర్ తో ప్రార్థన చేయించుకుని ఇక్కడి నుంచి బయలుదేరుతానన్నారు. కేవలం ప్రార్థనలు చేయించుకుని బయలుదేయటమే కాదు ప్రభువు ఏ సందేశాన్ని అయితే మానవాళికి అందించారూ ఇతరుల కోసం, వారి ఇబ్బందుల నుంచి బయటపడేయడం కోసం ఎలా జీవించాలో ప్రభువు జీవితం మనకు నేర్పిస్తుంది అన్నారు. ఒకరికి మరొకరు సహాయ సహకారాలతో జీవించేందుకు ప్రభువు ఆశీస్సులు మనందరిపై ఉండాలని ప్రభువును ప్రార్థిస్తున్నాను అన్నారు. ప్రజలందరి యోగక్షేమాల కోసం ఈ అధికారం ఉపయోగపడే విధంగా మన ఆలోచనలు మనం మార్గం ఉండేటట్టుగా ప్రభువు మనల్ని నడిపించాలని ఆ ప్రభువును కోరుకుంటున్నానని తెలిపారు. ప్రభువు చూపించిన మార్గంలో పయనిస్తూ తోటి వారి కోసం పనిచేద్దామని మరోసారి ఎంతో చారిత్రాత్మకమైన ఈ బయ్యారం చర్చి నుంచి 125 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎంతో వైభవంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారని తెలుసుకొని ఆ వేడుకలు వైభవంగా జరగాలని ప్రపంచవ్యాప్తంగా శాంతి సందేశం వెళ్లేలా ఉత్సవాలు భారీగా ఉండాలని తాను కోరుకుంటున్నాను. బయ్యారంలో అభివృద్ధి కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం భగవంతుడు నిండుగా మనకు శక్తిని ఇవ్వాలని ఆయన శక్తితో వచ్చే అధికారం హోదాతో కూడా ప్రజా సంక్షేమ కోసం ఉపయోగపడేట్టుగా మన ఆలోచనలు మన మార్గాన్ని నడిపించే విధంగా వారు ఆశీర్వదిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అందరికీ రాబోయే రోజుల్లో మంచి జరగాలని ఈ క్రిస్మస్ సందర్భంగా విస్మస్ శుభాకాంక్షలు తో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందరికి తెలియజేస్తున్నానన్నారు.

# వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్య..

**హైదరాబాద్ పెన్ పవర్:** అచ్చంపేట పట్టణం మారుతి నగర్ కాలనీలో సంచలన హత్య కేసు వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడితో వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్య, అదే సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో తన భర్తను హత్య చేసిన ఘటన కలకలం రేపుతోంది.
అచ్చంపేట మారుతి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మణ్ నాయక్ (38), పద్మ (30) దంపతులు. గత నెల 25న లక్ష్మణ్ నాయక్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, ఈ ఘటనపై అతని తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పోలీసుల దర్యాప్తులో షాకింగ్ నిజాలు వెలుగుచూశాయి. 2024 డీఎస్సీ ద్వారా ఎంపికై ఉప్పునుంతల మండలం బట్టుకాడిపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పద్మకు, తాడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న రాత్లావత్ గోపి అనే ఉపాధ్యాయుడితో వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ అక్రమ సంబంధానికి లక్ష్మణ్ నాయక్ అడ్డుగా మారడంతో, అతన్ని హతమార్చాలని పద్మ, గోపి కలిసి కుట్ర పన్నినట్లు విచారణలో తేలింది. గత నెల 24న రాత్రి నిద్రలో ఉన్న లక్ష్మణ్ నాయక్ ముక్కు, నోటిని గుడ్డతో మూసి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. హత్య అనంతరం మరుసటి రోజు ఉదయం ఏమి తెలియనట్లు పద్మ పాఠశాలకు వెళ్లింది. అనంతరం ఇంటి యజమానికి ఫోన్ చేసి, తన భర్త ఫోన్ ఎత్తడం లేదని, తనకు భయంగా ఉందని ఆందోళన నటించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇంటికి వచ్చాక భర్త మృతిచెందినట్లు నమ్మించడంతో, మృతుడి తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.సూక్ష్మంగా విచారణ జరిపిన పోలీసులు, అక్రమ సంబంధమే హత్యకు కారణమని ఆధారాలతో రుజువు చేశారు. ఈ మేరకు పద్మ, రాత్లావత్ గోపిలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు







**సిద్దిపేట: పెన్ పవర్:** సిద్దిపేట పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గోన్నారు.
ఈ సందర్బంగా హరీష్ రావు మాట్లాడుతు అందరికీ క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు. ప్రతి ఏడాది ఆనవాయితీగా క్రిస్మస్ వేడుకల్లో ఇక్కడ పాల్గొంటునాను. ఈ పవిత్ర మాసంలో ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది క్రిస్టియన్ లు ఈ పండగ జరుపుకుంటున్నారు. ఏసు ప్రభువు ఎంతో మంచి సందేశాన్ని ప్రపంచానికి అందించారు. ప్రేమా భావాన్ని, సేవాతత్పరతను, క్షమా గుణాన్నీ బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు..
యేసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికీ లభించాలని, అందరూ సంతోషంగా ఉండాలి కెసిఆర్ గత ప్రభుత్వంలో క్రిస్మస్ సందర్భంగా రెండు రోజుల పాటు సెలవులు ఇచ్చారు. కెసిఆర్ అన్ని మతాలను గౌరవించారు. క్రిస్మస్ కిట్టు, బతుకమ్మ చీరెలు, రంజన్ తోపా ను కెసిఆర్ అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్మస్ కిట్టు అందించడం లేదు, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.

# ఎక్కడ నుంచైనా ఔటర్ కు...

**హైదరాబాద్, డిసెంబర్ 25, పెన్ పవర్:** హైదరాబాద్ నగరవాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు హెచ్ఎండీఏ సరికొత్త ఎలివేటెడ్ కారిడార్లను ప్రతిపాదించింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుండి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు పది కిలోమీటర్ల మేర ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నారు. అలాగే, షేక్‌పేట్ నాలా నుండి గండిపేట సీబీఐటీ వరకు 200 అడుగుల రహదారి విస్తరణతో పాటు భవిష్యత్తులో ఎలివేటెడ్ కారిడార్‌ను డిజైన్ చేస్తున్నారు. ఇప్పటికే ప్యారడైజ్ నుండి శామీర్‌పేట వరకు 18.5 కిలోమీటర్ల కారిడార్ పనులు ఖరారయ్యాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నగరం నడిబొడ్డు నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు సిగ్నల్ లేకుండా అతి తక్కువ సమయంలో చేరుకోవచ్చు.హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో.. కోర్ సిటీ నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం వాహనదారులకు పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం ఉన్న రహదారులు పెరుగుతున్న వాహనాల రద్దీని తట్టుకోలేకపోతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ భారీ ఎలివేటెడ్ కారిడార్లు , ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.నగరం నడిబొడ్డు నుండి ఐటీ కారిడార్‌కు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్టును సిద్ధం చేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుండి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్లేలా ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నారు. ఈ రహదారి ఫిలింనగర్, జడ్జెస్ కాలనీ, దుర్గం చెరువు పక్క నుండి టి-హబ్ మీదుగా సాగుతుంది.

సుమారు 10 కిలోమీటర్ల పొడవుండే ఈ మార్గంలో 7 కిలోమీటర్ల మేర అత్యాధునిక స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తారు. ఎక్కడా సిగ్నల్ లేకుండా నేరుగా ఔటర్ చేరుకునేలా దీనిని రూపొందిస్తున్నారు.మెహదీపట్నం, టోలిచౌకి నుండి గండిపేట వైపు వెళ్లే వాహనాల కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధి చేస్తున్నారు. షేక్‌పేట్ నాలా నుండి మణికొండ పైప్‌లైన్ రోడ్డు మీదుగా గండిపేటలోని సీబీఐటీ కాలేజీ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 200 అడుగులకు విస్తరించనున్నారు. ఈ వెడల్పైన రహదారిపై భవిష్యత్తులో 7 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేలా డిజైన్ చేస్తున్నారు. ఇది పూర్తయితే పాత ముంబై హైవేపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది.సికింద్రాబాద్ ప్యారడైజ్ నుండి శామీర్‌పేట ఔటర్ జంక్షన్ వరకు 18.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. సుమారు 2,232 కోట్ల రూపాయలతో చేపట్టే ఈ ప్రాజెక్టులో 11.65 కిలోమీటర్ల ఆరు వరుసల ఫ్లైఓవర్ ఉంటుంది. హకీంపేట వద్ద భూగర్భ టన్నెల్ నిర్మాణం ఈ ప్రాజెక్టులో మరో ప్రత్యేకత. ఈ కారిడార్ పూర్తయితే కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట వైపు నుండి వచ్చే వాహనాలు నగరం లోపలికి వేగంగా రావచ్చు. దీనిని 24 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.హైదరాబాద్‌లో ఈ ఎలివేటెడ్ కారిడార్లు ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా.. నగర ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం చూపుతాయి. గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో పని చేసే లక్షలాది మంది ఉద్యోగులకు ఈ కొత్త కనెక్టివిటీ రోడ్లు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. ట్రాఫిక్ జాంలు తగ్గడం వల్ల ఇంధన వినియోగం తగ్గి.. నగరంలో వాయు కాలుష్యం తగ్గుముఖం పడుతుంది.మణికొండ, గండిపేట, శామీర్‌పేట పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటం వల్ల ఆయా ప్రాంతాల్లో నివాస గృహాలకు డిమాండ్ పెరుగుతుంది. మెట్రో రైలు, ఈ కొత్త ఎలివేటెడ్ కారిడార్ల మధ్య అనుసంధానం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నగరం నలుమూలల నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు గ్రీన్ ఛానెల్ కనెక్టివిటీని ఏర్పాటు చేయడం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలున్న నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

# మామూళ్ల మత్తులో మైనింగ్, రెవెన్యూ శాఖలు!

**మహబూబ్ నగర్, డిసెంబర్ 25, పెన్ పవర్:** రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేరుతో తన అనుచర వర్గం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో మట్టి దందాకు తెర లేపుతోంది. అధికార పార్టీ మాదే మంత్రి మావాడే నంటూ పగలు రాత్రి అని తేడా లేకుండా ప్రభుత్వ భూములు, గుట్టలను ధ్వంసం చేస్తూ అడ్డగోలుగా భారీ హిటాచీలతో గోతులు తీసి టిప్పర్ల ద్వారా మట్టి సరఫరా చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కోట్లు వెనకేసుకుంటున్నారు.రాత్రుళ్ళు టిప్పర్లు, పగలు ట్రాక్టర్ల రోడ్ల నిండా హంగామా చేస్తున్నారు. అడిగిన అధికారులకు మంత్రి మావాడే అంటూ జవాబిస్తూ జాతీయ రహదారి నిర్మాణ పనులు, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తమకు నచ్చినట్లు మట్టిని తరలిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇతరులకు మట్టిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.నిబంధనల ప్రకారం మైనింగ్ రెవెన్యూ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి కానీ అధికార పార్టీ అండ దండ పుష్కలంగా ఉండటంతో కొంతమంది మండల, జిల్లా స్థాయి అధికారులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని కాంగ్రెస్ ఖద్దరు నేతలు పగలు రాత్రి అని తేడా లేకుండా మట్టి తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దగ్గరలోని ఇతర రైతుల పంట పొలాల గుండా అక్రమంగా ప్రయాణిస్తూ ప్రశ్నించిన వారిని టిప్పర్ తో తొక్కిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతూ తమ వెనకాల మంత్రి అండదండలు ఉన్నాయంటూ ఇతర పార్టీ లీడర్లను కూడా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ మధ్య జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ పోటీ చేసి అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలిచిన సందర్భంలో పరాజయం పాలైనట్లు అందుకు ప్రధాన కారణం అక్రమ మట్టి తరలింపు, అహంకారం, దౌర్జన్యాలేనని బాహాటంగా చర్చించుకుంటున్నారు. అయినప్పటికీ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఇలాంటివారిని ప్రోత్సహిస్తున్నారా అని సామాన్యులు ముక్కున వేలేసుకుంటున్నారు.నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ భూములు, గుట్టలు ధ్వంసం అవుతున్న సంబంధిత మండలాల రెవెన్యూ అధికారులు జిల్లా మైనింగ్ శాఖ అధికారులు పోలీసు అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వెనక అవినీతి ముడుపుల మతలబు ఉందని చర్చ జరుగుతుంది.తెలకపల్లి మండలం రామగిరి గుట్టలు, తూడుకుర్తి గ్రామంలోని ఎర్రగుట్టలు, గన్యాకుల గ్రామంలోని గుట్టలు, పెద్దకొత్తపల్లి మండల పరిసరాల్లోని కుమ్మరి గుట్టలు, కోడేర్ ఇతర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన భారీ కొండలను సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధ్వంసం చేసి మట్టి దందాకు తెర లేపారు. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారుల ఒక్కో ప్రాంతంలో గుట్టలను తవ్వుకోవడం కోసం తెర వెనక ధర నిర్ణయించి భారీ మొత్తంలో ముడుపులు అందుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఆయా ప్రాంతావాసులు తరచూ రెవెన్యూ పోలీస్ మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలించడం కోసం రెవెన్యూ మైనింగ్ శాఖ అధికారులు ఇతర ప్రైవేటు వ్యక్తుల చేత అడ్డ పద్ధతిన టిప్పర్లను కూడా ఏర్పాటు చేసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి.ఇందిరమ్మ ఇ

ల్లు కట్టుకునే ఒక సామాన్యుడు ట్రాక్టర్ మట్టి తీసేందుకు ప్రయత్నించినా వెంటనే వాలిపోయే రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు భారీ స్థాయిలో హిటాచీలతో పెద్ద మొత్తంలో గోతులు తీసినా ఎందుకు స్పందించడం లేదో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగులుతోంది. మట్టి మాఫియా చెప్పినట్లుగా ఇందుకు నిజంగానే మంత్రి అండగా నిలిచాడా అన్న అనుమానాలు లేకపోలేదు.బీఆర్ఎస్ నేతల అవినీతి అక్రమాలు ఆగడాలను విసిగి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపిన ప్రజలకు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రుల ముసుగులో ఉన్న నేతల అనుచరులు చేస్తున్న అరాచకాలు భంగపాటుకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మట్టి దందాల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు వాతావరణ సమతుల్యత దెబ్బతిని భారీ వృక్షాలు నేలకూలి ఇతర జీవరాసులు కూడా మృత్యువాత పడే ప్రమాదం లేకపోలేదని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయా గ్రామ పంచాయతీల పరిపాలన పగ్గాలు చేతబట్టిన నేపథ్యంలో ఇప్పటికైనా ఈ అక్రమాలకు కళ్లెం పడుతుందా వేచి చూడాలి.

# కీ రోల్ కానున్న పెన్ డ్రైవ్

**హైదరాబాద్, డిసెంబర్ 25, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఇన్నాళ్లు విచారణ, అరెస్టుల చుట్టూ తిరిగిన ఈ కేసు దర్యాప్తు ఇప్పుడు ఒక పెన్‌డ్రైవ్ కేంద్రంగా మారింది. అందులో నిక్షిప్తమైన సమాచారం బీఆర్ఎస్ అగ్రనాయకత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు వద్ద లభించిన ఈ పెన్‌డ్రైవ్‌లో ట్యాపింగ్‌కు సంబంధించిన పక్కా ఆధారాలు ఉన్నాయని సిట్ భావిస్తోంది. ఈ సాక్ష్యాల ఆధారంగానే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు నోటీసులు జారీ చేసేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది.ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో ప్రభాకర్ రావు అత్యంత రహస్యంగా సేకరించిన సమాచారాన్ని ఈ పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచినట్లు సిట్ గుర్తించింది. ఇందులో ఉన్న వివరాలను చూసి అధికారులే విస్తుపోతున్నారు. కేవలం ఫోన్ నంబర్లు మాత్రమే కాకుండా.. హైకోర్టు జడ్జీలు, ప్రముఖ జర్నలిస్టులు, కీలక రాజకీయ నాయకులు, బడా వ్యాపారవేత్తల పూర్తి ప్రొఫైల్స్ ఇందులో ఉన్నట్లు సమాచారం. వందల సంఖ్యలో ట్యాప్ చేసిన ఫోన్ నంబర్లు, వారి వ్యక్తిగత సమాచారం ఇందులో నిక్షిప్తమై ఉంది.ప్రస్తుతం సిట్ కస్టడీలో ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావును ఈ పెన్‌డ్రైవ్ ఆధారంగానే అధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఎల్లుండి వరకు ఆయన్ను విచారించనున్న నేపథ్యంలో.. ఈ పెన్‌డ్రైవ్‌లోని డేటాను ఎవరి ఆదేశాల మేరకు సేకరించారు.? ఎవరికి చేరవేశారు.? అన్న కోణంలో లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను , మరో మాజీ ఎస్ఐబీ చీఫ్‌ను విచారించిన సిట్.. ఇప్పుడు ప్రభాకర్ రావు ఇచ్చే సమాచారంతో కేసును ముగింపు పలికే దిశగా వెళ్తోంది.అసలు ఈ ట్యాపింగ్ పర్వం ఎవరి ప్రయోజనాల కోసం జరిగింది.? అన్నదే ఇప్పుడు సిట్ ముందున్న ప్రధాన ప్రశ్న. ప్రభుత్వంలోని పెద్దల ఆదేశాలు లేనిదే ఇంతటి భారీ నిఘా యంత్రాంగం నడవదని అనుమానిస్తున్న అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. పెన్‌డ్రైవ్‌లో ఉన్న సమాచారం కను క నేరుగా రాజకీయ పెద్దలకు లింక్ అయితే, వారికి నోటీసులు ఇవ్వడం ఖాయమని పోలీసు వర్గాల టాక్. ఈ పెన్ డ్రైవ్ వ్యవహారం బయటకు రావడంతో.. అందులో ఎవరెవరి పేర్లు ఉ న్నాయన్నది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ట్యాపింగ్ కేసులో ఇన్నాళ్లు దొరకని కీలక లింక్ ఈ పెన్ డ్రైవ్ రూపంలో దొరికిందని, ఇదే ఈ కేసులో గేమ్ ఛేంజర్ కాబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలోనే ఈ కేసులో మరిన్ని సంచలన అరెస్టులు లేదా నోటీసులు వెలువడే అవకాశం ఉంది.

# తగ్గేదేలే అంటున్న బంగారం వెండి ధరలు...

## సామాన్యులకు అందని పుత్తడి.

**కమాన్ పూర్: పెన్ పవర్:** వెండి, బంగారం ధరలు మళ్లీ జోరందుకున్నాయి. వెండి ధర గురించి చెప్పనక్కరలేదు.. తారాస్థాయిలో రేటు పలుకుతోంది. కిలో వెండి ధర ఏకంగా రూ.5 వేలకు పెరిగి ఆల్ టైమ్ రికార్డు రూ.2,31,000 కు చేరింది. వెండి దూకుడు చూస్తుంటే వచ్చే ఏడాది జనవరిలోనే రూ.2,50,000 వేలు పలికినా ఆశ్చర్యపడనక్కరలేదు అంటున్నారు నిపుణులు. అలాగే రానున్న రోజుల్లో బంగారం కొనాలి అంటే సామాన్య మానవుడు కొనే పరిస్థితి నెలకొంటోంది. ఫిబ్రవరిలో పెళ్లిళ్ల ఉండటంతో సామాన్య మానవులు ధరలను చూసి లబోదిబో , వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్సైట్ ప్రకారం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,40,400కు చేరుకుంది. కేవలం గంటల వ్యవధిలోనే బంగారం ధరలు దూకుడు మీదున్నాయి. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ. వేల ధరమేర పెరిగి రూ.1,31,000కు చేరుకుంది. కొన్ని రోజులుగా అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న వెండి ధర గురువారం కూడా అదే ట్రెండ్ను కొనసాగిస్తోంది. ఏకంగా రూ. 5 వేల మేర పెరిగి రూ.2,19,000కు చేరుకుంది. అంతర్జాతీయంగా కూడా పసిడి, వెండి ధరలు చుక్కలను అంటాయి. 24 క్యారెట్ల ఔన్స్ స్పాట్ గోల్డ్ ధర 4,383 డాలర్లను తాకింది. అక్టోబర్లో నమోదైన జీవితకాల గరిష్టం కంటే 1.5 శాతం మేర పెరిగింది. ఔన్స్ వెండి ధర కూడా 3.4 శాతం మేర పెరిగి 70 డాలర్లకు చేరువైంది. ఫెడ్ రేట్ల కోతపై పెరిగిన అంచనాలతో బంగారం, వెండి ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయని నిపుణులు చెబుతున్నారు. . ఇదే డిసెంబర్ 24వ తేదీన వెండి కిలో ధర రూ.2,10,000ఉండటం గమనార్హం. పసిడి కూడా ఏమాత్రం తగ్గకుండా పరుగు లంకించుకుంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,100 పెరిగి రూ.1,40,400కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1000 పెరిగి రూ.1,30,000లకు చేరింది. పసిడి ధరలు కూడా మరింత పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బంగారం ధర ఇలాగే ఉంటే సామాన్యులు మాత్రం బంగారం దిక్కు చూడకుండా రోల్డ్ గోల్డ్ వేసుకునే పరిస్థితి నెలకొంది అని సామాన్యులు తెలుపుతున్నారు. రానున్న ఫిబ్రవరి పెళ్లిళ్ల సీజన్లో బంగారం ధర ఎంతవరకు పరుగెడుతుందో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.



## సికింద్రాబాద్ లో వాజ్ పేయికి నివాళులు

**సికింద్రాబాద్.. పెన్ పవర్:** అటల్ బిహారీ వాజ్పేయి 101 జయంతి సందర్భంగా జెబిఎస్ పార్క్ లోని ఆయన విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ,కేంద్రమంత్రి కిషన్ రెడ్డి,భాజపా అధ్యక్షుడు రామచందర్ రావు,మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్,కార్పొరేటర్లు హాజరయ్యారు. గవర్నర్ జిష్ణుదేవ వర్మ మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్పేయి జయంతిని సుపరిపాలన దినోత్సవం గా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. భారతదేశ అభివృద్ధిలో కీలక మార్పులు తీసుకువచ్చిన స్ఫూర్తి ప్రదాతగా వాజ్పేయిని అభివర్ణించారు. గొప్ప దార్శనికత, దూరదృష్టి, ఆదర్శవంతమైన నేతగా దేశ చరిత్రలో నిలిచారని అన్నారు. గ్రామీణ సడక్ యోజన, సర్వ శిక్ష అభియాన్, మొబైల్ ఫోన్స్ రంగంలో దివంగత ప్రధాని వాజ్పేయి చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. భారతదేశాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు అటల్ బిహారీ వాజ్పేయి చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. హైదరాబాదు నగరంలో మరిన్ని వాజ్పేయి విగ్రహాలు రావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు.

## పేద క్రైస్తవ కుటుంబాలకు రైస్ బ్యాగ్ లు పంపిణీ...



**హైదరాబాద్, డిసెంబర్ 25, పెన్ పవర్:** క్రిస్మస్ దే సందర్భంగా గోదావరిఖని లోని కల్వరి సువార్త సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేళ్ళ హరీష్ రెడ్డి పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫాస్టర్ జీవరత్నం తో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. 30మంది పేద క్రైస్తవ కుటుంబాలకు 25కిలోల రైస్ బ్యాగ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. క్రైస్తవ సోదరులు అంటే కెసిఆర్ గారికి అమితమైన ప్రేమ అని అన్నారు కెసిఆర్ పాలనలో క్రైస్తవ కుటుంబాలకు క్రిస్మస్ సందర్భంగా ఉచితంగా దుస్తుల పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి శాంతి, ప్రేమ, సేవాగుణం నేర్పించాయని పేర్కొన్నారు. రామగుండం ప్రజలు అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇక్కడ ప్రజాస్వామ్యం లేదని, అధికారులు, పోలీసులు ఎమ్మెల్యే ఆదేశాలు పాటిస్తున్నారని అన్నారు. పేద ప్రజల ఇండ్లు కూల్చడమే ప్రజా పాలననా అని ప్రశ్నించారు. ప్రజలు సంఘటితమైతే రౌడీ పాలన అంతమవుతుందని సూచించారు. ప్రస్తుతం రామగుండం దేశంలో ఎక్కడా లేనివిధంగా కాలుష్య కోరల్లో చిక్కుకుందని కాలుష్యాన్ని తరిమికొట్టి ఆరోగ్య సేవ గుంగా గల రామగుండం గా తీర్చిదిద్దేందుకు అందరూ ఏకతాటిపైకి రావాలని హరీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రాంత ప్రజల సంక్షేమం, చిరు వ్యాపారులకు నష్టం జరగకుండా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా హరీష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జిమ్మిద్ పాషా, పోలాడి శ్రీనివాస్ రావు, యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, నడిపెల్లి సాయి సిగిరి రాము కొండా సురేష్ పొయిల రవి కే రాములు అనిల్ అల్లి గణేష్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల వద్ద నుంచి వైన్ షాపును తరలించాలి.



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా: పెన్ పవర్:** చిట్యాల మండల కేంద్రంలో వైన్స్‌పై ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా అఖిలపక్ష ఆందోళన చేశారు విద్యార్థులను మద్యపానానికి బానిసలు చేస్తే ఊరుకునేది లేదని నాయకులు హెచ్చరించారు. చిట్యాల మండల కేంద్రంలో లక్ష్మీనరసింహ వైన్స్ కారణంగా జూనియర్ కాలేజీ విద్యార్థులు మద్యపానానికి బానిసలవుతున్నారని ఆరోపిస్తూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, వీ సీ కే యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్, రాష్ట్ర నాయకులు వరంగల్ పార్లమెంట్ కాంటెస్ట్ ఎంపీ అభ్యర్థి ఎస్ఎఫ్ కే సాగర్, టీ ఆర్ పీ యూత్ జిల్లా అధ్యక్షులు బండి సునీల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నమైందని, నిబంధనల ప్రకారం విద్యాసంస్థలకు కనీసం ఒక కిలోమీటర్ దూరంలో ఉండాల్సిన వైన్ షాపులు మండల కేంద్రాల్లో, కాలేజీలకు అతి సమీపంలో కొనసాగడం వల్ల విద్యార్థులు మద్యపానానికి అలవాటుపడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యార్థినీలు, మహిళలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైన్ షాప్ అనుమతుల విషయంలో ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, చిట్యాల మండల కేంద్రంలో ఉన్న వైన్ షాపులను విద్యాసంస్థలకు దూరంగా తరలించడంతో పాటు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్షాల తరఫున డిమాండ్ చేశారు.

ధర్నా అనంతరం పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీధర్, విష్ణు, మహేష్ కుమార్, కిట్టు, సిద్ధు, చింటూ, మహేష్ తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## పత్రికల్లో మీడియాలో తప్పుడు ఆరోపణలు ప్రచురించిన పత్రిక రిపోర్టర్లకు లీగల్ నోటీసులు.

**జమ్మికుంట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వరరావు,**



**జమ్మికుంట, పెన్ పవర్:** రాజకీయ పార్టీ నాయకులు కొంతమంది విలేకరులు నాపై కావాలని రాజకీయంగా నన్ను ఇబ్బందులు గురిచేయాలనే ఉద్దేశంతో నాపై, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం శివారులో గల అంజన టౌన్ షిప్ పైన తప్పుడు ఆరోపణలు రాతలు రాస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఏదైనా చట్టాల ద్వారా వారికి సమాధానం చెప్తానని జమ్మికుంట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వరరావు, అన్నారు. గురువారం రోజున తన నివాసంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించి రాజేశ్వరరావు, మాట్లాడుతూ రాజకీయంగా నన్ను ఎదుర్కొనే దమ్ము లేక కొంతమంది ఒక పత్రిక ఒక మీడియా ఛానల్ విలేకరులను ఆసరా తీసుకొని నాపై తప్పుడు రాతలు రాపిస్తున్నారని అన్నారు. అంజనా టౌన్ షిప్ పైన తప్పుడు వీడియోలు తప్పుడు రాతలు విలేకరులకు లీగల్ నోటీసులు, జిల్లా కలెక్టర్ లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల నుండి అనేక రకాలుగా నన్ను ఇబ్బందులు గురిచేస్తూ అంజన టౌన్ షిప్ పై ఎంతోమంది ఫిర్యాదులు చేశారని ప్రభుత్వాధికారులు వచ్చి ఎలాంటి ప్రభుత్వ భూమి అంజనా టౌన్ షిప్ లో లేదని నిర్ధారించిన కానీ కొంతమంది అందులో ఇల్లు కట్టుకొని నివసిస్తున్న ప్రజలను నన్ను రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని ఉద్దేశంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం అంజన టౌన్ షిప్ లేఔట్ ప్రారంభించినప్పుడు అన్ని రకాలుగా ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకున్నట్లు తర్వాతనే అందులో క్రయవిక్రయాలను ప్రారంభించామని అప్పటినుండి ప్రభుత్వం ఏ విధంగా అయితే లేఅవుట్ పర్మిషన్ ఇవ్వడానికి ఎలాంటి అర్హతలు ఉండాలో అన్ని పత్రాలు సంబంధిత అధికారులకు సమర్పించిన తర్వాతనే ప్రారంభించామని రాజేశ్వర్ రావు, తెలిపారు. ఒక మీడియా ఛానల్ ఒక పత్రిక రిపోర్టర్ ను అడ్డుపెట్టుకొని నా పైన తప్పుడు రాతలు రాస్తే సహించేది లేదని రాజేశ్వరరావు విలేకరుల సమక్షంలో హెచ్చరించారు.

## మరో బస్సు ప్రమాదం ప్రయాణికులు క్షేమం

**హైదరాబాద్: పెన్ పవర్:** హైదరాబాద్ టు గోవా వెళ్తున్న ఎస్ ఆర్ కే ట్రావెల్స్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. 40 మంది ప్రయాణికులతో హైదరాబాదు నుంచి ఎస్ ఆర్ కే ట్రావెల్స్ బస్సు బయలుదేరింది. కర్ణాటక హోస్పేట వద్దకు చేరగానే బస్సు వెనుక భాగంలో మంటలు రేగాయి. ప్రయాణికులు మంటలను గుర్తించి డ్రైవర్ను అప్రమత్తం చేసారు. బస్సులో మంటలను అదుపుచేసే ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది వాటర్ కాన్ లతో మంటలను అదుపుచేసారు. సమయానికి ప్రయాణికులు గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం తెల్లవారుజాము 5 గంటలకు ఘటన జరిగింది.

## మంటల్లో బస్సు దగ్ధం.. ప్రయాణికుల సజీవ దహనం

**బెంగళూరు: పెన్ పవర్:** కర్ణాటకలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కంటైనర్ లారీ ఢీకొట్టిన ఘటనలో బస్సులో న మంటలు చెలరేఆయి. ప్రయాదంలో 18 మందికి పైగా సజీవ దహనం అయ్యారు. ట్రావెల్స్ బస్సు మంటల్లో పూర్తిగా కాలి బూడిదైయింది. బెంగళూరు నుంచి గోకర్ణ కు వెళ్తుండగా హిరియూర్ లోని గోర్లట్లు వద్ద ఘటన చోటు చేసుకుంది. గుఉరువారం ఉదయం 3గంటల ప్రాంతంలో ఘటన జరిగింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుంది. మృతులు అంతా గోకర్ణ చెందిన వారిగా గుర్తించారు. బస్సు లో 31 మంది ప్రయాణికులు వున్నారు. .

## డ్రంకన్ డ్రైవ్ లో పాల్గోన్న సీపీ సజ్జనర్

**హైదరాబాద్: పెన్ పవర్:** బంజారాహిల్స్లోని టీజీ స్టడీ సర్కిల్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను బుధవారం అర్ధరాత్రి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. తనిఖీలు జరుగుతున్న విధానాన్ని, సిబ్బంది పనితీరును పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. డ్రంకెన్ డ్రైవ్లో పట్టుబడిన వారితో మాట్లాడి.. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. డిసెంబరు 31 రాత్రి వరకు నగరవ్యాప్తంగా 'స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్' నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఏడు ప్లాటూన్ల అదనపు బలగాలతో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.తనిఖీల్లో పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. తీవ్రతను బట్టి డ్రైవింగ్ లైసెన్సు్ను శాశ్వతంగా రద్దు చేసేలా రవాణా శాఖకు సిఫార్సు చేస్తామన్నారు.

## లిక్కర్ అమ్మకాలు అర్ధరాత్రి వరకు ఓ పెన్



**హైదరాబాద్, డిసెంబర్ 25, పెన్ పవర్:** న్యూ ఇయర్ వేళ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం విక్రయదారులు, వినియోగదారులకు ఊరటనిచ్చేలాడ.డిసెంబర్ 31వ తేదీన మద్యం విక్రయాల వేళలను పొడిగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక జీవోను జారీ చేసింది.ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల ప్రకారండ. రాష్ట్రంలోని అన్ని వైన్ షాపులు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12:00 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఇక బార్లు, క్లబ్బులు , టూరిజం ప్రాంతాల్లోని హోటళ్లు, అలాగే ప్రత్యేకంగా అనుమతి పొందిన ఈవెంట్ నిర్వాహకులకు రాత్రి ఒంటి గంట వరకు పని చేయడానికి అనుమతి ఉంటుంది.మరోవైపు న్యూ ఇయర్ వేళ హద్దుదాటి ప్రవర్తించే వారిపై పోలీస్ శాఖ నిఘా పెట్టనుంది. డిసెంబర్ 27వ తేదీ నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ కూడా ప్రత్యేక తనిఖీలు , డ్రైవ్స్ చేపట్టనుంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా వచ్చే మద్యం , నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ఎక్కడిక్కడ సోదాలు చేపట్టనుంది. ముఖ్యంగా డిసెంబర్ 30 , 31 తేదీలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. సిటీలోనే కాకుండాడ చెక్ పోస్టుల వద్ద కూడా నిఘా పెంచనుంది.ఇక నూతన సంవత్సర వేడుకల పేరుతో రోడ్లపై హంగామా సృష్టిస్తూ, హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. తాగి వాహనాలు నడిపే వారిపై బుధవారం నుంచి న్యూ ఇయర్ రోజు వరకు నగరవ్యాప్తంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు నగర సీపీ సజ్జనార్ వివరాలను వెల్లడించారుక్రిస్మస్, వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. హాట్ స్పాట్లు, గతంలో నేరాలు జరిగిన ప్రాంతాల్లో సిబ్బందిని మోహరించాలని, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు.డిసెంబరు 31 రాత్రి నగరవ్యాప్తంగా 100 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని సీపీ తెలిపారు. ఇందుకోసం 7 ప్లాటూన్ల అదనపు బలగాలను రంగంలోకి దించుతున్నామన్నారు. కొత్త సంవత్సరం జోష్లో మోతాదు మించి తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే వాహన సీజ్తో పాటు రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

## మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా హైదరాబాద్

**హైదరాబాద్, డిసెంబర్ 25, పెన్ పవర్: :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలనాపరమైన సంస్కరణలకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. డివిజన్ల పునర్విభజన ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకోవడంతో.. క్షేత్రస్థాయిలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జోన్లు, సర్కిళ్ల సంఖ్యను భారీగా పెంచాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ నిర్ణయించారు. ఈ ప్రతిపాదిత ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడమే తరువాయి.. వారం రోజుల్లో కొత్త సర్కిళ్లు, జోన్ల హద్దులను ఖరారు చేస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.గతంలో 650 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జీహెచ్ఎంసీ.. ఇటీవల 27 శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల విలీనంతో ఏకంగా 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ప్రస్తుతం ఆరు జోన్లు, 30 సర్కిళ్ల ద్వారా సాగుతున్న పరిపాలన ఇంత భారీ విస్తీర్ణానికి సరిపోవడం లేదని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం నుంచి పెద్దఅంబర్పేట్ వంటి సుదూర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, రహదారుల పనులను పర్యవేక్షించడం జోనల్ కమిషనర్లకు సవాలుగా మారింది. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుతమున్న 6 జోన్లను 12కు, 30 సర్కిళ్లను 60కి పెంచాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రతి జోన్ పరిధిలో సగటున ఐదు సర్కిళ్లు ఉండి, పర్యవేక్షణ మరింత సులభతరం కానుంది.వచ్చే ఏడాది జనవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఒకసారి జనగణన మొదలైతే, తదుపరి రెండేళ్ల వరకు డివిజన్ల మార్పులు లేదా పునర్విభజన చేపట్టడం సాధ్యపడదు. ఈ సాంకేతిక ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని.. ప్రభుత్వం అత్యంత వేగంగా శివారు ప్రాంతాల విలీనాన్ని పూర్తి చేసి పునర్విభజన ప్రక్రియను కొలిక్కి తెచ్చింది. ఈ వ్యవస్థీకరణ కేవలం సౌలభ్యం కోసం మాత్రమే కాకుండా.. భవిష్యత్తులో జీహెచ్ఎంసీని మూడు స్వతంత్ర మహానగరపాలక సంస్థలుగా విభజించాలనే ప్రభుత్వ దీర్ఘకాలిక వ్యూహానికి పునాదిగా కనిపిస్తోంది.ప్రభుత్వ ప్రాథమిక ఆలోచన ప్రకారం.. మూసీ నదిని సరిహద్దుగా తీసుకుని నగర విభజన జరగనుంది. మూసీకి దక్షిణాన ఉన్న ప్రాంతాలన్నింటినీ కలిపి ఒక కార్పొరేషన్గా దీనికి 'జీహెచ్ఎంసీ' పేరునే కొనసాగించే అవకాశం ఉంది. ఉత్తరాన ఉన్న ప్రాంతాలను సికింద్రాబాద్, సైబరాబాద్ పేరుతో మరో రెండు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసే దిశగా కసరత్తు సాగుతోంది. ఈ చారిత్రాత్మక మార్పు ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయించడం, ట్రాఫిక్, వ్యర్థాల నిర్వహణ వంటి సమస్యలను స్థానికంగానే పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. ఈ పునర్ వ్యవస్థీకరణ పూర్తయితే.. హైదరాబాద్ మహానగరం పాలనాపరంగా సరికొత్త రూపురేఖలను సంతరించుకోనుంది.

# జగన్ ఫ్యామిలీతో మేనల్లుడు

**కడప, డిసెంబర్ 25, పెన్ పవర్:** వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి క్రిస్మస్ ప్రత్యేకం. దశాబ్దాలుగా ఆ కుటుంబం క్రిస్టియానిటీని అనుసరిస్తూ వస్తోంది. అయితే ఎంత దూరంలో ఉన్న క్రిస్మస్ పర్వదినాల నాడు పులివెందుల రావడం ఆనవాయితీగా ఉంది. రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఇది కాస్త ఎక్కువైంది. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో కుటుంబమంతా ఒకచోట కలిసి క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటూ వస్తోంది. 2019 ఎన్నికల వరకు అంతా కలిసి ఉంది ఆ కుటుంబం. కానీ తదనంతర పరిణామాలతోనే ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు మారిపోయారు. వివేకానంద రెడ్డి హత్య కేసు, ఆపై సోదరుడితో షర్మిల విభేదించడం వంటి కారణాలతో ఆ కుటుంబంలో చీలిక స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు రాజకీయంగా జగన్మోహన్ రెడ్డితో షర్మిల విభేదించడంతో ఆ రెండు కుటుంబాలు కలిసే అవకాశం లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో ఇటీవల జగన్మోహన్ రెడ్డి జన్మదినం నాడు శుభాకాంక్షలు తెలిపారు షర్మిల. థాంక్యూ షర్మిలమ్మ అంటూ జగన్మోహన్ రెడ్డి సైతం స్పందించారు.ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి పులివెందుల పర్యటనలో ఉన్నారు. అక్కడే క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. ఈ క్రమంలో ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. కుటుంబమంతా ఒకే ఫ్రేమ్ లోకి వచ్చింది. జగన్మోహన్ రెడ్డి, భార్య భారతి, తల్లి విజయమ్మ తో పాటు ఇతర కుటుంబ సభ్యులంతా ఒకే చోట క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నట్లు తెలుస్తోంది. కానీ జగన్ సోదరి షర్మిల మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. రెండు రోజుల కిందట సోదరుడికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన సమయంలో వారి మధ్య గొడవలు సద్దుమణిగాయని అంత భావించారు. కానీ ఇంతలోనే ఆ కుటుంబం అంతా ఒకచోట చేరింది. షర్మిల కనిపించలేదు కానీ.. ఆమె కుమారుడు మాత్రం భారతీ రెడ్డి పక్కనే కూర్చుంటూ ఫోటోకు ఫోజులిచ్చారు. దీంతో తెరవెనుక ఏదో జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి.జగన్మోహన్ రెడ్డితో షర్మిల ను కలిపేందుకు కుటుంబ పెద్దలతో పాటు శ్రేయోభిలాషులు రంగంలోకి దిగినట్లు ప్రచారం నడుస్తోంది. అదే సమయంలో షర్మిల కుమారుడు కుటుంబంతో ఫోటోలకు దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొద్ది రోజుల కిందట షర్మిల కుమారుడు వివాహ వేడుకలు జరిగాయి. అయితే ఆ వేడుకలకు జగన్ హాజరు కాలేదు. అంతకుముందు నిశ్చితార్థ వేడుకలకు మాత్రం జగన్ దంపతులు హాజరయ్యారు. మేనల్లుడికి శుభాకాంక్షలు తెలిపారు. అప్పట్లో కూడా జగన్మోహన్ రెడ్డితో ఫోటోలు దిగేందుకు షర్మిల అయిష్టత చూపినట్లు సోషల్ మీడియాలో ప్రచారం నడిచింది. అయితే ఈ మధ్యన ఇద్దరికీ పొలిటికల్ డ్యామేజ్ జరగడంతో సంధి కుదిర్చినట్లు ప్రచారం నడిచింది. ఇటువంటి సమయంలోనే జగన్ ఫ్యామిలీతో షర్మిల కుమారుడు కనిపించడం కొత్త చర్చకు దారితీస్తోంది. మున్ముందు ఆ కుటుంబ పరిణామాలు మారే అవకాశం ఉంది.

మరో వైపు గతంలో కూడా అనేక రాజకీయ కుటుంబాల్లో ఇలాంటి పరిస్థితులు కనిపించాయి. కానీ జగన్షర్మిల వ్యవహారం మాత్రం సాధారణ రాజకీయ విభేదాలను దాటి వ్యక్తిగత స్థాయికి వెళ్లిందనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. అందుకే ఈ అంశం ఎప్పటికప్పుడు చర్చకు వస్తూనే ఉంది. రెండు మూడు సంవత్సరాలుగా ఈ ఇద్దరి మధ్య ఉన్న దూరం అసలైన వైఎస్సార్ అభిమానులను బాధపెడుతోంది. తప్పు ఎవరిది, కారణం ఏమిటి అన్నది వేరే విషయం అయినా, ఒకప్పుడు కలిసి రాజకీయంగా ప్రయాణించిన అన్నా చెల్లెళ్లు ఇలా విడివిడిగా ఉండటం వారికి నచ్చడం లేదు. ఎప్పటికైనా ఈ కుటుంబం మళ్లీ ఒక్కటవ్వాలని, పరస్పర విభేదాలు పక్కన పెట్టాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు.సాధారణంగా "నీటి కంటే రక్తం చిక్కన" అనే మాట రాజకీయాల్లో కూడా చాలాసార్లు నిజమైంది. గతంలో తీవ్రంగా విభేదించిన రాజకీయ నేతలు, కుటుంబ సభ్యులు కాలక్రమంలో మళ్లీ కలిసిన సందర్భాలు ఉన్నాయి. ఆ కోణంలో చూస్తే జగన్, షర్మిల కూడా భవిష్యత్తులో కలిసే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అది ఎప్పుడు జరుగుతుందన్నది మాత్రం ఎవరూ స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. ఇద్దరూ తమ తమ అభిప్రాయాల్లో గట్టి పట్టుదలతో ఉండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఇటీవల ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో కడప జిల్లాకు చెందిన వైసీపీ కీలక నేత, మాజీ ఎమ్మెల్సీ సతీష్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన మాట్లాడుతూ జగన్కు తన చెల్లెలంటే ప్రత్యేక అభిమానం ఉందని, కుటుంబాన్ని ఎప్పుడూ గొప్పగా భావించే వ్యక్తి అని తెలిపారు. తాను జగన్ను దగ్గరగా చూశానని, ఆయన ఎప్పుడూ కావాలని తప్పులు చేసే మనిషి కాదని అన్నారు. తన అనుభవం ప్రకారం జగన్ ఇతరులకు మేలు చేయాలనే ఆలోచనతోనే పనిచేస్తారని వ్యాఖ్యానించారు. అందుకే అన్నా చెల్లెళ్లు మళ్లీ కలిసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా షర్మిల ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగాబాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆమె ప్రధానంగా అధికార కూటమిపైనే విమర్శలు చేస్తూ వస్తున్నారు. జగన్ గురించి కానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి కానీ ఆమె బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం లేదు. ఒక రాజకీయ పార్టీ నేతగా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని విమర్శించడం సహజమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గతంలో వైసీపీపై తీవ్ర విమర్శలు చేసిన షర్మిల ఇప్పుడు వైఖరిలో మార్పు చూపుతున్నారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, జగన్షర్మిల మళ్లీ కలవాలని కోరుకునే భావన రాజకీయాల్లోనూ, ప్రజల్లోనూ ఉంది. అలాంటి పరిణామం జరిగితే అది సానుకూల మార్పుగా భావిస్తారు. ఇది సాధ్యమవుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. కానీ ఈ అంశం చర్చలో ఉండటం మాత్రం ఆ కుటుంబంపై ఉన్న అభిమానం ఎంత బలంగా ఉందో చెప్పే సంకేతంగా కనిపిస్తోంది.

# రేవంత్ స్కెచ్ లో కేసీఆర్.. అసెంబ్లీకి వస్తారా

**హైదరాబాద్, డిసెంబర్ 25, ( పెన్ పవర్:** కృష్ణా జలాల విషయంలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన ఆరోపణలపై క్విక్గా రియాక్ట్ అయ్యారు సీఎ రేవంత్ రెడ్డి. వెంటనే చిట్ చాట్ పేరుతో అన్ని అంశాలపై మాట్లాడిన సీఎం రేవంత్..ఏకంగా కొడంగల్ వేదికగా గులాబీ బాస్కు బిగ్ సవాల్ చేశారు. ఈ నెల 29 నుంచి అసెంబ్లీ స్టార్ట్ అవుతుంది. నీళ్లా..నిధులా..నియమకాలా, సంక్షేమ పథకాలా..ఆప్షన్ మీదే..ఏ అంశామైనా చర్చించేందుకు రెడీ అంటూ ఓపెన్ స్టేట్మెంట్ ఇచ్చారు. ముఖాముఖి తేల్చుకుందాం రమ్మంటూ సవాల్ చేస్తున్నారు. అయితే అన్ని అంశాల కంటే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రేవంత్ ప్రధాన అస్త్రంగా వాడుకునే అవకాశం ఉందట. అసెంబ్లీ వేదికగా ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని చర్చకు పెట్టి..బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా కార్నర్ చేయాలనేది రేవంత్ వ్యూహమంటున్నారు. సేమ్టైమ్ కేసీఆర్ సభకు వస్తే..కృష్ణా జలాల ఎపిసోడ్కు కూడా అక్కడే ఫుల్ స్టాప్ పెట్టాలనేది రేవంత్ స్కెచ్అట. సభలు పెట్టి కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లే కంటే ముందే అసెంబ్లీకి రావాలంటూ సవాల్ చేస్తూ రేవంత్ కొత్త ఎత్తుగడ వేశారన్న చర్చ జరుగుతోంది. ఞాశ్రీంశీ =ముఃః: నేను హీరోయిన్నే.. మీది చేతగానితనం.. నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే..: శివాజీపై అనసూయ మళ్లీ ఫైర్. కృష్ణాజలాల అంశంతో పొలిటికల్గా యాక్టీవ్ కావాలని కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారు. అందుకే నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్నగర్లో సభలకు రెడీ అవుతున్నారు. ఈ మీటింగ్లకు తాను స్వయంగా హాజరవుతానని..ఇక నుంచి ఐయామ్ ఆన్ ది ఫీల్ అంటూ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని తనం వల్లే తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నీటి వాటా దక్కడం లేదన్న వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నారు. అయితే ఇంతలోపే అసెంబ్లీ సమావేశాలు పెట్టి..కేసీఆర్ సభకు రమ్మని సవాల్ చేస్తున్నారు రేవంత్. కేసీఆర్ అసెంబ్లీకి వెళ్తారా? లేదా? అసలు తెలంగాణకు నీటి వివాదాలు రావడానికి కేసీఆరే కారణమంటున్న రేవంత్..పార్టీ ఆఫీసుల్లో కూర్చొని





మాట్లాడటం కాదు..దమ్ముంటే అసెంబ్లీకి రావాలంటూ ఛాలెంజ్ విసురుతున్నారు. అయితే కేసీఆర్ అసెంబ్లీకి వెళ్తారా లేదా అన్నది డౌటే. ఎందుకంటే ఆయన ప్రతిపక్షంలోకి వచ్చినప్పటి నుంచి ఏ చర్చలో పాల్గొన్న సందర్భాలు లేవు. తెలంగాణ భవన్లో లేకపోతే ఫాంహౌస్లో నేతలను ఉద్దేశించి మాట్లాడటమో..ప్రెస్మీట్ పెట్టడమో తప్ప..అసెంబ్లీ వేదికగా అపోజిషన్ లీడర్గా ఏ అంశాన్ని ప్రస్తావించలేదు కేసీఆర్. ఇదే అస్త్రంగా మల్చుకుని కేసీఆర్ను సభకు రప్పించేందుకు మరోసారి గేమ్ స్టార్ట్ చేశారు సీఎం రేవంత్రెడ్డి. ముఖ్యమంత్రి ముందు నుంచి పదే పదే ప్రస్తావిస్తున్న అంశం ఒకే ఒక్కటి. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని. ఎన్ని సార్లు సవాల్ చేసినా..రేవంత్ మాటలను కేసీఆర్ పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించలేదు. కేటీఆర్, హరీశ్తోనే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ప్రశ్నలకు సమాధానం చెప్పించారు కేసీఆర్. అయితే రేవంత్ మొత్తం కేసీఆర్ లేవనెత్తిన కృష్ణా జలాల అంశంలో ఆయన చేతనే చేత సమాధానం చెప్పించాలనే ఎత్తుగడ వేస్తున్నట్లు టాక్. అసెంబ్లీ వేదికగా రేవంత్ వర్సెస్ కేసీఆర్ అన్నట్లుగా చర్చ జరగాలనేది సీఎం స్కెచ్ అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే టాపిక్ ఏదైనా చర్చకు రెడీ అంటూ రేవంత్ సవాల్ విసురుతున్నారని అంటున్నారు. అల్టిమేట్గా కేసీఆర్ను సభకు రప్పించాలన్నది రేవంత్ మైండ్ గేమ్ అన్న ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ రేవంత్ సవాల్ను స్వీకరించి కేసీఆర్ సభకు వస్తే..ముందు ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని చర్చకు పెట్టే ప్లాన్ చేస్తున్నారట. కృష్ణావాటర్ విషయంలో కేసీఆర్ కేంద్రం దగ్గర ఒప్పుకున్న అంశాలను ఎక్స్పోజ్ చేస్తూ..తెలంగాణకు నీటి వాటాలు దక్కకుండా చేశారని వివరించాలని అనుకుంటున్నారట. మరి రేవంత్ సవాల్ను స్వీకరించి కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా లేక ఎప్పటిలాగే లైట్ తీసుకుంటారా అనేది వేచి చూడాలి.

# పొలిటికల్ థ్రిల్లర్ గా దానం నాగేందర్ సీరియల్

**హైదరాబాద్, డిసెంబర్ 25, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకుంది. ముఖ్యంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారం ఒక పొలిటికల్ థ్రిల్లర్ను తలపిస్తోంది. సాంకేతిక అంశాల సాకుతో కొందరు ఎమ్మెల్యేలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నా, దానం నాగేందర్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఆయన తీసుకున్న నిర్ణయం, ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఐదుగురు ఎమ్మెల్యేల విషయంలో ఇచ్చిన రూలింగ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వారు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినప్పటికీ, మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇందులో అందరి దృష్టి దానం నాగేందర్పైనే ఉంది. ఎందుకంటే ఆయన కేవలం పార్టీ కండువా కప్పుకోవడమే కాదు, ఏకంగా కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత వేటుకు తిరుగులేని సాక్ష్యం.బిఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేశారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా ఉండి, మరో పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేయడం అనేది ఫిరాయింపుల నిరోధక చట్టం కింద నేరుగా అనర్హతకు దారితీస్తుంది. స్పీకర్ నుంచి నోటీసులు అందినప్పటికీ దానం ఇప్పటివరకు వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.అయితే, తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. "నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్-ఎంఐఎం కలిసి 300 డివిజన్లలో గెలుస్తాయి" అని ఆయన ప్రకటించడం ద్వారా తన రాజకీయ గమ్యంపై స్పష్టత



ఇచ్చేశారు. అంటే స్పీకర్ తనపై నిర్ణయం తీసుకునే వరకు వేచి చూడకుండా, తానే ఒక అడుగు ముందుకేయాలని దానం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.దానం నాగేందర్ ఇప్పుడు రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ అనర్హత వేటు వేస్తే, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అలా కాకుండా, ముందే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే.. ప్రజల్లోకి నైతికతతో వెళ్ళినట్లు ఉంటుంది. ఉప ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేసేందుకు అర్హత లభిస్తుంది. కోర్టు కేసులు, అనర్హత వేటు ముప్పు నుంచి శాశ్వతంగా బయటపడవచ్చు.దానం నాగేందర్ కేవలం ఖైరతాబాద్కే పరిమితం కాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా తన పట్టు నిలుపుకోవాలని చూస్తున్నారు. 300 డివిజన్లలో ప్రచారం చేస్తానని ప్రకటించడం ద్వారా, తాను కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదగాలని కోరుకుంటున్నట్లు అర్థమవుతోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ను అధికారంలోకి తీసుకురావడం ద్వారా తన ప్రాధాన్యతను నిరూపించుకోవాలని ఆయన ప్లాన్. ఒకవేళ దానం నాగేందర్ రాజీనామా చేసి ఖైరతాబాద్లో ఉప ఎన్నిక వస్తే, అది తెలంగాణ రాజకీయాల్లో ఒక టర్నింగ్ పాయింట్ అవుతుంది. అధికార కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకోవడానికి ఇది ఒక పరీక్ష.దానం నాగేందర్ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఎమ్మెల్యే అనర్హతకు సంబంధించిన అంశం కాదు. ఇది తెలంగాణలో రాబోయే రాజకీయ సమీకరణాలకు దిక్సూచి. స్పీకర్ నిర్ణయం కంటే ముందే ఆయన రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి దిగితే, అది రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనమే అవుతుంది. దానం తీసుకునే ఈ బోల్డ్ స్టెప్ సక్సెస్ అయితే, మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా అది ఒక మార్గదర్శకంగా మారే అవకాశం ఉంది.

# పాతపట్నం వైసీపీలో రగడ..రగడ

**శ్రీకాకుళం, డిసెంబర్ 25, పెన్ పవర్:**
ఉత్తరాంధ్రాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొన్ని నియోజకవర్గాలు కంచుకోటలుగా పేరున్నాయి. కానీ 2024 ఎన్నికలు ఆ అంచనాలను పూర్తిగా తలకిందులు చేశాయి. మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉన్న ఉత్తరాంధ్రలో వైసీపీకి కేవలం రెండు సీట్లు మాత్రమే దక్కాయి. అవి కూడా ఏజెన్సీ ప్రాంతాలకు పరిమితమయ్యాయి. దీంతో మైదాన ప్రాంతాల్లో, ముఖ్యంగా కీలక జిల్లాల్లో ఆ పార్టీ ఉనికి దాదాపుగా కనుమరుగైంది. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం నియోజకవర్గం పరిస్థితి ఇప్పుడు ప్రత్యేక చర్చకు వచ్చింది.పాతపట్నం వైసీపీకి ఒకప్పుడు బలమైన సీటుగా ఉండేది. 2014, 2019 ఎన్నికల్లో అక్కడ వరుసగా పార్టీ విజయం సాధించింది. 2024లో ఓటమి ఎదురైనా ఓట్ల శాతం మాత్రం గణనీయంగా వచ్చింది. దానికి ప్రధాన కారణంగా దివంగత మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం కుటుంబానికి ఉన్న బలమైన పట్టు అని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఎన్నికల తర్వాత ఈ నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి ఎలా ఉంది అన్నది ఆసక్తికరంగా మారింది.వైసీపీలో అంతర్గత వర్గపోరు పాతపట్నంలో పెద్ద సమస్యగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లలేకపోయారని, 2019 నుంచి 2024 మధ్య కాలంలో పలుమార్లు ఈ విషయాన్ని పార్టీ అధినాయకత్వానికి తెలియజేశారని అంటున్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని, చివరకు అదే ఎన్నికల ఫలితంపై ప్రభావం చూపిందని విశ్లేషిస్తున్నారు. హీరమండలం నుంచి ఆమె కుమారుడు జెడ్పీటీసీగా పోటీ చేసినప్పుడు కూడా వర్గపోరే ఓటమికి కారణమైందన్న అభిప్రాయం ఉంది. ఈ పరిణామాలతో నియోజకవర్గ రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి.అదే సమయంలో 2024లో తెలుగుదేశం పార్టీ అక్కడ భారీ విజయం సాధించింది. దాదాపు పదిహేనేళ్ల తర్వాత వచ్చిన ఈ గెలుపు ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని



నింపింది. కూటమి పార్టీలన్నీ ఐక్యంగా పనిచేయడం, కొత్త అభ్యర్థిగా స్థానికంగా ప్రభావం ఉన్న మామిడి గోవిందరావు ను ముందుకు తీసుకురావడం
కలిసి వచ్చాయి. గతంలో టీడీపీకి కీలకంగా ఉన్న కలమట కుటుంబాన్ని పక్కన పెట్టినా ఫలితం మాత్రం అనుకూలంగా మారింది. ప్రస్తుతం గోవిందరావు ఎమ్మెల్యేగా తన పట్టును బలపరుచుకుంటూ ప్రజల్లో చురుగ్గా తిరుగుతున్నారుఇక ఆయన ప్రారంభించిన ఆపరేషన్ ఆకర్ష్ రాజకీయంగా వైసీపీకి పెద్ద దెబ్బగా మారింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు సమయంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజాప్రతినిధులు టీడీపీలో చేరడం సంచలనం సృష్టించింది. మరోవైపు జనసేన పార్టీ కూడా ఈ సీటుపై ఆశలు వదులుకోవడం లేదు. వచ్చే ఎన్నికల్లో పాతపట్నాన్ని కోరాలని చూస్తూ ఒక మహిళా నాయకురాలు గట్టిగా కదులుతున్నారు. ఆమె భర్తకు నామినేటెడ్ పదవి రావడంతో, ఆయన ప్రభావంతో కొంతమంది వైసీపీ నేతలు జనసేన వైపు మొగ్గు చూపుతున్నారని

ప్రచారం సాగుతోందిఈ రెండు వైపుల నుంచి ఎదురవుతున్న ఒత్తిడితో వైసీపీ ఎలా నిలబడుతుందన్నది ప్రశ్నగా మారింది. ఈ నేపథ్యంలో పార్టీ అధినాయకత్వం రెడ్డి శాంతిని పిలిపించి నియోజకవర్గాన్ని బలోపేతం చేయాలని సూచించినట్టు సమాచారం. పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్న హైకమాండ్ రానున్న ఎన్నికల నాటికి ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తిగా మారింది. మొత్తానికి పాతపట్నం రాజకీయాలు ఇప్పుడు కొత్త మలుపు తిరుగుతున్నాయనే మాట వినిపిస్తోంది.

# పవన్ మార్క్ పాలిట్రిక్స్...

**కాకినాడ, డిసెంబర్ 25, పెన్ పవర్:**
జనసేనఅధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల మళ్లీ రాజకీయంగా పెద్ద శబ్దమే చేస్తున్నారు. గోదావరి జిల్లాల ప్రాంతంలో నిర్వహించిన సభలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిడదవోలు నియోజకవర్గంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడిన మాటలు ఏపీ రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా చర్చకు దారితీశాయి. ప్రత్యర్థులపై తీవ్రమైన పదజాలంతో మాట్లాడిన పవన్, తన ఆవేశాన్ని వేదిక మీదే స్పష్టంగా చూపించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో, అధికారుల సమక్షంలోనూ ఆయన ఘాటైన భాషను ఉపయోగించడం చాలామందిని ఆశ్చర్యానికి గురిచేసింది.అక్కడితో ఆగకుండా మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మరోసారి ఆయన అదే తీరులో స్పందించారు. వైసీపీకి భవిష్యత్తులో అధికారం దక్కకుండా చేస్తామని, ఆ పార్టీని రాజకీయ పార్టీగా కూడా గుర్తించబోమని ప్రకటించారు. తప్పులు చేసిన వారిపై చర్యలు తప్పవని, చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ వ్యాఖ్యలు ప్రజల్లోకి వెళ్లిన విధానం వేరుగా ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఎందుకంటే పవన్ ప్రస్తుతం అధికారంలో ఉన్న కీలక నాయకుడు. ప్రజలు ఇచ్చిన అధికారంతో చట్ట ప్రకారం చర్యలు తీసుకునే స్థితిలో ఉన్నారని, అలా ఉండి కూడా హెచ్చరికల స్థాయిలో మాట్లాడటం ఎందుకన్న ప్రశ్నలు మొదలయ్యాయి.సాధారణంగా విపక్షంలో ఉన్న పార్టీలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాయి, విమర్శలు చేస్తాయి. అది రాజకీయంగా సహజమే. ప్రస్తుతం ఆ స్థానంలో వైసీపీ ఉంది. వారు ప్రభుత్వం తప్పు చేసినా చేయకపోయినా ప్రశ్నలు లేవనెత్తుతారు. అప్పుడు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అవుతుంది. ప్రజల దృష్టి ఎప్పుడూ పాలకులపైనే ఉంటుందన్న విషయం నాయకులు గుర్తుంచుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్నవారు ఆవేశం చూపిస్తే, అదే ప్రజల్లో చర్చగా మారుతుంది. సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుందని పలువురు చెబుతున్నారు.అయితే పవన్ ఈ రీతిలో మాట్లాడటానికి వెనుక వ్యూహం ఉందని కొందరు విశ్లేషకులు అంటున్నారు. గత కొంతకాలంగా పార్టీ క్యాడర్‌పై ఆయన దృష్టి తక్కువగా ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం వారిని ఉత్సాహపరిచేందుకు ఈ తరహా మాటలు



ఉపయోగిస్తున్నారని అంచనా వేస్తున్నారు. క్యాడర్‌కు సందేశం ఇవ్వాలంటే పార్టీ సమావేశాల్లో మాట్లాడటం సరైనదని, ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం భాష హుందాగా ఉండాలని అభిప్రాయం వినిపిస్తోంది. ఇదే సమయంలో గతాన్ని గుర్తు చేసే వారు కూడా ఉన్నారు. 2019 ఎన్నికల సమయంలో అధికారంలోకి రానివ్వనని చెప్పినా పరిస్థితి భిన్నంగా మారిందని వారు గుర్తు చేస్తున్నారు. అందుకే రాజకీయంగా శపథాలు, సవాళ్లకన్నా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పనులు చేయడం నాయకులకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. పవన్ నుంచి ప్రజలు కూడా అదే ఆశిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

**పవన్ మార్క్**

పరిపాలనలో ఫలితాలు సాధించడమే కాకుండా, రాజకీయ వ్యూహాలలోనూ పవన్ కళ్యాణ్ తనదైన శైలిని చూపించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడడంలో ఆయన పాత్ర అత్యంత కీలకమైంది. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ , భారతీయ జనతా పార్టీ ( మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, మూడు పార్టీల కలయిక అవసరమని ముందుగానే స్పష్టంగా చెప్పారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనకు ముగింపు పలకాలంటే ఐక్యతే మార్గమని ఆయన రాజకీయంగా ధైర్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. చంద్రబాబు నాయుడు గారి అరెస్టు సమయంలో బహిరంగంగా సంఘీభావం ప్రకటించి, రాజకీయంగా స్పష్టమైన వైఖరిని వెల్లడించడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. అదే సమయంలో బీజేపీని కూటమిలోకి తీసుకురావడంలో, టీడీపీని ఎన్డీఏలో భాగం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఫలితంగా రాష్ట్రంలో కూటమి విజయం సాధించగా, జాతీయస్థాయిలో నరేంద్ర మోడీ గారి మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడంలో కూడా ఆంధ్రప్రదేశ్ పాత్ర ఉందనే అభిప్రాయం బలపడింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం హోదాతో పాటు కీలక శాఖలు దక్కాయి. గ్రామీణ నేపథ్యం ఉన్న శాఖలే తనకు కావాలన్న ఆయన కోరిక మేరకు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల బాధ్యతలు ఆయనకు అప్పగించారు. ఈ శాఖలలో ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర నిధులను సమర్థంగా వినియోగిస్తూ, గ్రామాల అభివృద్ధికి స్పష్టమైన దిశను నిర్ణయించారు. “పల్లె పండుగ” వంటి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, పచ్చదనం వంటి మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. గత రెండు సంవత్సరాలుగా జరిగిన ఈ అభివృద్ధి పనుల ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయ స్థాయిలో నెంబర్ వన్ గా నిలిచింది.ఈ విజయం పూర్తిగా పవన్ కళ్యాణ్ గారి పనితనం, నిర్ణయశక్తి, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత వల్లే సాధ్యమైందని చెప్పవచ్చు. రాజకీయాల్లో మాటలకే పరిమితం కాకుండా, పనితో ఫలితాలు చూపిస్తున్న నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఇప్పుడు రాష్ట్రానికే కాదు, దేశానికీ గుర్తింపుగా మారుతున్నారు.

# పీవీ సునీల్ కుమార్ పై వేటు...

**గుంటూరు, డిసెంబర్ 25, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. ఈ పోరు కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవగా కాకుండా.. చట్టం, సర్వీస్ నిబంధనలు, రాజకీయ వ్యవస్థల మధ్య ఘర్షణగా మారుతోంది. గత కొన్నాళ్లుగా వీరి మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం, సీబీఐ ఎఫ్ఐఆర్ నేపథ్యంలో తారాస్థాయికి చేరింది.బ్యాంకుల కన్సార్టియంను మోసం చేశారనే ఆరోపణలపై రఘురామ కృష్ణరాజుపై సీబీఐ తాజాగా కేసు నమోదు చేయడం ఈ వివాదాన్ని మలుపు తిప్పింది. దీనిని అస్త్రంగా చేసుకున్న పీవీ సునీల్ కుమార్, సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలకు దిగారు. ఒక రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై ఆర్థిక నేరారోపణలు రావడం నైతికంగా తప్పని, ఆయన తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. ఒక అడుగు ముందుకు వేసి, రఘురామకు యావజ్జీవ శిక్ష తప్పదని, అవసరమైతే తాను కూడా ఆ కేసులో ఇంప్లీడ్ అవుతానని వీడియో సందేశం విడుదల చేయడం సంచలనం రేకెత్తించింది.ఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న.. “సస్పెన్షన్‌లో ఉన్న ఒక ఐపీఎస్ అధికారి రాజకీయ విమర్శలు చేయవచ్చా?” అనేది. 1968 ప్రకారం, సర్వీసులో ఉన్న అధికారి సస్పెన్షన్‌లో ఉన్నా సరే ప్రభుత్వంపై గానీ, రాజకీయ నేతలపై గానీ బహిరంగంగా విమర్శలు చేయకూడదు. నియమం 7 ప్రకారం ఏ అధికారి కూడా ప్రభుత్వం లేదా వ్యవస్థల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రకటనలు చేయకూడదు. సివిల్ సర్వెంట్స్ రాజకీయాలకు అతీతంగా ఉండాలి. కానీ, సునీల్ కుమార్ నేరుగా డిప్యూటీ స్పీకర్‌ను ఉద్దేశించి జైలుకు వెళ్లడం ఖాయం, యావజ్జీవ కారాగార శిక్ష పడుతుంది.. అని వ్యాఖ్యానించడం సర్వీస్ రూల్స్‌ను ఉల్లంఘించడమేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.తనపై వ్యక్తిగత దాడికి దిగడమే కాకుండా, న్యాయస్థానంలో ఉన్న కేసులను ప్రభావితం చేసేలా సునీల్ కుమార్ మాట్లాడుతున్నారని రఘురామ కృష్ణరాజు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు ఫిర్యాదు చేశారు. సునీల్ కుమార్‌ను కేవలం సస్పెన్షన్‌తో వదిలేయకుండా, సర్వీస్ నుంచి పూర్తిగా డిస్మిస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక ఐపీఎస్ అధికారి ఇలా వీధి రౌడీలా మాట్లాడటం వ్యవస్థలకే ప్రమాదకరమని ఆ లేఖలో పేర్కొన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకునే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు ప్రభుత్వం కొన్ని రూల్స్ ఫాలో అవుతుంది. మొదట నిబంధనల ఉల్లంఘనపై షోకాజ్ నోటీస్ ఇచ్చి వివరణ కోరుతుంది. ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న సునీల్ కుమార్‌పై కొత్త అభియోగాలతో సస్పెన్షన్ కాలాన్ని పొడిగించే అవకాశం ఉంటుంది. ఐపీఎస్ అధికారులు కేంద్ర హోంశాఖ పరిధిలోకి వస్తారు కాబట్టి, విచారణ నివేదికను ఢిల్లీకి పంపడం. ఒకవేళ నేరం రుజువైతే ఆయన సర్వీస్ నుంచి తొలగించబడే ప్రమాదం ఉంది.రఘురామ కృష్ణరాజుపై ఉన్న సీబీఐ కేసు చట్టపరంగా నడుస్తుంది. కానీ, ఒక ఐపీఎస్ అధికారి ఆ తీర్పును ముందే ప్రకటించడం, రాజకీయ విమర్శలు చేయడం ఖచ్చితంగా చర్చనీయాంశమే. ఈ పరిణామాలు పీవీ సునీల్ కుమార్ కెరీర్‌ను ఇబ్బందుల్లోకి నెట్టేలా కనిపిస్తున్నాయి. డీజీపీ తీసుకోబోయే నిర్ణయం భవిష్యత్తులో

# రంగా నాడుకు సిద్ధం..

**విశాఖపట్టణం, డిసెంబర్ 25, పెన్ పవర్:** సుమారు నాలుగు దశాబ్దాల క్రితం కాపు సమాజంలో రాజకీయ చైతన్యానికి నాంది పలికిన ఒక చారిత్రక ఘట్టం జరిగింది. కాపునాడు పేరుతో తొలి భారీ సభను వంగవీటి మోహన రంగారావు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు. కాపు సామాజిక వర్గానికి రాజకీయంగా గుర్తింపు, గౌరవం కావాలన్న ఆకాంక్షకు ఆ సభ ప్రతీకగా నిలిచింది. ఆ ఒక్క సభతోనే రంగా పేరు రాష్ట్ర రాజకీయాల్లో మార్మోగింది. విజయవాడ పరిధిలోనే పరిమితమయ్యే నేతగా కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక కేంద్రంగా ఆయన ఎదిగారు.రంగా రాజకీయ ప్రస్థానం సామాజిక ఉద్యమాలతో ముడిపడి సాగింది. పేదలు, బడుగు వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రజల్లో ఆయనకు ప్రత్యేక స్థానం తెచ్చిపెట్టాయి. అయితే 1988 డిసెంబర్ 26న విజయవాడలోనే ఆయన హత్యకు గురికావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ఆ తర్వాత కూడా కాపునాడు వేదికపై అనేక మంది నాయకులు ముందుకు వచ్చి, సమాజంలో చైతన్యం కొనసాగించే ప్రయత్నాలు చేశారు.ఇప్పుడు అదే స్ఫూర్తితో విశాఖపట్నం వేదికగా ‘రంగా నాడు’ పేరిట ఒక భారీ సభ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రంగా వర్ధంతి సందర్భంగా జరిగే ఈ కార్యక్రమాన్ని ఆయన అభిమానులు, అనుచరులు కలిసి నిర్వహిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రముఖులను ఆహ్వానిస్తూ, విశాఖ బీచ్ వద్ద లక్ష మందికిపైగా ప్రజలతో సభ నిర్వహించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఈ ప్రకటనతోనే విశాఖ జిల్లా తో పాటు కోస్తా ప్రాంతం అంతటా ఆసక్తి నెలకొంది.ఈ సభలో ఏ అంశాలు ప్రస్తావిస్తారు, ఎలాంటి తీర్మానాలు తీసుకుంటారు అన్నదానిపై ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. రంగా తన జీవితమంతా సామాజిక న్యాయం కోసం అంకితం చేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అభిమానులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం జూలై 4న ఆయన జయంతి రోజున, అలాగే డిసెంబర్ 26న వర్ధంతి రోజున విగ్రహావిష్కరణలు, నివాళి కార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయంగా మారింది. కానీ ఈసారి విశాఖలో లక్షలాది మందితో సభ నిర్వహించాలనే ఆలోచన రాజకీయంగా, సామాజికంగా కూడా ఉత్కంఠను పెంచుతోంది.సాగర ఘోషలా సాగే ఈ రంగా నాడు సభ ఎటువంటి రాజకీయ ప్రకంపనలకు దారితీస్తుందా అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో కాపులు అతి పెద్ద సామాజిక వర్గంగా ఉన్నారు. రాజ్యాధికారం తమకు దక్కాలన్న కోరిక దశాబ్దాలుగా నెరవేరకపోవడం వల్ల కొంత అసంతృప్తి ఉంది. అదే సమయంలో రంగా వంటి నేతల ఆశయాలను యువతకు చేరవేయాలన్న బాధ్యత కూడా ఉందనే భావన కనిపిస్తోంది. మరి విశాఖ వేదికగా జరిగే ఈ సభ ఎలాంటి సందేశాన్ని ఇస్తుందో, ఏ దిశగా చర్చను మళ్లిస్తుందో అన్నది చూడాల్సిందే. అయితే ప్రస్తుతం మాత్రం రంగా నాడుపై అందరి చూపూ కేంద్రీకృతమై ఉందన్నది వాస్తవం.

# ఏపీలో 70 అన్న క్యాంటీన్లు

**విజయవాడ, డిసెంబర్ 25, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రజలకు శుభవార్త అందించింది. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు కాబోతున్నాయి. మొత్తం 70 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు. జనవరి 10లోగా నిర్మాణ పనులు పూర్తి చేసి.. జనవరి 13 నుంచి 15 మధ్య ఈ క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావాలని




భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు విజయవంతం అయ్యాయి.. ప్రజల నుంచి ఆదరణ వస్తోంది. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా మొత్తం 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. ప్రస్తుతం పట్టణాల్లో 205 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి.. వీటిలో రోజుకు మూడు పూటలా కలిపి 2 లక్షల మందికి పైగా ప్రజలు తక్కువ ధరకే భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. ఒక్కో పూటకు కేవలం రూ.5కే రుచికరమైన ఫుడ్ అందిస్తున్నారు. ఈ పథకం గ్రామీణ ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన 205 అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నారు. ఇప్పటివరకు 7.20 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ క్యాంటీన్లలో భోజనం చేశారు. ఇందులో మధ్యాహ్న భోజనం చేసిన వారి సంఖ్య 3.16 కోట్లు. ఉదయం అల్పాహారం 2.62 కోట్ల మంది, రాత్రి భోజనం 1.42 కోట్ల మంది తీసుకున్నారు. ఈ క్యాంటీన్లలో విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుండి అత్యధిక సంఖ్యలో పేదలు వస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ జిల్లాల్లోని క్యాంటీన్లలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. పేదల ఆకలి తీర్చడమే ఈ క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశ్యం. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా ఎంతో మందికి అండగా నిలుస్తున్నాయి. ఇప్పుడు గ్రామాల్లో కూడా అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు.జిల్లాల వారీగా చూస్తే.. చిత్తూరు 7, గుంటూరు 5, శ్రీకాకుళం జిల్లా 5, తూర్పుగోదావరి 4, ఏలూరు 4, ప్రకాశం 4, కర్నూలు 4, విజయనగరం 3, అనంతపూరాం 3, అల్లూరి సీతారామరాజు 3, అనకాపల్లి 3, బీఆర్ అంబేద్కర్ కోనసీమ 3, పశ్చిమ గోదావరి 3, కృష్ణా 3, నెల్లూరు 3, అన్నమయ్య 3, కాకినాడ 2, తిరుపతి 2, పార్వతీపురం మన్యం 1, పల్నాడు 1, ఎన్టీఆర్ 1, శ్రీసత్యసాయి 1, నంద్యాల 1, కడప 1 క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు

# ఫెద్దిరెడ్డికి బౌండరీస్...

**తిరుపతి, డిసెంబర్ 25, పెన్ పవర్:** అధికారంలో ఉన్నప్పుడు అన్నీ కలిసి వస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నేతల బలాలు తెలుస్తాయి. ఇప్పుడు సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిస్థితి అదే. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆయన రాయలసీమకు ముఖ్యమంత్రిగా వ్యవహరించేవారు. రాయలసీమ పరిధిలోని నాలుగు జిల్లాలు ఆయన కంట్రోల్లో ఉండేవి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సీనియర్ కావడం.. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డికి సన్నిహితుడు కావడంతో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు రామచంద్రారెడ్డి. చంద్రబాబుకు సమకాలీకుడు కావడంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తన చెంత ఉంచుకున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. 2014లో రాయలసీమలో వైసీపీ హవా నడిచింది. 2019లో క్లీన్ స్వీప్ చేసింది. అంతవరకు ఓకే కానీ.. 2024 ఎన్నికల్లో అదే రాయలసీమలో ఏడు స్థానాలకు పడిపోయింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. దీంతో అదంతా హవా తప్ప పెద్దిరెడ్డి లాంటి సీనియర్ల ప్రమేయం లేదన్న నిర్ధారణకు వస్తున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు.సొంత జిల్లా చిత్తూరులోపెద్దిరెడ్డి కంట్రోల్లో ఉండేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడ భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్కే రోజా లాంటి నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. పెద్దిరెడ్డి పెద్దరికాన్ని అయిష్టంగానే గౌరవించేవారు. దానికి కారణం జగన్మోహన్ రెడ్డితో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం. అయితే ఇప్పుడు మాత్రం సీన్ మారింది. ముఖ్యంగా నగిరి నియోజకవర్గ విషయంలో రోజా పట్టు బిగిస్తున్నారు. తన నియోజకవర్గంలో పెద్దిరెడ్డి మనుషుల పెత్తనాన్ని సహించుకోలేకపోయారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయేది. కానీ ఇప్పుడు మాత్రం పెద్దిరెడ్డి ప్రమేయాన్ని ఎంత మాత్రం సహించడం లేదు. పెద్దిరెడ్డి మనుషులను పార్టీ నుంచి బయటకు పంపుతారా? లేకుంటే తానే వెళ్లిపోమంటారా అంటూ రోజా గట్టిగానే హెచ్చరించినట్లు ప్రచారం నడుస్తోంది.ప్రస్తుతం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫుల్ సైలెన్స్ పాటిస్తున్నారు. భూమన కరుణాకర్ రెడ్డి తో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి జగన్ వద్ద ప్రాధాన్యత లభిస్తున్నట్లు సమాచారం. చెవిరెడ్డి అరెస్టు జరిగిన తర్వాత ఏ నేతకు లేనంత ప్రాధాన్యత ఆయనకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అసలు జైలుకెళ్లిన పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని జగన్ కలుసుకునేందుకు కూడా ఇష్టపడలేదట. కానీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి న్యాయ సహాయం అందిస్తున్నారట. ప్రస్తుతం భూమన కరుణాకర్ రెడ్డి సైతం చిత్తూరు జిల్లాలో యాక్టివ్ అయ్యారు. ఇప్పటివరకు ఒక లెక్క ఇకనుంచి ఒక లెక్క అన్నట్టు ఉంది వైసీపీ సీనియర్ల పరిస్థితి. పెద్దిరెడ్డి తమ నియోజకవర్గాల్లో వేలు పెట్టకూడదని చిత్తూరు వైసీపీ సీనియర్ నాయకుడు విజయానంద రెడ్డి సైతం తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పెద్దిరెడ్డి పెద్దరికం అమాంతం పడిపోయినట్టు కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఫిబ్రవరిలో ఎన్నికలు.. అవామీ లీగ్‌పై నిషేధం

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో అవామీ లీగ్ ఎన్నికల్లో పాల్గొనకుండా యూనిస్ ఖాన్ మధ్యంతర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు ఆ దేశ సమాచార ముఖ్య అధికారి షఫీకుల్ ఆలం పేర్కొన్నారు. అవామీ లీగ్ రాబోయే జాతీయ ఎన్నికలలో పోటీ చేయకుండా ఆ పార్టీపై నిషేధం విధించనట్టు తాత్కాలిక ప్రభుత్వ సలహా మండలి సమావేశం తరువాత జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో రాజకీయ అలజడి చేలరేగిన విషయం తెలిసిందే. విద్యార్థుల తీవ్రమైన నిరసనతో షేక్ హాసినా ప్రభుత్వం పడిపోయి దేశం విడిచి వెళ్లిపోయారు. ఆ తర్వాత యూనిస్ ఖాన్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం దేశపాలన పగ్గాలు చేపట్టింది. ఆ తర్వాత సజావుగా పాలన కొనసాగుతుండగా తీవ్రవాద విద్యార్థి నాయకుడు షరిప్ ఉస్మాన్ హాదీ హత్యతో మరోసారి ఆ దేశంలో ఉద్రికత్తలు తలెత్తాతాయి.

## కాలిఫోర్నియాను ముంచెత్తిన భారీ వరదలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రిస్మస్ పండగ వేళ కాలిఫోర్నియాను భారీ వరదలు ముంచెత్తాయి. తుఫాను కారణంగా కుండపోతగా వర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఇళ్లల్లోకి వరద నీరు ప్రవేశించింది. ఇక నీటి ప్రవాహానికి కార్లు కొట్టుకుపోయాయి. ఇక వరదలు కారణంగా క్రిస్మస్ సందడి కాస్త చప్పబడిపోయింది. ప్రజలంతా ఇళ్లకే పరిమితం అయిపోయారు. బుధవారం శక్తివంతమైన తుఫాను కారణంగా భారీ ఈదురుగాలులతో పాటు వర్షం కురిసిందని అధికారులు చెప్పారు. ఇక వరదలు కారణంగా ప్రధాన రహదారులను అధికారులు మూసేశారు. ఇక కొండచరియలు విరిగిపడడంతో సమీప ప్రాంతాలు బురదమయం అయ్యాయి. ఇక విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పలు ప్రాంతాలు అంధకారంలో మునిగిపోయాయి. ఇక చెట్లు రోడ్లపై కూలిపోవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## మసీదులో బాంబు పేలుడు.. 10 మంది మృతి!




**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ ఆఫ్రికా దేశమైన నైజీరియాలో ఉగ్రవాదులు మరోసారి పంజా విసిరారు. బోర్నో రాష్ట్ర రాజధాని మైదుగురిలోని ఒక మసీదులో బుధవారం సాయంత్రం ప్రార్థనల సమయంలో భీకర బాంబు పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో కనీసం 10 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గంబోరు మార్కెట్ ప్రాంతంలోని రద్దీగా ఉండే మసీదులో ఈ పేలుడు సంభవించడంతో ఒక్కసారిగా హాహాకారాలు మిన్నంటాయి. సాయంత్రం వేళ ముస్లింలు పెద్ద సంఖ్యలో మసీదుకు చేరుకుని ప్రార్థనల్లో నిమగ్నమై ఉండగా ఈ పేలుడు జరిగింది. మసీదు లోపల ముందే అమర్చిన బాంబు పేలి ఉండవచ్చని లేదా ఆత్మాహుతి దాడి జరిగి ఉండవచ్చని స్థానిక మిలీషియా నాయకులు అనుమానిస్తున్నారు. పేలుడు ధాటికి మసీదు శిథిలాలు భక్తులపై పడటంతో పాటు దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగినట్లు సమాచారం. ఈ దాడులకు సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించనప్పటికీ, ఈ ప్రాంతంలో బలంగా ఉన్న 'బోకో హరామ్' లేదా ఐసిస్ గ్రూపుల పనే అయి ఉంటుందని భద్రతా సంస్థలు భావిస్తున్నాయి. 2009 నుంచి నైజీరియాలో ఇస్లామిక్ రాజ్య స్థాపన లక్ష్యంగా సాగుతున్న ఈ ఉగ్రవాద పోరులో ఇప్పటివరకు సుమారు 40 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 20 లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. గత కొన్నేళ్లుగా మైదుగురి నగరంలో పెద్దగా దాడులు జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో మళ్లీ మసీదునే లక్ష్యంగా చేసుకుని దాడి జరగడం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. నైజీరియా సైన్యం నిరంతర నిఘా పెట్టినప్పటికీ, ఉగ్రవాద గ్రూపులు ఇలాంటి విద్రోహ చర్యలకు పాల్పడుతుండటం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, ఈ ప్రాంతంలో హింస తగ్గుముఖం పట్టినట్టే కనిపిస్తున్నా, పొరుగు దేశాలైన నైగర్, చాద్‌లకు కూడా ఈ ఉగ్రవాదం వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

## వెంటాడుతున్న మృత్యువు

**హైదరాబాద్ పెన్ పవర్:** వైద్య సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్న గాజా వాసుల విషయంలో ఇజ్రాయిల్ అమానుషంగా వ్యవహరిస్తోంది. వారిని మృత్యు ముఖంలోకి నెడుతోంది. గాజాలో ఆరోగ్య వ్యవస్థ అసాధారణ రీతిలో ఏ క్షణాన అయినా కుప్పకూలిపోయే ప్రమాదం తలెత్తింది. గాజాలోకి వైద్య పరికరాలు, మందులు ప్రవేశించకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటుండడంతో వేలాది మంది రోగులను మృత్యువు వెంటాడుతోంది. గాజాలోని ఆస్పత్రులలో పరిస్థితి దారుణంగా, భయానకంగా ఉన్నదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మునీర్ అల్-బర్ష్ తెలిపారు. అత్యవసర వైద్య సరఫరాలను ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని, ఫలితంగా కీలక కేసులకు వైద్యులు చికిత్స అందించలేకపోతున్నారని ఆయన చెప్పారు. అత్యవసర మందులు, వైద్య పరికరాలను గాజాలోకి ఇజ్రాయిల్ అనుమతించకపోవడంతో రోగుల ప్రాణాలు కాపాడేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతున్నా యని గాజా వైద్యులు చాలాకాలంగా చెబుతూనే ఉన్నారు. అక్టోబరులో కాల్పుల విరమణ అమలు లోకి వచ్చినప్పటికీ హమాస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తోంది. వైద్య సహాయక వాహనాలను గాజాలోకి ప్రవేశించని వ్వడం లేదు. గాజాలో ఇప్పటికే ఆరోగ్య ఎమర్జెన్సీ అమలులో ఉండగా ఇజ్రాయిల్ అమానవీయ చర్యలతో పరిస్థితి మరింత క్షీణిస్తోంది. మందులు, వైద్య సరఫరాల కొరత తీవ్రంగా ఉన్నదని, ముఖ్యం గా శస్త్రచికిత్సలు చేసేందుకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేదని వైద్యులు చెబుతున్నారు. మూడు వంతుల సరఫరాలకు ఆటంకం కలుగు తోందని, దీనికితోడు కరెంటు కష్టాలు, జనరేటర్ల కొరత వెంటాడుతోందని వారు తెలిపారు. 30 ఏండ్ల క్రితం పాలస్తీనా అథారిటీ ఏర్పడిన తర్వాత ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఎన్నడూ ఎదురవలేదని మునీర్ అల్-బర్ష్ చెప్పారు. రెండు సంవత్సరాలకు పైగా కొనసాగిన యుద్ధంలో దాదాపు గాజా ఆస్పత్రులన్నింటి పైన దాడులు జరిగాయి.

## పాలస్తీనా అనుకూల ప్రదర్శనలో..
## గ్రేటా థన్‌బర్గ్ అరెస్ట్.. విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:** లండన్‌లో మంగళవారం జరిగిన పాలస్తీనా అనుకూల ప్రదర్శనలో స్వీడన్ కార్యకర్త గ్రేటా థన్‌బర్గ్‌ను అరెస్ట్ చేశారు. అయితే ఆ తర్వాత ఆమెను కస్టడీ నుంచి పోలీసులు విడుదల చేశారు. 'నేను పాలస్తీనా యాక్షన్ ఖైదీలకు మద్దతు ఇస్తున్నాను. మారణహోమాన్ని వ్యతిరేకిస్తున్నాను' అని రాసి ఉన్న ప్లకార్డును పట్టుకున్న గ్రేటాను ఉగ్రవాద చట్టం కింద అరెస్ట్ చేశారని ప్రిజనర్స్ ఫర్ పాలస్తీనా అనే సంస్థ తెలిపింది. బ్రిటన్ ప్రభుత్వం పాలస్తీనా యాక్షన్‌ను ఉగ్రవాద సంస్థగా పరిగణిస్తోంది. ఇది బ్రిటన్‌లో పనిచేస్తున్న పాలస్తీనా అనుకూల ప్రత్యక్ష కార్యాచరణ నెట్‌వర్క్. దీనిని 2020లో ఏర్పాటు చేశారు. గాజాపై ఇజ్రాయిల్ జరిపిన యుద్ధ సమయంలో బ్రిటన్‌లో అనేక నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. ఈ నెట్‌వర్క్‌కు చెందిన 2,489 మందిని వివిధ కారణాలతో పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటా థన్‌బర్గ్‌కు మార్చి వరకూ బెయిల్ ఇచ్చామని లండన్ నగర పోలీసులు తెలిపారు. నిషేధిత సంస్థకు మద్దతుగా ప్లకార్డు ధరించడంతో ఆమెను అరెస్ట్ చేశామని చెప్పారు. పోలీసులు నిర్బంధించిన కార్యకర్తలకు మద్దతుగా ప్రిజనర్స్ ఫర్ పాలస్తీనా సంస్థ నిరాహార దీక్షలు ప్రారంభించింది. 2018లో స్వీడన్ పార్లమెంట్ ఎదుట వాతావరణ సంబంధమైన నిరసనలు జరపడంతో 22 సంవత్సరాల గ్రేటా థన్‌బర్గ్ వార్తల్లోకి ఎక్కారు. ఆమెను మరో 478 మందితో కలిసి అక్టోబరులో నిర్బంధించిన ఇజ్రాయిల్ వారందరినీ దేశం నుంచి బహిష్కరించింది.

# కుష్టు రోగుల ఆశాదీపం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను వదిలి అణ గారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిసల్పిన మహోన్నత వ్యక్తి బాబా ఆమ్టే. సంఘ సేవకుడిగా ప్రసిద్ధిగాంచిన బాబాఆమ్టే ముఖ్యంగా కుష్టురోగుల పాలిట దేవుడిగా భావించబడ్డారు. అమ్టే భారతీయ సామాజిక కార్యకర్త, లక్ష్య సిద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి. సామాజిక సేవే పరమావధిగా ఎంచి, జీవితాన్ని అందుకు దారవోసిన ధన్య జీవి ఆయన. కుష్టురోగుల సేవలకై చంద్రా పూర్ జిల్లాలో ఆనంద్‌వన్ ఆశ్రమాన్ని స్థాపించి అయన కూడా వారితోపాటే అక్కడే జీవితాన్ని గడిపి 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమంలోనే మృతి చెందిన త్యాగశీలి. అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన మహనీయుడు. డిసెంబర్ 26, 1914లో మహా రాష్ట్రలోని వార్ధా జిల్లా హింగన్ ఘాట్‌లో ఒక ఉన్నత దేశస్థ బ్రాహ్మణ జాగిర్దార్ కుటుంబం లో జన్మించాడు మురళీధర్ దేవదాస్ ఆమ్టే.బాబా అనేది తల్లిదండ్రులు పెట్టిన ముద్దు పేరు. న్యాయ శాస్త్రంలో శిక్షణ పొందిన తరువాత వార్ధాలో న్యాయ అభ్యాసం ప్రారంభించాడు. అదే సమయంలో భారత జాతీయోద్యమ పోరాటం జరుగుతుండేది. క్విట్ ఇండియా ఉద్యమ సమయం లో అరెస్ట్ కాబడిన జాతీయ నేతల తరపున కోర్టులలో వాదించేవాడు. క్రమక్రమంగా మహాత్మా గాంధీ వైపు ఆకర్షితు డైనాడు. గాంధీజీతో పాటు కొంతకాలం సేవాగ్రం ఆశ్రమంలో గడిపినాడు. ఆ తరువాత జీవితాంతం వరకు గాంధీజీ సిద్ధాంతాలకే కట్టుబడినాడు. వేషధారణలో కూడా గాంధీజీ వలె ఖద్దరు దుస్తులనే వాడేవాడు. గాంధీజీ వలె జీవితాంతం అణగారిన వర్గాల కృషికై పాటు పడ్డాడు. బాబా ఆమ్టే స్థాపించిన మూడు ఆశ్రమాల్లో ఆనంద్‌వన్ మొదటిది. కుష్టురోగుల సంక్షేమానికి మహారాష్ట్రలోని చంద్రాపుర్ జిల్లాలో ఈ ఆశ్రమాన్ని 1951లో స్థాపించాడు. ఆనంద్‌వన్ వరోరాకు దగ్గరలోని అటవీ ప్రాంతంలో 50 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని ప్రారంభిం చాడు. అది క్రమ క్రమంగా పెద్దదై నేడు 500 ఎకరాలకు విస్తరించింది. ఆ రోజులలో కుష్టురోగులకు సమాజం నుంచి వెలివేసేవారు. అలాంటి వారి కొరకు ఆశ్రమాన్ని స్థాపించి కుష్టురోగులను చేరదీసి వారితో పాటు అతడు కూడా అక్కడే వారి సంక్షేమం చూస్తూ గడపటం గొప్ప విషయం. కుష్టువ్యాధి ఒక అంటు రోగమని, కుష్టు రోగులను తాకినా ఆ వ్యాధి వస్తుందనే ప్రచారంలో ఉన్న సమయంలో బాబాఆమ్టే ఆ వదంతులను త్రిప్పి కొట్టడానికి స్వయంగా ఒక కుష్టురోగి నుంచి బాసిల్లి క్రిములను తన శరీరంలో ఇంజెక్షన్ ద్వారా ఎక్కించు కున్నాడు. కుష్టు రోగులకై బాబాఆమ్టే తదనంతరం సోమనాథ్, అశోకవన్ ఆశ్రమాలను కూడా స్థాపించాడు. సమాజసేవ విషయంలో ఆనంద్‌వన్ ఆశ్రమం ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది. ఆనంద్‌వన్ కై బాబా ఆమ్టేకు 1983లో డేమియన్ డట్టన్ లెప్రసీ సంస్థనుంచి డేమియన్ డట్టన్ అవార్డు కూడా లభించింది. ప్రస్తుతం ఆనంద్‌వన్ రెండు ఆసుపత్రులను, ఒక విశ్వవిద్యాలయాన్ని, ఒక అంధుల కొరకు పాఠశాలను, ఒక అనాథ శరణాలయాన్ని కలిగిఉంది. ఈ ఆశ్రమంలో 5000కు పైగా నివసిస్తున్నారు.బాబా ఆమ్టే, గాంధీజీ సిద్ధాంతాలు బాబా ఆమ్టే గాంధీజీ సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తి పూర్తిగా ఆచరించిన మహనీయుడు. గాంధీజీతో పరిచయమైన తరువాత అతనితో పాటు కొద్ది రోజులు సేవాగ్రామ్ ఆశ్రమంలో గడిపి గాంధీజీ శిష్యుడిగా మారి, ఆయన సిద్ధాంతాలను పూర్తిగా వంట పట్టించు కున్నాడు. కుష్టురోగులకు భయపడక వారి సంక్షేమానికి అయన చేస్తున్న కృషికి బాబాఆమ్టేకు గాంధీజీ "అభయసాధక్" అనే బిరుదు ఇచ్చాడు. ఆ తరువాత బాబా ఆమ్టే సిద్ధాంతాలపై కూడా గాంధీజీ ప్రభావం చాలా పడింది. శేషజీవితం అణగారిన వర్గాల కొరకే గడపడమే కాకుండా, వస్త్రధారణలో ఖద్దరు బట్టలనే ధరించడం ఇత్యాది విషయాలలో ఆ ఇద్దరిలో సామ్య ముంది. అంతేకాదు ఆశ్రమాల్లో గడుపుతూ పూర్తి శాకాహార భోజనం చేస్తూ జీవనం గడిపినాడు. గాంధీజీ వలెనే స్వయంసమృద్ధి గ్రామాలు ఉండాలని ఆకాంక్షించాడు. గాంధీజీ బ్రిటీష్ వారిపై అహింసా పోరాటం జరిపినట్లే బాబా ఆమ్టే కూడా నర్మదా బచావో ఉద్యమంలో కూడా ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా అహింసాయుత పోరాటం కొనసాగించాడు. తుదిశ్వాస వదిలే వరకు తాను నమ్మిన సిద్ధాంతాలకే పాటు పడి, తన ఆశయమే లక్ష్యంగా కృషిసల్పి, 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమం ఆనంద్‌వన్‌లో బాబా ఆమ్టే 94 సంవత్సరాల వయస్సులో కన్నుమూశాడు. అనేక దశాబ్దాల పాటు దీనజన ప్రజల కోసం కృషిసల్పిన బాబా ఆమ్టేకు అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఎన్నో లభించాయి. అవార్డులతో పాటు లభించిన నగదును సాంఘిక కార్యకలాపాల కోసమే వినియోగించాడు. 1971లో భారత ప్రభుత్వపు పద్మశ్రీ అవార్డు, 1974లో మహారాష్ట్ర ప్రభుత్వపు దళిత్ మిత్రా అవార్డు, 1978 లో రాష్ట్రీయ భూషణ్ అవార్డు, 1979 లో జమన్‌లాల్ బజాజ్ అవార్డు, 1983లో అమెరికాకు చెందిన డామియెన్ డట్టన్ అవార్డు (కుష్టువ్యాధి పీడితుల కోసం కృషిసల్పిన వారికిచ్చే ప్రపంచంలో అత్యున్నత అవార్డు), 1985లో రామన్ మెగ్సేసే అవార్డు, 1985లో మధ్య ప్రదేశ్ ప్రభుత్వపు ఇందిరా గాంధీ స్మారక అవార్డు ,1986లో భారత ప్రభుత్వపు పద్మ విభూషణ్ అవార్డు, 1986 లో రాజారాంమోహన్ రాయ్ అవార్డు, 1988లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల అవార్డు, 1988లో జి.డి.బిర్లా అంతర్జాతీయ అవార్డు, 1988లో ఫిక్కి అవార్డు, 1989లో అంతర్జాతీయ జిరాఫీ అవార్డు, 1990లో టెంపుల్టన్ అవార్డు, 1991లో రైట్ లివ్లీ హుడ్ అవార్డ్ (ఈ అవార్డు ప్రత్యమ్నాయ నోబెల్ బహుమతిగా పేరుపొందింది), 1991లో ఆదివాసీ సేవక్ అవార్డు, 1992లో మహారాష్ట్ర ప్రభుతపు అంబేద్కర్ దళిత్ మిత్ర అవార్డు, 1997లో మహాత్మా గాంధీ చారిటేబుల్ ట్రస్ట్ అవార్డు, 1999లో గాంధీ శాంతి బహుమతి, 1999లో అంబేద్కర్ అంతర్జాతీయ అవార్డు, 2008లో భారత్‌వాసా అవార్డు లభించాయి.

# మానవాళికి సవాలుగా సునామీలు

**హైదరాబాద్ పెన్ పవర్:** సరిగ్గా రెండు దశాబ్దాల కిందట భయంకరమైన అలలు లక్షల మందిని పొట్టన పెట్టుకున్నాయి. 2004 డిసెంబరు 26న ఇండొనేసియాలోని సుమత్రా తీరంలో ఒక్కసారిగా భారీ కుదుపు. 9.3 తీవ్రతతో హిందూ మహా సముద్ర గర్భంలో వచ్చిన భూకంపం ప్రళయాన్ని తలపించింది. దాని ఉద్ధృతితో ఒక్కసారిగా విరుచుకు పడిన సునామీ పెను విషాదాన్ని మిగిల్చింది. ఆ భూకంపం ధాటికి 23 వేల 'హిరోషిమా' తరహా అణుబాంబులు పేలినంత శక్తి విడుదలైనట్లు శాస్త్రవేత్తలు గుర్తించారంటే అది ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవచ్చు. భూకంప కేంద్రం నుంచి సముద్రంలో మొదలైన రాకాసి అలలు సునామీలా దూసుకొచ్చి... భారత్ సహా 14 దేశాల్లో భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కలర్ లిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్రకారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచవ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండాపోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్‌లోనూ సునామీలు సంభవించాయి. జపాన్‌కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణ రక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో 'వరల్డ్ సునామ్ అవేర్నెస్ వచ్చింది. అప్పటి వరకు సునామీ పై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ ఎఎఫెడ్) గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5, 6 నిమిషాలకు ఇంకాయిస్‌కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహా సముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి.సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్ ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ ఫోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది. ఆయా ఆధునిక పరికరాల సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది. ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్ డీ ఎంపి (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఎ (మినిస్ట్రీ ఆఫ్ హోరీం సైన్సెస్) లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిన్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్ వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

## వెనిజులాపై అమెరికా దాడులు.. ఖండించిన రష్యా



**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులాపై అమెరికా దురాక్రమణపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యుఎన్ఎస్‌సి) మంగళవారం చర్చ చేపట్టింది. ఈ సమావేశంలో అమెరికా 'అక్రమ దిగ్బంధనం'ను రష్యా ఖండించింది. ఇది ప్రాంతీయ శాంతికి ముప్పు కలిగించడమే కాకుండా అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొంది.డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవాలనే తప్పుడు సాకుతో అమెరికా కరేబియన్ జలాల్లో పౌర నౌకలను ధ్వంసం చేస్తోందని యుఎన్‌లో రష్యా శాశ్వత ప్రతినిధి వాసిలీ నెబెంజియా ఆ సెషన్‌లో పేర్కొన్నారు. ఇది 'కృత్రిమమైనది'గా పేర్కొంటూ .. 'వెనిజులాకు వ్యతిరేకంగా ఉద్రిక్తతలను పెంచడానికి ఉద్దేశించిన సమర్థన' అని వ్యాఖ్యానించారు. వెనిజులాలో చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఉగ్రవాద సంస్థగా ముద్రవేయడం ద్వారా అమెరికా ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ఒక సాకుగా ఉగ్రవాదంపై పోరాటాన్ని వినియోగిస్తూ, దానిని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ఏకపక్ష యుఎస్ నిర్ణయం, దాని చర్యలను చట్టబద్ధమైన చట్ట అమలు లేదా జాతీయ రక్షణ కార్యకలాపాలుగా మారుస్తుందనే వాదనను ఆయన తిరస్కరించారు. డిసెంబర్ 16న ట్రంప్ ప్రకటనను ప్రాథమిక నిబంధనల ఉల్లంఘనకు స్పష్టమైన సాక్ష్యంగా ఆయన ఉదహరించారు. దీనికి మరిన్ని వివరణలు అవసరంలేదని అన్నారు. రాజకీయ, సైనిక మరియు ఆర్థిక ఒత్తిడిని ప్రయోగించి వ్యతిరేక దేశాల ప్రభుత్వాలను పడగొట్టడం వెనుక ప్రధాన లక్ష్యం ఆయా దేశాల సహజ మరియు ఖనిజవనరులను స్వాధీనం చేసుకోవడమేనని అన్నారు. అమెరికా చర్యలు పూర్తిగా ఆమోదయోగ్యం కానివి అని, యుఎన్, ఐక్యరాజ్యసమితి సముద్ర చ్టంపై సమావేశం (యుఎన్‌సిఎల్ఓఎస్), భద్రతామండలి తీర్మానాలకు విరుద్ధని ఆయన పేర్కొన్నారు. వెనిజులా ప్రభుత్వానికి, ప్రజలకు రష్యా పూర్తి సంఘీభావం ప్రకటిస్తుందని అన్నారు. ఆయనను జాతీయ సార్వభౌమాధికార రక్షకుడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ సమాజం అంతర్జాతీయ చట్టాలను సమర్థించాలని ఆయన కోరారు.

## తమిళనాడులో రోడ్డు ప్రమాదం : సంతాపం తెలిపిన సీఎం స్టాలిన్



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడులోని కడలూరు జిల్లా తిట్టకుడి సమీపంలోని ఏల్తూరు గ్రామం వద్ద తిరుచ్చి-చెన్నై జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.తిరుచ్చి నుంచి చెన్నై వెళ్తున్న ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సు ముందు టైర్ పేలడంతో అదుపు తప్పి మీడియన్‌ను దాటి ఎదురుగా వస్తున్న ఒక ఎస్‌యూవీ, ఒక కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న 7 మంది సహా మొత్తం 9 మంది స్పాట్‌లోనే మృతి చెందారు. ఇద్దరు పిల్లలు సహా మరో నలుగురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు తలా రూ.3 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. గాయపడినవారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఎలక్ట్రిక్ బైక్స్ కొనేవారికి షాక్..
# జనవరి 1వ తేదీ నుంచే అమలు !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు విపరీతమైన డిమాండ్ ఉన్న సంగతి తెలిసిందే. పెట్రోల్ అలాగే డీజిల్ ధరలు దేశవ్యాప్తంగా సెంచరీ దాటేశాయి.దీంతో పెట్రోల్ వాహనాలు వాడేందుకు జనాలు వణికిపోతున్నారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం విపరీతంగా పెరిగింది. 40 వేల నుంచి మొదలుకొని రెండు లక్షల వరకు కూడా టూ-వీలర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ మార్కెట్ లో అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే చాలా మంది సాధారణ పౌరులు కూడా ఎలక్ట్రిక్ వాహనాలను కొనేస్తున్నారు. ఇక మార్కెట్లో ఏథర్ ఎనర్జీ స్కూటర్లకు మంచి డిమాండ్ ఉంటుందన్న సంగతి తెలిసిందే. అయితే వాటి ధరలు త్వరలోనే పెరగనున్నట్లు కంపెనీ వెల్లడించింది. జనవరి ఒకటో తేదీ నుంచి ఈ పెరిగిన ధరలు అమలులోకి వస్తాయట. ఒక్కో బైక్ పైన రూ.3000 వరకు పెంచనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ముడి సరుకు, ఇతర ఎలక్ట్రిక్ పార్ట్స్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుందట కంపెనీ. కాగా ఈ ఏథర్ ఎనర్జీలో లక్ష 14 వేల నుంచి 1,82,000 వరకు బైక్ ధరలు ఉన్నాయి. ఒక్కో మోడల్ ఒక్కో రేటు ఉంటుంది. ఇక ఏథర్ ఎనర్జీ తరహాలోనే ఇతర ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు పెరిగే ఛాన్స్ ఉందని చెబుతున్నారు.

# హైయర్ ఇండియాలో 49 వాటాను
# కొనుగోలు చేసిన భారతీ ఎంటర్‌ప్రైజెస్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ భారతీ ఎంటర్‌ప్రైజెస్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. చైనాకు చెందిన హైయర్ గ్రూప్ అనుబంధ కంపెనీ హైయర్ ఇండియాలో 49 శాతం వాటాను కొనుగోలు చేసినట్టు బుధవారం ప్రకటనలో తెలిపింది. భారతీ ఎంటర్‌ప్రైజెస్, ఈక్విటీ కంపెనీ వార్‌బర్గ్ పింకస్ హైయర్ ఇండియాలో 49 శాతం వాటాను సంయుక్తంగా కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించాయి. అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక వివరాలను కంపెనీలు వెల్లడించలేదు. హైయర్ ఇండియాలో 49 శాతం వాటాను హైయర్ గ్రూప్ తన వద్దే ఉంచుకుంటుంది, మిగిలిన 2 శాతం వాటాను హైయర్ ఇండియా మేనేజ్‌మెంట్ బృందం వద్ద ఉంటుంది. ప్రస్తుతం హైయర్ బ్రాండ్ కింద దేశంలో ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషీన్, టీవీలతో పాటు పలు గృహోపకరణాలను విక్రయిస్తోంది. గత ఏడేళ్ల కాలంలో కంపెనీ ఏటా 25 శాతం వృద్ధిని నమోదు చేస్తోంది. ఈ భాగస్వామ్యం ద్వారా స్థానిక వనరుల సేకరణ, ఉత్పాదక సామర్థ్యాన్ని విస్తరించడం, కొత్త ఉత్పత్తులను తీసుకురావడం, మార్కెట్ విస్తరణను వేగవంతం చేయడం ద్వారా హైయర్ ఇండియా 'మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఫర్ ఇండియా' లక్ష్యాలకు మద్దతు ఇస్తుందని కంపెనీ పేర్కొన్నాయి.

# రూ. 2.44 లక్షలకు చేరిన వెండి ధరలు



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ మార్కెట్లో బంగారం ధరలు దూసుకెళ్తున్నాయి. ఇప్పటికే రికార్డు గరిష్ఠాలకు చేరిన పసిడి, వెండి ధరలు బుధవారం కూడా కొత్త గరిష్ఠాలను తాకాయి. అయితే, ధరలు దేశీయ మార్కెట్లలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ముఖ్యంగా వెండి ధరలు భారీగా పెరిగాయి. బుధవారం వెండి ఏకంగా రూ. 10,000 పెరగడంతో కిలో రూ. 2,44,000కి చేరుకుంది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం రూ. 1.41 లక్షలు దాటింది. బులియన్ మార్కెట్ వివరాల ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన పసిడి 10 గ్రాములు రూ. 1,39,030 చేరుకుంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ. 1,27,350 వద్ద ఉంది. గ్లోబల్ మార్కెట్లలో ఔన్స్ బంగారం తొలిసారి 4,500 డాలర్లను అధిగమించింది. ఓ దశలో 4,507 డాలర్లకు చేరిన ఔన్స్ బంగారం, ఆ తర్వాత కొంత దిగొచ్చింది. రికార్డు ధరలకు ప్రధానంగా వచ్చే ఏడాది అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లలో కోత విధిస్తుందన్న అంచనాలు పెరగడంతో పాటు బంగారంలో పెట్టుబడులకు గిరాకీ కొనసాగడం, అమెరికా డాలర్‌తో పాటు భారత కరెన్సీ రూపాయి బలహీనంగా కొనసాగుతుండటం కారణాలుగా ఉన్నాయి.

# క్యాస్ట్రోల్‌లో 65% వాటా విక్రయం




**హైదరాబాద్ పెన్ పవర్:** లూబ్రికెంట్లు తయారు చేసే క్యాస్ట్రోల్ ఇండియా మాతృసంస్థ, బ్రిటన్‌కు చెందిన క్యాస్ట్రోల్‌లో 65% వాటా విక్రయించడానికి బ్రిటన్ ఇంధన సంస్థ బీపీ అంగీకరించింది. అంతర్జాతీయ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ స్టోన్‌పీక్‌కు ఈ వాటా విక్రయిస్తామని తెలిపింది. క్యాస్ట్రోల్ కంపెనీ విలువను 10.10 బిలియన్ డాలర్లు (సుమారు రూ.90,900 కోట్లు)గా పరిగణించి ఈ లావాదేవీ నిర్వహించనున్నారు. ఈ విక్రయంతో బీపీకి 6 బి. డాలర్ల (రూ.54,000 కోట్ల) వరకు వస్తాయి. 2026 చివరికల్లా ఒప్పందం పూర్తవుతుందని బీపీ భావిస్తోంది. క్యాస్ట్రోల్‌కు చెందిన మైనారిటీ వాటాలు (1.8 బి. డాలర్లు) కూడా ఈ లావాదేవీలో భాగమే. ఇందులో ఎక్కువ భాగం క్యాస్ట్రోల్ ఇండియా నుంచి వస్తుండడం గమనార్హం. సెప్టెంబరు త్రైమాసికం చివరకు క్యాస్ట్రోల్‌కు క్యాస్ట్రోల్ ఇండియాలో 51% వాటా ఉంది. ఈ లావాదేవీ తర్వాత స్టోన్‌పీక్‌కు 65%, బీపీకి 35% వాటాలతో కొత్త సంయుక్త సంస్థ ఏర్పాటు కానుంది. రెండేళ్ల లాక్ ఇన్ గడువు ముగిశాక, క్యాస్ట్రోల్‌లో తనకున్న 35% వాటాను బీపీ విక్రయించేందుకు వీలుంది.

# అపోలో హాస్పిటల్స్ వాటాదార్లకు అపోలో హెల్త్‌టెక్ షేర్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతిపాదించిన పునర్‌వ్యవస్థీరణ ప్రణాళికకు స్టాక్ ఎక్స్ఛేంజీలు అనుమతి ఇచ్చాయి. ఫార్మసీ వ్యాపారాన్ని, డిజిటల్ హెల్త్‌కేర్ వ్యాపారాన్ని విడదీయాలనిబీ అనుబంధ కంపెనీలైన అపోలో హెల్త్‌కో, కీమెడ్ లను అపోలో హెల్త్‌టెక్‌లో కలపాలని సంస్థ ప్రతిపాదించింది. దీనిపై బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నుంచి నిరభ్యంతర పత్రం జారీ అయినట్లు అపోలో హాస్పిటల్స్ వెల్లడించింది. ఈ విలీనం తర్వాత అపోలో హెల్త్‌టెక్ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేస్తారు. దీనివల్ల అపోలో హాస్పిటల్స్ వాటాదార్లకు ప్రతి 100 షేర్లకు, 195.2 అపోలో హెల్త్‌టెక్ షేర్లు లభిస్తాయి. అపోలో హాస్పిటల్స్‌కు అపోలో హెల్త్‌టెక్‌లో 15% వాటా ఉంటుంది. అపోలో హెల్త్‌కో ఫార్మా ఉత్పత్తుల

టోకు వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. దీనికింద అపోలో 24/7 డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఉంది. కీమెడ్ హోల్‌సేల్ ఫార్మా, హెల్త్‌కేర్, వెల్‌నెస్ ఉత్పత్తులను పంపిణీ చేస్తోంది. విలీనం తర్వాత అపోలో హెల్త్‌టెక్ కింద ఫార్మసీ పంపిణీ వ్యాపారం, డిజిటల్ హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ వ్యాపారాలుంటాయి.

# జెమిని ఏఐ, గూగుల్ వన్ ధరలను సగానికి తగ్గించిన గూగుల్




**హైదరాబాద్ పెన్ పవర్:** గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ తమ ప్రీమియం ఏఐ, క్లౌడ్ స్టోరేజీ సేవలపై భారీ తగ్గింపును ప్రకటించింది. పరిమిత కాలానికి వార్షిక సబ్‌స్క్రిప్షన్‌లపై 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్టు తాజా ప్రకటనలో వెల్లడించింది.జనరేటివ్ ఏఐ మార్కెట్లో ఆధిపత్యం కోసం పోటీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. తాజా ఆఫర్ గూగుల్ ఏఐ ప్రో, ప్రీమియం గూగుల్ వన్ ఎంచుకునే కొత్త సబ్‌స్క్రైబర్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. అంతేకాకుండా 2026, 15 జనవరి వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని, ఆ తర్వాత కస్టమర్లు రెన్యూవల్‌ను మాన్యువల్‌గా నిలిపివేస్తే తప్ప, సబ్‌స్క్రిప్షన్ సాధారణ ధరలకు ఆటోమెటిక్‌గా యాక్టివ్ అవుతుంది. అయితే, ప్రస్తుతానికి ఈ ఆఫర్‌ను క్రిస్మస్ సందర్భంగా అమెరికాలో మాత్రమే అందిస్తున్నట్టు తెలుస్తోంది. భారత మార్కెట్‌లో అందుబాటులో లేదు. సాధారణంగా గూగుల్ మనదేశంలో పండుగల సీజన్ ఆధారంగా ఆఫర్లు ప్రకటిస్తుంది. కాబట్టి ఈ ఆఫర్ నూతన సంవత్సరం లేదా రాబోయే పండుగలకు డిస్కౌంట్ ఆఫర్లను అందించే అవకాశం ఉందని టెక్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఇప్పటికే దేశీయ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియోతో భాగస్వామ్యం ద్వారా జియో యూజర్లకు ఉచితంగా జెమిని ఏఐ లభిస్తోంది. గూగుల్ వన్ మాత్రం ఏడాదికి స్టోరేజ్‌ను బట్టి రూ. 589 నుంచి రూ. 16,000 ఫీజుతో అందుబాటులో ఉంది. తాజా ఆఫర్ కింద జెమిని ఏఐ ప్రస్తుతం అమెరికాలో ఏడాదికి ధర సుమారు 199.99 డాలర్లు(మన కరెన్సీలో సుమారు రూ. 17,950) నుంచి 99.99 డాలర్ల (సుమారు రూ. 8,975)కి తగ్గుతుంది. కానీ, ఆ తర్వాత ఏడాది నుంచి ఇది 239.88 డాలర్లు (సుమారు రూ. 21,530) అవుతుంది. అధిక ధరతో సబ్‌స్క్రిప్షన్ వద్దనుకునే కస్టమర్లు ఏడాది తర్వాత ఆటో-రెన్యూవల్ ఫీచర్‌ను నిలిపేయాల్సి ఉంటుంది.

# దేశీయ విమానయాన రంగంలోకి కొత్తగా మూడు సంస్థలు

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ విమానయాన రంగంలోకి కొత్త సంస్థలు అడుగుపెట్టనున్నాయి. బుధవారం పౌరవిమానయాన శాఖ రెండు కొత్త విమానయాన సంస్థలకు విమానాలు నడిపేందుకు అనుమతి ఇచ్చింది. ఇటీవల ఇండిగో సంస్థ కారణంగా ఏర్పడిన అంతరాయం నేపథ్యంలో కొన్ని విమానయాన సంస్థలపైనే ఆధారపడటాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. తాజాగా అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ సంస్థలు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రాలను(ఎన్‌ఓసీ) పొందాయి. దేశీయ విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో ఈ ఆమోదాలు రావడంతో రానున్న రోజుల్లో పోటీ మరింత తీవ్రం కానుంది. ఈ రెండింటితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని మరో విమానయాన సంస్థ శంఖ్ ఎయిర్ ఇప్పటికే తన ఎన్‌ఓసీని పొందింది. ఈ సంస్థ 2026లో కమర్షియల్ విమాన సర్వీసులను ప్రారంభించే అవకాశం ఉంది. ప్రయాణీకుల డిమాండ్ పెరుగుతున్నప్పటికీ, అధిక ఖర్చులు, అప్పులు, నిర్వహణ సవాళ్ల కారణంగా కొత్త విమానయాన సంస్థలు గతంలో మనుగడ సాగించడం కష్టమని భావించాయి. ప్రస్తుతం దేశంలో తొమ్మిది షెడ్యూల్ దేశీయ విమానయాన సంస్థలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రాంతీయ క్యారియర్ ఫ్లై బిగ్ షెడ్యూల్ చేసిన సేవలను ఆపివేసిన తర్వాత అక్టోబర్‌లో ఈ సంఖ్య మరింత తగ్గింది.



ముఖ్యంగా ప్రయాణీకుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతున్న సమయంలో ఈ రంగం తక్కువ అందుబాటులో ఉండటంపై ఆందోళనను పెంచింది. మార్కెట్‌లో ఎక్కువగా ఇండిగో, ఎయిర్ ఇండియా గ్రూప్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఇందులో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. ఈ విమానయాన సంస్థలు కలిసి దేశీయ విమాన ప్రయాణాలలో 90 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. ఇండిగో మాత్రమే మార్కెట్‌లో 65 శాతం కంటే ఎక్కువ వాటాతో కొనసాగుతోంది. ఈ నెల ప్రారంభంలో ఇండిగోలో నెలకొన్న తీవ్ర సంక్షోభం దేశవ్యాప్తంగా ప్రయాణికులను ప్రభావితం చేశాయి. అతిపెద్ద పెద్ద దేశంగా, విస్తరిస్తున్న మార్కెట్‌లో ఒకే విమానయాన సంస్థపై ఎక్కువగా ఆధారపడటం వల్ల కలిగే నష్టాలను ఈ సంఘటన ముందుకు తెచ్చింది.

# భారత ఆర్థిక సరళీకరణ రూపశిల్పి

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ ప్రధాని, ఆచార్యులు, బ్యూరోక్రాట్, అకడమీషియన్, ఆర్థికశాస్త్రవేత్త, రాజనీతిజ్ఞుడు, నిస్వార్థ సేవకుడు, నిరాడంబరతకు నిలుటద్దం, నేల మీద మాత్రమే నడవడం తెలిసిన మహా మేధావి మన్మోహన్ సింగ్ తన 92వ ఏట తుది శ్వాస విడిచారు. పార్టీ ఏదైనా తన పదవిని ఒక మహత్తర బాధ్యతగా భావించి ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన నిరాడంబర బుద్ధి జీవి మన మన్మోహన్. ఆర్థిక నిపుణులు సహితం తన ఆర్థికశాస్త్ర పరిజ్ఞానానికి తల వంచి "సింగ్ ఈజ్ కింగ్" అని కొనియాడడం చూసాం. ప్రతిపక్ష నాయకులు సహితం మన్మోహన్ సింగ్‌ను వ్యక్తిగతంగా విమర్శించడానికి వెనకడుగు వేసిన సందర్భాలు ఎన్నో. అందరి బంధువుగా, అతి సామాన్య జీవితాన్ని గడిపి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిరూపించుకున్న యోధుడు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఎన్నడూ నిలబడిని మన్మోహన్ సింగ్ రాజ్యసభకు పలు మార్లు ఎన్నికై 33 ఏండ్ల పాటు ఎంపీగా, మంత్రిగా, ప్రధానిగా విశేష సేవలు అందించారు. అవస్థల విష వలయంలో చిక్కిన భారత ఆర్థిక వ్యవస్థను పలు ఆర్థిక సంస్కరణలతో గాడిలో పెట్టిన మహా మేధావి. 2004 , 2014 మధ్య కాలంలో రెండు పర్యాయాలు యూపిఏ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వానికి ప్రధానమంత్రిగా అమూల్య సేవలు అందించారు. రెండవ దఫా ప్రధానిగా ఉన్న సమయంలో పలు అవినీతి కుంభకోణాలు, ద్రవ్యోల్బణ సంక్షోభాలను ఎదుర్కొంటూ ప్రతిపక్ష నాయకుల చేత "బలహీన పిఎం" అని పిలిపించుకున్నారు. జూన్ 1991లో పి వి నర్సింహారావు నేతృత్వంలో కాంగ్రేస్ పార్టీలో సభ్యుడిగా చేరి అక్టోబర్ 1991 నుంచి ఐదు సార్లు అస్సాం(1991-2019), ఒక సారి రాజస్థాన్ నుంచి (2019-24) రాజ్యసభకు ఎన్నికైన మన్మోహన్ సింగ్ ఏప్రిల్ 2024లో తన ఎంపీ పదవిలో 33 ఏండ్ల పాటు ఉంటూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా "భారత ఆర్థిక సరళీకరణ రూపశిల్పి"గా, రెండు పర్యాయాలు ప్రధాన మంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారు. భారతదేశ ఎదుగుదలను ఏ ప్రపంచ శక్తి ఆపలేదని, రాజకీయ నాయకులు ప్రజల మనోభావాలపై స్వారీ చేస్తున్నారని, దేశ చరిత్ర తనపై దయ తలిచిందని, నరేంద్ర మోదీ దేశ ప్రధాని కావడం దురదృష్టకరమని, డీమానిటైజేషన్‌తో పాటు జిఎస్టీ ఒక విఫల జంట ప్రయోగాలని వివిధ సందర్భాల్లో నిక్కచ్చిగా పేర్కొనడం తనలోని ధైర్యంతో పాటు స్పష్టమైన భావవ్యక్తీకరణకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.26 సెప్టెంబర్ 1932న గుర్ముఖ్ సింగ్-అమ్రిత్ కౌర్ దంపతులకు నేటి పాకిస్థాన్‌లోని గహ్ ప్రాంత సిక్కు కుటుంబంలో జన్మించి, 1947లో దేశ విభజన సమయంలో భారత్‌కు వచ్చి వారి కుటుంబం స్థిరపడింది. పాఠశాల విద్యను పెషావర్‌లో ప్రారంభించి, హల్ద్వీ ప్రాంతానికి వలస వచ్చి, అమృత్‌సర్ హిందూ కాలేజీ, పంజాబ్ యూనివర్సిటీల్లో గ్రాడ్యుయేషన్(1952), ఎకనమిక్స్‌లో పిజీ(1954) పూర్తి చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ(1957), సెయింట్ జాన్స్ కాలేజీల్లో ఉన్నత విద్యను కొనసాగించి, యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో ఎకనమిక్స్‌లో పిహెచ్‌డి (1962) పూర్తి చేసారు. 1957-59లో పంజాబ్ యూనివర్సిటీలో సీనియర్ లెక్చరర్‌గా, 1959-63లో రీడర్‌గా, 1963-65లో ప్రొఫెసర్‌గా పని చేశారు. అనంతరం 1966-69లో ఐరాసలో ఉద్యోగిగా, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో ప్రొఫెసర్‌గా కూడా పని చేశారు. తర్వాత కామర్స్ అండ్ ఇండస్ట్రీ మినిస్ట్రీలో బ్యూరోక్రాట్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, 1970-1980ల్లో భారత ప్రభుత్వంలో పలు బాధ్యతలు నిర్వహించి, 1972-76లో చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్‌గా, 1982-85లో ఆర్‌బిఐ గవర్నర్‌గా, 1985-87లో ప్లానింగ్ కమీషన్ హెడ్‌గా, 1990లో ప్రధాని చంద్రశేఖర్‌కు ఆర్థిక సలహాదారుగా, 1991లో స్వల్పకాలం యూజిసీ చైర్మన్‌గా విశేష సేవలు అందించారు. 1991లో భారత్ తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్న వేళ నాటి ప్రధాని పివి నరసింహారావు చొరవతో కాంగ్రేస్‌లో చేరి క్యాబినెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. భారతదేశ ఆర్థిక దుస్థితిని గాడిలో పెట్టడానికి ఆర్థిక సరళీకరణ, ప్రైవెటీకరణ, గ్లోబలైజేషన్‌లను ప్రవేశపెట్టి దేశాన్ని సంక్షోభంలోంచి కాపాడి బయటకు తీసుకువచ్చారు. 1996 ఎన్నికల్లో విఫలమైన కాంగ్రేస్ ప్రతిపక్షంలో ఉండగా రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా (1998-2004 మధ్య) బాధ్యతలు నిర్వహించారు. 2004 ఎన్నికల్లో యూపిఏ (కాంగ్రేస్) నెగ్గడంతో సోనియాగాంధీ నిర్ణయంతో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. 2009 ఎన్నికల్లో కూడా యూపిఏ విజయం సాధించడం, మరో పర్యాయం పిఎంగా పదవిని చేపట్టారు. రెండవ పర్యాయం పిఎంగా పదవిలో ఉన్నపుడు కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ, బొగ్గు గనుల కేటాయింపు, 2జీ స్పెక్ట్రమ్ అలాట్‌మెంట్ అంశాల్లో జరిగిన భారీ కుంభకోణాల విమర్శల మాటల యుద్ధాలను ఎదుర్కొన్నారు. ఏప్రిల్ 2024లో రాజ్యసభ సభ్యత్వం ముగియడంతో రాజకీయాల నుంచి నిష్క్రమించారు. "అసాధారణ గౌరవం, తేజస్సు కలిగిన నేత"గా పేరు తెచ్చుకోవడంతో పాటు "ప్రపంచ అగ్రనేతల్లో ఉన్నతుడు"గా కూడా విదేశీ పత్రికల్లో కొనియాడబడ్డారు. మారుతీ 800 కారు యజమానిగా అతి సాధారణ జీవితాన్ని గడిపిన దేశ ప్రధానిగా చరిత్రలో నిలిచి పోయారు. "ప్రతిపక్ష నాయకులు సహితం గౌరవించే అద్వితీయ నేత"గా కీర్తించబడి, "ముందు చూపు కలిగి నైతికతే ఆభరణంగా ధరించిన దార్శనికుడు"గా మెప్పు పొందిన మన్మోహనుడు, మనసున్న మానవత్వ రూపం. నేటి రాజకీయ నాయకులను ఆయన జీవితం ఓ పాఠంగా నిలుస్తుంది. ఫోర్బ్స్ జాబితాలో ప్రపంచ అత్యంత ప్రతిభగల నేతల్లో 18 స్థానాన్ని పొంది, "భారత్‌ను అగ్ర రాజ్యాల సరసన నిలిపిన యోధుడు"గా, "భారత్‌ను గట్టెక్కించిన మన్మోహన్"కు దేశం సదా రుణపడి ఉంటుంది. ఆయన రాజకీయ రంగంలో ఏ పదవిని కోరుకోలేదు. అన్ని పదవులు ఆయన చెత్తకు చేరి మురికి పోయాయి. ఆయన మరణం భరతమాతకు తీరని నష్టం. ఆయన సామాన్యుల్లో అసమాన్యుడు, అలసట ఎరుగని నిరంతర శ్రామికుడు, దేశభక్తిని శ్వాసించిన సేవకుడు.



# నాన్‌వెజ్‌కు దూరంగా ఉంటే అందం, ఆరోగ్యం రెండూ..

మాజీ మిస్ శ్రీలంక, నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ శాఖాహారిగా మారిన తర్వాత ఆమె శరీరంలో వచ్చిన సానుకూల మార్పులను పంచుకున్నారు. మాంసాహారం మానేయడం వల్ల మొటిమలు తగ్గడం, బరువు స్థిరంగా ఉండటం, కడుపు ఉబ్బరం తగ్గడం, మానసిక ప్రశాంతత వంటి ప్రయోజనాలు పొందారు. ప్రోటీన్ కోసం ఆమె కూరగాయలు, బీన్స్, టోఫు, ప్రోటీన్ షేక్స్ తీసుకుంటున్నారు. సరైన పోషకాలతో శాఖాహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. శరీరానికి కావాల్సిన ప్రోటీన్ పొందడానికి మాంసాహారం మాత్రమే తినాల్సిన పనిలేదు..మీరు శాఖాహారంతో కూడా మంచి ప్రోటీన్ తీసుకోవచ్చు. మాజీ మిస్ శ్రీలంక యూనివర్స్, నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఒక ఇంటర్వ్యూలో తాను ఇప్పుడు పూర్తి శాఖాహారిగా మారానని, మాంసాహార పదార్థాలను పూర్తిగా వదులుకున్నానని వెల్లడించారు. ఈ నటి బాలీవుడ్లో చాలా ఫేమస్ అయ్యారు. గ్లామర్ ప్రపంచంలోని అందాల తారలలో తను కూడా ఒకరు. ఆమె తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో విశేషాలతో తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ..మాంసాహార వంటకాలను మానేసిన తర్వాత తన శరీరంలో వచ్చిన మార్పులను, ప్రోటీన్ లోపాన్ని భర్తీ చేయడానికి ఇప్పుడు తన ఆహారంలో ఎలాంటి శాఖాహార పదార్థాలను (నినీని లవణ బినీ లవణవబిజీతీతిజీని ఎవనివటతిబిబ) చేర్చుకున్నారో కూడా వివరించారు. ఉబ్బరం తగ్గుతుంది ? ఎప్పుడూ కడుపు ఉబ్బరం అనిపించదు. ఇది మాంసాహారం తినేటప్పుడు తరచుగా జరుగుతుంది. మనస్సు కూడా తేలికగా ఉంటుంది ? మాంసాహారానికి దూరంగా ఉండటం వల్ల మానసికంగా తేలికగా, ప్రశాంతంగా అనిపించింది. ఇప్పుడు, ఆమె శాఖాహారిగా మారింది. ఇవి మాత్రమే కాదు.. నాన్-వెజ్ మానేయడం వల్ల ఇంకా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. నాన్ వెజ్కి దూరంగా ఉంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బరువు నియంత్రణలో ఉంటుంది. పూర్తి పోషకాలు తీసుకోవడం వల్ల మెరుగైన జీర్ణ వ్యవస్థ కలిగి ఉంటుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుదల తగ్గుతుంది.

# ఈ దేశంలో రెడ్ లిప్‌స్టిక్ వేసుకుంటే..



అందం కోసం మగువలు ఎన్నో మార్గాలు అన్వేషిస్తుంటారు. ఎంత మేకప్ వేసుకున్న అదరాలకు లిప్‌స్టిక్ అద్దకుంటే అలంకరణ పూర్తి కాదు. లిప్‌స్టిక్ అందం, ఆత్మవిశ్వాసానికి చిహ్నంగా భావిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల లిప్‌స్టిక్‌లు అందుబాటులో ఉన్నాయి. లిప్‌స్టిక్ వివిధ రంగులలో కూడా లభిస్తుంటాయి. అందం కోసం మగువలు ఎన్నో మార్గాలు అన్వేషిస్తుంటారు. ఎంత మేకప్ వేసుకున్న అదరాలకు లిప్‌స్టిక్ అద్దకుంటే అలంకరణ పూర్తి కాదు. లిప్‌స్టిక్ అందం, ఆత్మవిశ్వాసానికి చిహ్నంగా భావిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల లిప్‌స్టిక్‌లు అందుబాటులో ఉన్నాయి. లిప్‌స్టిక్ వివిధ రంగులలో కూడా లభిస్తుంటాయి. అయితే లిప్‌స్టిక్ ధర మాత్రం బ్రాండ్ ప్రకారం మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా రెడ్ లిప్‌స్టిక్ ఉపయోగించే మహిళల సంఖ్య ఎక్కువట. కానీ ఇప్పుడు ఇదే ఎరుపు లిప్‌స్టిక్ మహిళలకు సమస్యగా మారింది. దీంతో ఓ దేశం మహిళలు ఎరుపు రంగు లిప్‌స్టిక్ వేసుకోవడం పూర్తిగా నిషేధించింది. దీంతో ఆ దేశంలో మహిళలు తమ దేశంలో తయారు చేసిన లేత రంగు లిప్‌స్టిక్‌లను మాత్రమే ధరించడానికి అనుమతి ఉంది. ఎర్రటి లిప్‌స్టిక్‌ను నిషేధించిన దేశం ఏదో కాదు ఉత్తర కొరియా. కిమ్ జోంగ్ ఉన్ ఈ దేశ నియంత. ఈ దేశంలో ఎర్రటి లిప్‌స్టిక్‌ను పాశ్చాత్య సంస్కృతి, పెట్టుబడిదారీ విధానానికి చిహ్నంగా భావిస్తారట. అందుకే ఈ దేశంలో ఎర్రటి లిప్‌స్టిక్‌పై అనధికారికంగా కఠినమైన ఆంక్షలు ఉన్నాయి.

ఉత్తర కొరియాలో ఎరుపు రంగు లిప్‌స్టిక్ గ్లామర్, వ్యక్తిగత ఆకర్షణ, పాశ్చాత్య ప్రభావానికి చిహ్నంగా భావిస్తారు. ఈ రకమైన మేకప్ యువతలో వ్యక్తివాదాన్ని పెంచుతుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఈ వింత ఆంక్షలు అమలు చేస్తున్నాడు. ఇలా చేయడం వల్ల దేశం సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చని కిమ్ జోంగ్ ఉన్ విశ్వసిస్తున్నారు. అందుకే అక్కడ ఎరుపు రంగు లిప్‌స్టిక్ వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఉత్తర కొరియాలో మహిళలు తేలికపాటి లిప్‌స్టిక్, పరిమిత మేకప్ మాత్రమే ధరించడానికి అనుమతి ఉంది. విదేశీ బ్రాండ్లు, ముదురు రంగులు, ఆడంబరమైన మేకప్ నిబంధనలకు విరుద్ధమైనవట. ఈ నియమాలను ఉల్లంఘించి ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటారు.

# టిఫిన్ తినకపోతే షుగర్ వస్తుందా!



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది సమయం లేకనో లేదా బరువు తగ్గాలనే ఉద్దేశంతోనో చేసే అతిపెద్ద తప్పు అల్పాహారం మానేయడం. ఆఫీసు హడావిడిలోనో, ఆలస్యంగా నిద్రలేవడం వల్లనో టిఫిన్ చేయకుండా నేరుగా మధ్యాహ్నం భోజనం చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. బ్రేక్ ఫాస్ట్ ఎందుకు ముఖ్యం: రాత్రి భోజనం తర్వాత దాదాపు 8 నుండి 10 గంటల పాటు మన శరీరం ఆహారం లేకుండా ఉంటుంది. నిద్ర లేచిన తర్వాత శరీరానికి, మెదడుకు తక్షణ శక్తి అవసరం. ఉదయాన్నే అల్పాహారం తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీనిని దాటవేయడం వల్ల శరీర పనితీరు మందగించి, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది. అల్పాహారం మానేసే వారికి టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 30 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఉదయం ఆహారం తీసుకోకపోతే రక్తంలోని గ్లూకోజ్ స్థాయిల్లో అసమతుల్యత ఏర్పడుతుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడానికి శరీరం అధికంగా ఇన్సులిన్ను ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. దీనివల్ల క్లోమ గ్రంథి త్వరగా అలసిపోయి, ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. ఇది చివరికి మధుమేహంగా మారుతుంది. చాలా మంది అల్పాహారం మానేస్తే కేలరీలు తగ్గి బరువు తగ్గుతామని భావిస్తారు. కానీ సోషల్ మీడియాలో వచ్చే ఈ వార్తలు పూర్తిగా అవాస్తవం. ఉదయం పూట ఏమీ తినకపోవడం వల్ల మధ్యాహ్నానికి ఆకలి విపరీతంగా పెరుగుతుంది. దీనివల్ల భోజన సమయంలో తెలియకుండానే ఎక్కువ ఆహారం తీసేసుకుంటారు. తీవ్రమైన ఆకలి వల్ల మనసు ఫాస్ట్ ఫుడ్, స్నాక్స్ లేదా స్వీట్ల వైపు మొగ్గు చూపుతుంది.మెటబాలిజం మందగించడం: ఆహారం లేకపోవడం వల్ల జీవక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల శరీరంలో కేలరీలు తక్కువగా బర్న్ అయ్యి, కొవ్వు రూపంలో నిల్వ చేరతాయి. ఫలితంగా బరువు తగ్గడానికి బదులు మరింత పెరుగుతారు. శక్తి తగ్గుదల – అలసట: జీవక్రియ నెమ్మదించడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పడిపోతాయి. దీనివల్ల రోజంతా నీరసంగా ఉండటం ఏ పనిపైనా ఏకాగ్రత కుదరకపోవడం, త్వరగా అలసిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయం పూట పోషకాలున్న ఆహారాన్ని ఖచ్చితంగా తీసుకోవాలి. అల్పాహారం అనేది కేవలం ఆకలి తీర్చుకోవడమే కాదు.. అది మీ రోజువారీ ఆరోగ్యానికి పునాది.




# క్రిస్మస్ వేళ ఎవరీ 'సీక్రెట్ శాంటా'?

డిసెంబర్ వచ్చిందంటే చాలు ప్రపంచమంతా క్రిస్మస్ వెలుగులతో నిండిపోతుంది. రంగురంగుల విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలు, కేకులతో పాటు ప్రతి ఆఫీసులోనూ, స్నేహితుల మధ్య ఒక వింతైన ఆట మొదలవుతుంది. అదే 'సీక్రెట్ శాంటా'. డిసెంబర్ వచ్చిందంటే చాలు ప్రపంచమంతా క్రిస్మస్ వెలుగులతో నిండిపోతుంది. రంగురంగుల విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలు, కేకులతో పాటు ప్రతి ఆఫీసులోనూ, స్నేహితుల మధ్య ఒక వింతైన ఆట మొదలవుతుంది. అదే 'సీక్రెట్ శాంటా'. ఎవరో ఒకరు మనకు తెలియకుండా మన డెస్క్ మీద గిఫ్టులు పెట్టి వెళ్తుంటారు, అలాగే మనం కూడా ఎవరికో ఒకరికి గిఫ్ట్ పంపాలి కానీ అది మనమే అని వారికి తెలియకూడదు. ఈ దాగుడుమూతల గిఫ్ట్ గేమ్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఒక ట్రెండ్‌గా మారింది. అయితే ఈ సంప్రదాయం ఊరికే పుట్టలేదు. దీని వెనుక వందల ఏళ్ల చరిత్ర, ఒక గొప్ప మనసున్న వ్యక్తి కథ దాగి ఉంది. ఈ ఆధునిక సంప్రదాయానికి ఆద్యుడు లారీ డీన్ స్టీవర్ట్ అనే అమెరికన్ బిజినెస్ మ్యాన్ అని చెబుతుంటారు. 1970వ దశకంలో ఆయన తన జీవితంలో ఎన్నో కష్టాలను అనుభవించారు. కానీ ఒకసారి తన వ్యాపారం పుంజుకున్నాక, తాను పడిన కష్టాలు ఇతరులు పడకూడదని నిర్ణయించుకున్నారు. ప్రతి ఏడాది క్రిస్మస్ సమయంలో ఆయన అపరిచితులకు, పేదవారికి తన పేరు బయట పెట్టకుండా 100 డాలర్ల నోట్లను పంచుతుండేవారు. దాదాపు 25 ఏళ్ల పాటు తన ఎవరో ఎవరికీ తెలియకుండా ఈ దానధర్మాలు చేశారు. అందుకే ఆయనను 'ఒరిజినల్ సీక్రెట్ శాంటా' అని పిలుస్తారు. ఈ సంప్రదాయం కేవలం అమెరికాకు మాత్రమే పరిమితం కాలేదు. వివిధ దేశాల్లో దీనిని రకరకాల పేర్లతో పిలుస్తారు. స్కాండినేవియాలో దీనిని 'జుల్‌క్లాప్' అని పిలుస్తారు. ఎవరో ఒకరు ఇంటి తలుపు కొట్టి, పేరు చెప్పకుండా గిఫ్ట్ వదిలేసి వెళ్ళడం ఇక్కడి ఆచారం. జర్మనీలో ఇక్కడ 'విక్టెల్స్' అని పిలుస్తారు. అంటే ఒక చిన్న దేవత లేదా పిశాచి అని అర్థం. వారు తెలియకుండా గిఫ్టులు ఇస్తారని వారి నమ్మకం. ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో 'సీక్రెట్ శాంటా' అనేది కేవలం గిఫ్టులకే పరిమితం కాలేదు. ఇది ఉద్యోగుల మధ్య సంబంధాలను మెరుగుపరచడానికి ఒక మంచి మార్గంగా మారింది.

ఆఫీసులో ఒకరితో ఒకరికి పెద్దగా పరిచయం లేని వారు కూడా ఈ ఆట వల్ల మాట్లాడుకోవడం మొదలుపెడతారు. ఏడాది పొడవునా పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు ఈ సరదా పండుగ వాతావరణం ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. అందరూ కలిసి గిఫ్టులు ఇచ్చుకోవాలి అంటే ఖరీదైనవి కాకుండా, ఒక నిర్ణీత బడ్జెట్‌లో కొనుక్కోవడం వల్ల ఎవరికీ భారం అనిపించదు. ఎవరు ఏ గిఫ్ట్ ఇస్తారో అన్న ఉత్సుకత, చివరి రోజున మన శాంటా ఎవరో తెలుసుకున్నప్పుడు కలిగే ఆనందం.. ఇవే ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ సజీవంగా ఉంచుతున్నాయి. బహుమతి చిన్నదా పెద్దదా అన్నది ముఖ్యం కాదు, దాని వెనుక ఉన్న ఆ ప్రేమ, సంతోషం పంచడమే ఈ 'సీక్రెట్ శాంటా' అసలైన ఉద్దేశం. మరి ఈ ఏడాది మీ సీక్రెట్ శాంటా ఎవరో గెస్ చేశారా?



# చలికాలంలో ఫ్రిజ్ వాటర్ తాగితే జలుబు చేస్తుందా!

చలికాలం వచ్చిందంటే చాలు.. అందరి ఇళ్లలో ఫ్రిజ్ వాటర్ ఆగిపోతుంది. పొరపాటున ఎవరైనా చల్లని నీరు తాగితే, "చలికాలంలో చల్లని నీళ్లు తాగితే జలుబు చేస్తుంది" అని ఇంట్లోని పెద్దలు హెచ్చరిస్తుంటారు. అసలు చలికాలంలో చల్లని నీరు తాగడానికి, జలుబు లేదా ఫ్లూ రావడానికి మధ్య ఏమైనా సంబంధం ఉందా? వైద్య శాస్త్రం దీని గురించి ఏం చెబుతోంది?వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, జలుబు లేదా ఫ్లూ రావడానికి ప్రధాన కారణం వైరస్లు. ఇవి గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. జలుబు ఉన్న వ్యక్తి తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా ఈ వైరస్లు ఇతరులకు సోకుతాయి. ఈ వైరస్లు నీటిలో ఉండవు, కాబట్టి చల్లని నీరు తాగడం వల్ల నేరుగా జలుబు రాదు. నిజానికి, క్రీడాకారులు తమ శరీర సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఎప్పుడూ చల్లని నీరే తాగుతుంటారు, వారికి దీని వల్ల జలుబు సోకడం లేదు కదా అని వైద్యులు ప్రశ్నిస్తున్నారు. చలికాలంలో జలుబు, దగ్గు ఎక్కువగా రావడానికి కారణం వాతావరణంలో మార్పులే. ఈ సీజన్లో గాలిలో తేమ తగ్గి పొడిబారుతుంది. దీనివల్ల వైరస్లు ఎక్కువ కాలం జీవించడానికి, వేగంగా వ్యాపించడానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి. అలాగే, చలి నుంచి తప్పించుకోవడానికి అందరూ కిటికీలు, తలుపులు మూసేసి ఒకే చోట గుంపుగా ఉండటం వల్ల కూడా ఇన్ఫెక్షన్లు త్వరగా సోకుతాయి. చల్లని నీరు తాగడం వల్ల నేరుగా జలుబు రాకపోయినా, కొన్ని సందర్భాల్లో ఇది శరీరంపై ప్రభావం చూపుతుంది. చల్లని నీరు తాగడం వల్ల ముక్కులోని శ్లేష్మం గట్టిపడి, గాలి పీల్చుకోవడంలో స్వల్ప ఇబ్బంది కలగవచ్చు. ఇప్పటికే జలుబు ఉన్నవారు చల్లని నీరు తాగితే, అది గొంతులోని రక్తనాళాలను కుంచించుకుపోయేలా చేసి నొప్పిని లేదా అసౌకర్యాన్ని పెంచుతుంది. అతిగా చల్లని నీరు తాగడం వల్ల జీర్ణ ప్రక్రియ నెమ్మదించే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తానికి చల్లని నీరు తాగడం వల్లే జలుబు వస్తుందనేది ఒక అపోహ మాత్రమే. అయితే, వాతావరణం ఇప్పటికే చల్లగా ఉన్నప్పుడు శరీర ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచుకోవడానికి గోరువెచ్చని నీరు తాగడం మంచిది. జలుబు రాకుండా ఉండాలంటే తరచుగా చేతులు కడుక్కోవడం, రోగనిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవడం మరియు ఇన్ఫెక్షన్ ఉన్నవారికి దూరంగా ఉండటం ముఖ్యం.



# క్యారెట్ పచ్చిగానే నమిలి తింటే.. జీవితంలో క్యాన్సర్ రాదట!

క్యారెట్లు తినడం ఆరోగ్యానికి మంచిదన్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. వారానికి కనీసం రెండుసార్లు క్యారెట్లు తినడం వల్ల తీవ్రమైన వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. క్యారెట్లను సలాడ్ల నుంచి జ్యూస్ల వరకు అనేక విధాలుగా తినవచ్చు. క్యారెట్లు తినడం ఆరోగ్యానికి మంచిదన్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. వారానికి కనీసం రెండుసార్లు క్యారెట్లు తినడం వల్ల తీవ్రమైన వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. క్యారెట్లను సలాడ్ల నుంచి జ్యూస్ల వరకు అనేక విధాలుగా తినవచ్చు. ముఖ్యంగా శీతాకాలంలో క్యారెట్లు తాజా కూరగాయలు, పండ్లతో పాటు తక్కువ ధరకే లభిస్తాయి. కాబట్టి ఈ కాలంలో తాజా క్యారెట్లను తినడం చాలా సులువు. ఇవి తినడానికి రుచికరంగా కూడా ఉంటాయి. ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. కొంతమంది తాజా క్యారెట్లను పచ్చిగా తింటారు. మరికొందరు వాటిని వివిధ వంటలలో తయారు చేసి తింటారు. ప్రత్యేకత ఏమిటంటే మీరు ఈ క్యారెట్లను ఎలా తిన్నా, అవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇటీవలి అధ్యయనం ప్రకారం.. వారానికి 2 నుండి 4 పచ్చి క్యారెట్లు తినడం వల్ల కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రమాదాన్ని దాదాపు 17 శాతం తగ్గించవచ్చుట. కొలొరెక్టల్ క్యాన్సర్ అనేది పెద్దప్రేగు లేదా పురీషనాళంలో ప్రారంభమయ్యే క్యాన్సర్. ఇది సాధారణంగా పాలిప్స్ అని పిలువబడే పెరుగుదలల వల్ల సంభవిస్తుంది. క్యారెట్లలో కెరోటినాయిడ్లు, లుటిన్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. వీటిని వారానికి కనీసం రెండుసార్లు తీసుకోవడం పాలిప్స్ పేగుల్లో ఏర్పడకుండా నిరోధిస్తుంది. క్యారెట్లు శరీర రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. వాటి శోథ నిరోధక లక్షణాల కారణంగా అవి రక్త నాళాలపై ఒత్తిడిని తగ్గిస్తాయి. విటమిన్ కె, విటమిన్ బి6 వంటి ఇతర పోషకాలకు మంచి మూలం. వీటిలోని బీటా-కెరోటిన్ రేచీకటి, కంటి సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. అయితే క్యారెట్లతో తయారు చేసిన స్వీట్లు లేదా ఇతర ఆహారాలను తినడం కంటే పచ్చి క్యారెట్లు తినడం ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులోని ఫైబర్ కంటెంట్ కారణంగా వీటిని ఎక్కువగా తినడం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి తినేటప్పుడు జాగ్రత్తగా ఉండటం మంచిది.

# ఈ తప్పులు చేస్తున్నారా?



జిమ్‌కి వెళ్లడం మంచి ఆరోగ్యానికి అవసరం. మీరు ప్రతిరోజూ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య సమస్యలు దూరంగా ఉంటాయి. అయితే మహిళలు కొన్ని ప్రత్యేక సమయాల్లో జిమ్‌లో కసరత్తులు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్యా నిపుణులు సూచిస్తున్నారు. జిమ్‌కి వెళ్లడం మంచి ఆరోగ్యానికి అవసరం. మీరు ప్రతిరోజూ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య సమస్యలు దూరంగా ఉంటాయి. అయితే మహిళలు కొన్ని ప్రత్యేక సమయాల్లో జిమ్‌లో కసరత్తులు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్యా నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పీరియడ్స్ సమయంలో అమ్మాయిలు 4 నుండి 5 రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. అయితే కొందరు ఈ సమయంలో రన్నింగ్, వాకింగ్ వంటి చూయడం కూడా కనిపిస్తుంది. ఇది మాత్రమే కాదు వారు జిమ్‌లో బరువులు ఎత్తడం కూడా చేస్తారు. అయితే పీరియడ్స్ సమయంలో ఇలా చేయడం నిజంగా మంచిదేనా? అనే అభిప్రాయం చాలా మందికి ఉంటుంది. ఎందుకంటే ఈ సమయంలో చాలా మంది అసౌకర్యాన్ని అనుభవిస్తారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం పీరియడ్స్ సమయంలో మహిళలు వీలైనంత ఎక్కువ విశ్రాంతి తీసుకోవడం మంచిది. ఎందుకంటే మీకు ఎటువంటి అసౌకర్యం అనిపించకపోయినా ఈ సమయంలో శరీరం అనేక ప్రధాన మార్పుల ద్వారా వెళుతుంది. మీరు పీరియడ్స్ సమయంలో బరువులు ఎత్తితే అది మీ శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా ఇది ప్రేగులపై నేరుగా ప్రభావం చూపుతుంది. అలాంటి సందర్భంలో మీరు వీలైతే జిమ్‌కు వెళ్లకుండా ఉండాలి. తేలికపాటి యోగాసనాలు చేయడం మంచిదే. అయితే జిమ్‌కు వెళ్లి భారీ వ్యాయాయాలు చేయడం ప్రమాదకరం.

# కోహ్లీ ఆటను చూసేందుకు చెట్లు, కంటైనర్లు ఎక్కిన అభిమానులు

- విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా నిన్న ఢిల్లీ, ఆంధ్రా మ్యాచ్
- కోహ్లీ ఆటను చూసేందుకు ప్రమాదకర రీతిలో చెట్లు ఎక్కిన అభిమానులు
- చెట్టు పైకి ఎక్కి వీడియో రికార్డు చేసిన ఒక అభిమాని






**హైదరాబాద్ పెన్ పవర్:** స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఆటను వీక్షించేందుకు అభిమానులు చెట్లు ఎక్కారు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా బెంగళూరు వేదికగా ఆంధ్రతో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆటగాడు కోహ్లీ 131 పరుగులతో ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం కాకపోవడంతో కొందరు అభిమానులు ప్రమాదకర రీతిలో వేదిక చుట్టుపక్కల ఉన్న చెట్లపైకి ఎక్కి కోహ్లీ ఆటను తిలకించారు. భద్రతా కారణాలను చూపుతూ కర్ణాటక ప్రభుత్వం ఎం. చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించడానికి అనుమతి నిరాకరించింది. దీంతో కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ మ్యాచ్‌లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు మార్చింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానం గ్రౌండ్ 1 గేట్లను తెరవకుండానే బీసీసీఐ ఈ మ్యాచ్‌ను నిర్వహించడంతో క్రికెట్ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. దీంతో పలువురు కోహ్లీ అభిమానులు సమీపంలోని చెట్లు ఎక్కి మ్యాచ్‌ను వీక్షించారు. ఈ మ్యాచ్‌ను చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి కూడా అభిమానులు తరలివచ్చారు. ఎంతో దూరం నుంచి వచ్చిన వారు తమ అభిమాన ఆటగాడు కోహ్లీ మ్యాచ్‌ను ఎలాగైనా చూడాలనే తపనతో చెట్లు ఎక్కారు. మరికొంతమంది అక్కడే ఆగి ఉన్న కంటైనర్ల పైకి ఎక్కి మ్యాచ్ చూశారు. ఒక అభిమాని అయితే చెట్టు పైనుంచి మ్యాచ్‌ను వీడియో తీశాడు.

# కాకా క్రికెట్ టోర్నమెంట్: పెద్దపల్లి జిల్లాపై కరీంనగర్ జిల్లా గ్రాండ్ విక్టరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** కాకా వెంకటస్వామి మెమోరియల్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ లో పెద్దపెల్లి జిల్లా జట్టుపై కరీంనగర్ జిల్లా జట్టు 82 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని నాలుగు జట్లలో కరీంనగర్ జట్టు టాప్ స్థానానికి చేరుకుంది .డిసెంబర్ 25న ముందుగా బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది కరీంనగర్ జిల్లా జట్టు. అనంతరం 144 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన పెద్దపల్లి జట్టు 17.5 ఓవర్లలో కేవలం 61 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. 60 పరుగులు చేసిన కరీంనగర్ జిల్లా జట్టుకు చెందిన బ్యాట్స్ మన్ సయ్యద్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తోపాటు గెలుపొందిన జట్టుకు షీల్డ్ అందజేశారు కరీంనగర్ నగర మాజీ మేయర్ సునీల్ రావు, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు. రాజన్న సిరిసిల్ల- జగిత్యాల జిల్లా జట్ల మధ్య మరో మ్యాచ్ ప్రారంభం అయ్యింది. ఇవాల్టితో టాప్ 2లో మిగిలిన జట్ల మధ్య డిసెంబర్ 26న మరొక మ్యాచ్ జరగనుంది. రేపటి మ్యాచ్ అనంతరం విన్నింగ్ జట్టుకు ట్రోఫీని అందజేయనున్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి.

# వండర్ వేవ్.. వైభవ్ .. ప్రపంచానికి పరిచయం చేసిన 2025

- ఇంకా 15 ఏళ్లే రాలేదు..
- పాల బుగ్గల పసితనమే పోలేదు..!
- స్కూల్ బ్యాగ్ మోసే వయసులోనే..
- క్రికెట్‌లో పెను తుపాను సృష్టిస్తున్నాడు
- సెంచరీల మీద సెంచరీలు చేస్తున్నాడు
- బ్యాట్‌తో వీర బాదుడు బాదుతూ
- అకస్మాత్తుగా.. అద్భుత అలలా ఎగిశాడు..
- అతడే వండర్ వేవ్.. వైభవ్ సూర్యవంశీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైభవ్ సూర్యవంశీ .. ఐపీఎల్ ( 2025కు ముందు ఈ టీనేజ్ క్రికెటర్ పేరు కొద్ది మందికి మాత్రమే తెలుసు! కానీ ఐపీఎల్ తర్వాత పరిస్థితి మారిపోయింది. సంచలన ఇన్నింగ్స్‌తో, మెరుపు సెంచరీలతో ఈ 14 ఏళ్ల బ్యాటర్ 'టాక్ ఆఫ్ ది క్రికెట్'గా మారిపోయాడు. ఐపీఎల్‌లో అడుగు పెట్టడంతోనే రికార్డు సృష్టించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అతి పిన్న వయసులో (14 ఏళ్ల 23 రోజులు) అరంగేట్రం చేసిన ఆటగాడిగా నిలిచాడు. బిహార్‌కు చెందిన వైభవ్ గతేడాది ఐపీఎల్ మెగా వేలంలో రూ.1.10 కోట్ల ధర పలికాడు.

**'ఆరు'తో అరంగేట్రం!**

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వైభవ్.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తన తొలి మ్యాచ్ ఆడాడు. తుది జట్టులో చోటు దక్కకపోయినా ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు దిగాడు. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచి అందర్నీ విస్మయానికి గురి చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో మొత్తం మీద 20 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 34 పరుగులు చేశాడు. అయితే అతడు ఔటైన అనంతరం కళ్లను రుద్దుకుంటూ పెవిలియన్‌కు చేరాడు. దీంతో వైభవ్ కన్నీరు కార్చాడంటూ సోషల్‌మీడియాలో ఊహాగానాలు చెలరేగాయి. అయితే తాను ఏడ్వలేదని, మైదానం నుంచి బయటకు వచ్చేటప్పుడు అక్కడున్న పెద్ద స్క్రీన్ వైపు చూడటం వల్ల కాంతి కళ్లను తాకిందన్నాడు. దాంతో కళ్లను రుద్దుకోవాల్సి వచ్చిందని వైభవ్ తర్వాత వివరణ ఇచ్చాడు.

**ఆడిన మూడో మ్యాచ్‌లోనే..**

గుజరాత్ టైటాన్స్‌తో రాజస్థాన్ రాయల్స్‌కు 28 ఏప్రిల్ 2025న మ్యాచ్ జరిగింది. ఇది వైభవ్‌కు కేవలం మూడో మ్యాచ్. కానీ అతడు ఈ టీ20లో మెరుపు సెంచరీతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. కేవలం 35 బంతుల్లోనే శతకం బాది ఔరా అనిపించాడు. మొత్తం మీద 38 బంతుల్లో 101 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఇందులో 4 ఫోర్లు, 11 సిక్స్‌లున్నాయి.

**ఆసియా కప్ రైజింగ్ స్టార్స్, అండర్-19లో..**

ఈ టీనేజ్ థండర్.. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో ఇండియా-ఎ తరఫున యూఏఈపై 32 బంతుల్లోనే సెంచరీ చేశాడు. కేవలం 42 బంతుల్లోనే 144 పరుగులు చేశాడు. అందులో 11 ఫోర్లు, 15 సిక్స్‌లు ఉండడం విశేషం. అలాగే వన్డే ఫార్మాట్లో జరిగిన ఆసియా కప్ అండర్-19లోనూ వైభవ్ యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో భారీ సెంచరీతో చెలరేగిపోయాడు. 95 బంతుల్లోనే 171 పరుగులు చేశాడు. ఇందులో 9 ఫోర్లు, 14 సిక్స్‌లున్నాయి.

**'సయ్యద్ ముస్తాక్ అలీ'లో..**

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ లో అతిపిన్న వయసు (14 ఏళ్ల 250 రోజులు)లో సెంచరీ చేసిన ఆటగాడిగా ఇటీవలే వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. మహారాష్ట్ర, బిహార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో అతడు ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ (108లిబీ 61 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీ బాదాడు. మొత్తం మీద వైభవ్ సూర్యవంశీ.. 15 ఏళ్లు నిండకముందే టీ20ల్లో మూడో సెంచరీ సాధించడం విశేషం. అంతకుముందు ఐపీఎల్ 2025, ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025లోనూ వైభవ్ శతకాలతో చెలరేగాడు.

**తాజాగా 'విజయ్ హజారే'లో..**

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా.. రాంచి వేదికగా బుధవారం బిహార్, అరుణాచల్ ప్రదేశ్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లోనూ వైభవ్ సూర్యవంశీ సూపర్‌సెంచరీతో అదరగొట్టాడు. కేవలం 36 బంతుల్లోనే సెంచరీ బాది రికార్డ్ సృష్టించాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్ (190బీ 84 బంతుల్లోబీ 16 ఫోర్లు, 15 సిక్స్‌లు) తృటిలో డబుల్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. క్రీజులో ఉన్నంత వరకు సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ప్రత్యర్థి బౌలర్లకు ముచ్చెమటలు పట్టించాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన బిహార్ 574 పరుగులు చేయడంలో వైభవ్ కీలకపాత్ర పోషించాడు.

ఇలా 2025 సంవత్సరం వైభవ్ సూర్యవంశీ.. అనే పెను తుపాన్‌ను క్రికెట్ ప్రపంచానికి పరిచయం చేసింది. అలాగే భవిష్యత్తు టీమ్‌ఇండియా సూపర్‌స్టార్‌నూ వెలుగులోకి తెచ్చింది. అతడికి భారత సీనియర్ జట్టులో వీలైనంత త్వరగా చోటు కల్పించాలనే డిమాండ్లూ ఊపందుకుంటున్నాయి. త్వరలోనే ఆ రోజూ రావాలని టీమ్‌ఇండియా అభిమానులు కోరుకుంటున్నారు!

# రాజాసాబ్ బ్యూటీ వీపందం

శార్వరి తెల్లటి రంగులో వేడిని పెంచింది, ఇంటర్నెట్ దూరంగా కనిపించదు





క్యూట్ లుక్స్, చిక్లెట్ చిక్స్‌తో కుర్రకారు గుండెల్లో గుబులు పెంచుతోంది ఈ బ్యూటీ. రాజాసాబ్ చిత్రంతో తన లక్ చెక్ చేసుకునేందుకు సిద్ధమవుతున్న ఈ క్యూట్ బ్యూటీ పేరు రిద్ధి కుమార్. చెన్నై కి చెందిన ఈ క్యూటీ ఇంతకుముందు - లవర్ - అనే చిత్రంతో తెరకు పరిచయమైంది. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ ప్రభాస్ సినిమాల్లో అవకాశాలు అందుకుంటోంది. ప్రస్తుతం - రాజాసాబ్ - తన కెరీర్‌కి బిగ్ బ్రేక్ నిస్తుందని రిద్ధి కుమార్ ఆశిస్తోంది.

ఇటీవలి - రాజా సాబ్ - కి సోషల్ మీడియాలలో ప్రచారం కల్పిస్తూ, రిద్ధి రెచ్చిపోతోంది. ముఖ్యంగా తన స్వస్థలం చెన్నైలో రాజా సాబ్ కి బోలెడంత హైప్ క్రియేట్ చేస్తోంది. ఇంతకుముందు పాటల ఆవిష్కరణ కార్యక్రమంలో రిద్ధి సందడి చాలా హుషారెత్తించింది. వేదికపై ఎందరు ఉన్నా రిద్ధి ముందు నిలబడలేకపోయారంటే తన సందడి ఏ రేంజులో ఆకర్షించిందో అర్థం చేసుకోవచ్చు. రిద్ధి కుమార్ ఇటీవల సోషల్ మీడియా సంచలనంగా అందరి హృదయాల్లో నిలిచి ఉంది. తనకు విపరీతమైన హైప్ లేకపోయినా కానీ, తన లుక్స్, గట్స్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారుతోంది.

ముఖ్యంగా -రాధే శ్యామ్ - తర్వాత ప్రభాస్‌తో రెండోసారి కలిసి నటిస్తోంది. ఇది తనకు స్వస్థలం చెన్నైలోను క్రేజ్ పెంచుతోంది. భారతదేశంలోని బిగ్గెస్ట్ పాన్ ఇండియన్ స్టార్ సరసన రిద్ధి కపూర్ ఆవకాశాలు అందుకుంటోంది. రాజా సాబ్‌లో మెయిన్ స్ట్రీమ్ నాయికలుగా మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ నటించినా కానీ, రిద్ధి కూడా ప్రభావవంతమైన పాత్రతో ఆకట్టుకోనుందని తెలిసింది.తాజాగా రిద్ధి బ్యాక్ లెస్ ఫోజ్ తో గుబులు పెంచుతోంది. డార్క్ నేవీ బ్లూ ఫ్రాక్ ధరించిన రిద్ధి కుమార్ చురుకైన చూపులతో గుండె గుల్ల చేస్తోంది. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. ఒక్కో సినిమాతో గ్లామర్ ప్రపంచంలో తన కెరీర్ రన్ ని మెరుగుపరుచుకోవాలని ప్రయత్నిస్తున్న ఈ చెన్నై చంద్రానికి ఆల్ ది బెస్ట్ చెబుతోంది తెలుగు యూత్.



రితికా నాయక్ మెజెంటా చీర మీరు చూడాల్సిందే

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965